మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 18 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 283 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

పూల పండుగ.. ఫైనల్ వేడుకలు..

నేడు సద్దుల బతుకమ్మ



ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలె..

సీఎం రేవంత్ రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 17: ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు నిలవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్ర మంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలో

...మిగతా 2లో

మురికి టాయిలెట్ ఫొటో పెట్టు.. రూ.1000 రివార్డ్ పట్టు



2

సింగరేణి భవిష్యత్తుకు మన శ్రమే పునాది

సింగరేణీయులకు ఉప ముఖ్యమంత్రి భట్టి బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షల లేఖ


2

ప్రపంచ ఆకలి సూచీలో

భారత్‌కు 100వ స్థానం

ర్యాంకు ఎంత ఎక్కువ ఉంటే అంత ఎక్కువ ఆకలి ఉన్నట్టు

ఢిల్లీ, అక్టోబర్ 17: ప్రపంచ ఆకలి సూచీ-2026 ర్యాంకులు వెలువడ్డాయి. మొత్తం 122 దేశాల్లోని పరిస్థితులను సమీక్షించగా 24.1 స్కోరుతో భారత్ 100వ స్థానం, 25.5 స్కోరుతో పాకిస్థాన్ 106వ ర్యాంకు పొందాయి. రెండు దేశాలూ 'తీవ్రమైన ఆకలి' కేటగిరీలో ఉన్నాయి. దక్షిణాసియా ప్రాంతీయ స్కోరు 23.5గా నమోదింది. స్కోరు ఎంత తక్కువగా ఉంటే ఆకలి అంత తక్కువగా ఉన్నట్టు లెక్క. పిల్లల్లో పౌష్టికాహార లోపం, దీర్ఘకాలం పాటు పోషకాహారం అందుబాటులో లేకపోవడం, బరువు తక్కువగా ఉండడం, శిశు మరణాలను పరిగణనలోకి తీసుకొని ఆకలి సూచీలను లెక్కించారు.





ప్రజా చైతన్యానికి యువ దర్శకులు కదలాలి

భారతీయ సినిమాకు హైదరాబాద్‌ను ప్రధాన కూడలిగా తీర్చిదిద్దుతం

యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

హైదరాబాద్‌లో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 17: యువ ఫిలిం మేకర్లు తమ సృజనాత్మకతతో సమాజాన్ని ఆలోచింపజేసే లఘు చిత్రాలను రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. బతుకమ్మ పండుగలో రంగురంగుల పూలు ఎలా విరబూస్తాయో, యువ ఫిలిం మేకర్ల జీవితాలు కూడా విజయాలతో అలా వికసించాలని ఆకాంక్షించారు. యువ దర్శకులు మంచి కథలతో ముందుకు వచ్చి, వినోదంతో పాటు సమాజానికి మేలు చేసే చిత్రాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ను

...మిగతా 2లో



దుర్గాపూజ పండాల్‌లో తొక్కిసలాట

17 మంది మృతి

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

అసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన సీఎం సువేందు అధికారి

కోల్‌కతా, అక్టోబర్ 17: పశ్చిమ బెంగాల్లోని కోల్‌కతాలో సామూహిక దుర్గాపూజలో అపశ్రుతి చోటుచేసుకుంది. మండపం వద్ద జనం ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొందరు గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఆసుపత్రిలో 25 మంది చేరగా..

...మిగతా 2లో

దాండియా వేడుకల్లో విషాదం

ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని మృతి

హైదరాబాద్, అక్టోబర్ 17: రంగారెడ్డి జిల్లా నాదర్గుల్లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రమాదం జరిగింది. కాలేజీలో నిర్వహించిన దాండియా ఈవెంట్లో విషాదం చోటుచేసుకుంది. లైటింగ్ సిస్టమ్

...మిగతా 2లో

మూడు దశల్లో సమగ్ర భూసర్వే

వచ్చేనెల చివరినాటికి మొదటి దశ పూర్తి!

మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు

పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ

రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం బ్యూరో): రాష్ట్రంలో భూ సమస్యలు, వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ అధికారులతో భూ సర్వే పురోగతిపై

...మిగతా 2లో

315 మండలాల్లో కరువు పరిస్థితులు

వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రికి తెలిపిన మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబర్ 17: తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేత్ బచావో అభియాన్ పై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణ నుంచి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అంశాలను లేవనెత్తారు. మొక్కజొన్న, జొన్న,

...మిగతా 2లో

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



రహదారి భద్రతా నిధుల నిర్వహణపై మార్గదర్శకాలు జారీ

జిల్లాల్లో రోడ్డు భద్రతా కమిటీలను వెంటనే క్రియాశీలం చేయాలి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం బ్యూరో): రాష్ట్రంలో రహదారి భద్రతను పటిష్టం చేయడం, ప్రమాదాలను అరికట్టడం, ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. భారత ప్రభుత్వ రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలలో రహదారి భద్రతా నిధుల సమర్థ నిర్వహణ పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈమేరకు శనివారం ఇక్కడ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలోని

...మిగతా 2లో

నితీశ్ కోసం 9 మందిని మర్డర్ చేయించాను

జేడీయూ ఎమ్మెల్యే అనంత్ సంచలన వ్యాఖ్యలు



పాట్నా, అక్టోబర్ 17: జేడీయూ ఎమ్మెల్యే అనంత్ కుమార్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ కోసం తాను 9 మందిని చంపించానని ఆయన చెప్పారు. బిహోర్లో రానున్న మండలి ఎన్నికల్లో తన ప్రత్యర్థి నీరజ్ కుమార్ ను నిలబెట్టడంతో పార్టీ నాయకత్వంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నీర్ప విమర్శలు చేస్తూ ఆ వ్యాఖ్యలు చేశారు. 'నితీశ్కు, నాకు మధ్య చాలా కాలంగా సంబంధం ఉంది. ఆయనకు సాయం చేసేందుకు 9 మందిని నేను

...మిగతా 2లో

ఇది జెన్ జీ క్రియేషన్ బ్రో..!

గేమ్ రూపంలోకి జంతర్ మంతర్‌నిరసనలు

డిజిటల్ ప్రొటెస్ట్ అంటూ కామెంట్లు

ఢిల్లీ, అక్టోబర్ 17: ఢిల్లీలో జెన్ జీ చేపట్టిన నిరసనలు డిజిటల్ రూపంలోకి మారాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్కు వ్యతిరేకంగా నిరసనల నేపథ్యంలో.. 27 ఏండ్ల ఐటీ నిపుణుడు సురజ్ కుష్వాహ 'జంతర్ మంతర్ చలో' పేరుతో సెంట్రిక్ బ్రౌజర్-బేస్డ్

...మిగతా 2లో

మోడీ పాలనలో రాజ్యాంగ హక్కులకు ప్రమాదం

దేశ నిర్మాణం, పాలసీల రూపకల్పనలో ప్రొఫెషనల్స్‌దే కీలక పాత్ర

ఏఐసీసీ ప్రొఫెషనల్స్ చైర్మన్ మధుయాష్కి



3



రైళ్ల సంఖ్యా పెరుగుతుంది..

ఛార్జీలూ పెరుగుతయ్

హైదరాబాద్, అక్టోబర్ 17: దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రత్యేక రైళ్లల్లో అదనపు ఛార్జీలు వర్తిస్తాయని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్ల నుంచి ట్రైన్ల సంఖ్యను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

శిశువుల ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌ల వాడకం నిషేధం

ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

9

ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల హెరిటేజ్ టూర్

నిర్వహించిన తెలంగాణ పర్యాటక, వారసత్వ శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 17: తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం 2026 అక్టోబర్ 17న ప్రత్యేక వారసత్వ పర్యటన నిర్వహించబడింది.ఈ పర్యటన చారిత్రక కట్టడం చార్మినార్

...మిగతా 2లో

ఇంటర్‌నెట్ వినియోగ హక్కు బాలలకూ ఉంది

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ, అక్టోబర్ 17: ఇంటర్నెట్ వినియోగం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసుతో సంబంధం లేకుండా ఈ హక్కు పిల్లలందరికీ వర్తిస్తుందని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్లైన్ వేధింపులు, మోసాల నుంచి పిల్లలను రక్షించాలన్న పేరుతో వారికి ఇంటర్నెట్ను పూర్తిగా నిరాకరించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని జీవించే హక్కు (ఆర్టికల్ 21), భావప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)(ఎ)) కింద ఇంటర్నెట్ యాక్సెస్ కూడా ఒక భాగమేనని పేర్కొంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ తో కూడిన ధర్మాసనం ఈ చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ లు ఇతర ఆన్లైన్ సేవల నుంచి పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్య

...మిగతా 2లో

భారత్‌లో యువతపై వివక్ష, అణచివేత

ఐరాస ప్రతినిధి వివాదాస్పద వ్యాఖ్యలు • తోసిపుచ్చిన భారత్



న్యూయార్క్, అక్టోబర్ 17: భారత్‌లో యువత చేపట్టిన ఆందోళనల గురించి ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి గినా రొమెరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి పోరాడుతున్నందుకు ఆ యువత.. ప్రభుత్వం నుంచి వివక్ష, అణచివేతలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడడానికి వారికి తగిన స్వేచ్ఛ లేదంటూ పలు నివేదికలను ఐరాస సమావేశంలో ప్రస్తావించారు. ఈ ఆరోపణలను ఐరాసలోని భారత దౌత్యవేత్త అనుజ్ స్వరూప్ కొట్టిపడేశారు. గినా రొమెరో చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని స్పష్టం చేశారు. అధికారిక ధ్రువీకరణ లేని కొన్ని కథనాలను ఆధారంగా తీసుకొని..

...మిగతా 2లో

రష్యాపై ఆంక్షల్లో మినహాయింపులు

భారత్‌కు భారీ ఊరట

వాషింగ్టన్, అక్టోబర్ 17: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ టారిఫ్‌లు విధించేలా తీసుకొచ్చిన ఆంక్షల చట్టంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఈ చట్టం కింద రూపొందించిన పలు ఆంక్షలు, సుంకాలను ఎత్తివేశారు. అమెరికా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన నివేదికను కాంగ్రెస్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఈ ప్రకటనతో భారత్‌కు భారీగా ఊరట లభించినట్లయ్యింది. రష్యా నుంచి డీజిల్ నుంచి కొనుగోలుకు ఇటీవల ట్రంప్ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తొలుత 3 లక్షల టన్నులకు పైగా డీజిల్ సరఫరా చేస్తామని, నవంబరులో మరో 5 లక్షల టన్నులు పంపేందుకు రష్యా అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ఇంధన ధరలను వేగంగా తగ్గించడమే తన ప్రధాన లక్ష్యమని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఓవైపు రష్యా చమురు దిగుమతులు చేసుకునే దేశాలపై టారిఫ్‌లు

...మిగతా 2లో

మురికి టాయిలెట్ ఫొటో పెట్టు..
రూ.1000 రివార్డ్ పట్టు
'క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్' ప్రారంభించిన ఎన్‌హెచ్ఏఐ

ఢిల్లీ, అక్టోబర్ 17: జాతీయ రహదారుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో టాయిలెట్ల పరిశుభ్రతపైనా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. టోల్ ప్లాజాల్లో అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లను గుర్తించి, వాటి ఫొటోలను పంపేవారికి రూ.1000 బహుమతి పొందే అవకాశాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కల్పిస్తోంది. అక్టోబర్ 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఇటీవల ప్రకటించింది. జాతీయ రహదారుల్లోని టోల్ప్లాజాల్లో మురికిగా ఉండే టాయిలెట్లను గుర్తించేందుకు ''క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్'' పేరుతో ఓ కార్యక్రమాన్ని ఎన్‌హెచ్ఏఐ ఇటీవల ప్రారంభించింది. అపరిశుభ్రంగా ఉండే మూత్రశాలలు కనిపిస్తే ఫొటో తీసి 'రాజ్‌మార్గ్‌యాత్ర' యాప్లో అప్లోడ్ చేయాలి. వాహనదారుడి పేరుతో పాటు లొకేషన్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్లను ఇవ్వాలి.ఇలాంటి సంఘటనను నివేదించే వారికి వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.1000 రివార్డుగా లభిస్తుంది. అయితే, ఇది కేవలం హైవే టోల్ ప్లాజాల నిర్వహణలో ఉండే టాయిలెట్లకు మాత్రమే వర్తిస్తుందని, పెట్రోల్ బంకులు, దాబాలు, ఇతర ప్రదేశాలకు వర్తించదని ఎన్హెచ్ఏఐ స్పష్టం చేసింది.

సీఎం రేవంత్ రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ పండగ నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు మన తెలంగాణ అని చెప్పారు.

తీరొక్క పూలతో చేసిన, ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు నిలవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్ర మంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

ఇంటర్‌నెట్ వినియోగ హక్కు
బాలలకూ ఉంది

(మొదటి పేజీ తరువాయి)

సమాచారాన్ని గుర్తించి తొలగించే విధానాలను మరింత పటిష్ఠం చేయాలని కోర్టు ఆదేశించింది. పిల్లల భద్రత, వారి స్వేచ్ఛ రెండూ వేర్వేరు కాదని, పిల్లలు ఈ రెండింటినీ పొందేందుకు అర్హులని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒక నిర్దిష్ట వయసు వచ్చే వరకు పిల్లలకు ఇంటర్నెట్ హక్కు లేదనడం సరికాదని, వారి స్వేచ్ఛను హరించడమే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. ఆన్లైన్ వేదికలపై తగిన రక్షణ చర్యలు, పర్యవేక్షణ ఉండాలని సుప్రీం కోర్టు తెలిపింది. డిజిటల్ ప్రపంచంలో పిల్లల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ తీర్పు ద్వారా స్పష్టమైంది. మొత్తంగా దేశంలో డిజిటల్ హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

టెనీ సివిల్ సర్వీసెస్ అధికారుల హెరిటేజ్ టూర్

(మొదటి పేజీ తరువాయి)

వద్ద ప్రారంభమై, ప్రసిద్ధ చారిత్రక భవనం చౌమహల్లా ప్యాలెస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు హైదరాబాద్ నగర చరిత్ర, విశిష్ట నిర్మాణ శైలి, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం పొందారు. హైదరాబాద్ నగర సాంస్కృతిక గుర్తింపులో ఈ చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను, వాటి చారిత్రక నేపథ్యాన్ని శిక్షణలో ఉన్న అధికారులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక సంపదపై అవగాహన కల్పించడంతో పాటు, రాష్ట్ర పర్యాటక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు శాఖ చేపడుతున్న కార్యక్రమాల్లో ఈ వారసత్వ పర్యటన ఒక భాగం.

సింగరేణి భవిష్యత్తుకు మన శ్రమే పునాది

హైదరాబాద్, అక్టోబరు 17: బతుకమ్మ, దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సుస్థిర భవిష్యత్తు కోసం కొత్త గనుల సాధన, థర్మల్, సోలార్ రంగంలో బహుముఖ విస్తరణకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మారుతున్న బొగ్గు మార్కెట్లో పోటీని ఎదుర్కొంటూ సంస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూగర్భ, ఉపరితల గనుల్లో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ కార్మికులు వెలికితీసే బొగ్గు తెలంగాణ విద్యుత్ అవసరాలకు, రాష్ట్ర అభివృద్ధికి చోదక శక్తి అని అన్నారు. ఎల్ నినో ప్రభావం వంటి వాతావరణ సవాళ్ల వేళ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా నిరంతరంగా జరిగేలా మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మారుతున్న బొగ్గు మార్కెట్లో ఇతర సంస్థలతో పోటీపడాలంటే నాణ్యమైన బొగ్గును సరసమైన ధరకు అందించడం, ఉత్పాదకత పెంచడం, అనవసర ఖర్చులను తగ్గించడం అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని, యంత్రాలను పూర్తి పని గంటలు సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భద్రతకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని, ప్రతి కార్మికుడు క్షేమంగా ఇంటికి చేరడమే తొలి విజయమని స్పష్టం చేశారు.

137 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని భావితరాలకు మరింత బలంగా అందించేందుకు కొత్త గనుల సాధనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామని, తాడిచెర్ల-2 బ్లాక్కు మైనింగ్ లీజు పొందామని చెప్పారు. మణుగూరు ప్రకాశం ఖని ఓపెన్కాస్ట్-2 డిప్ సైడ్ బ్లాక్ను వేలం ద్వారా దక్కించుకున్నామని, సత్తుపల్లి-3, కోయగూడెం-3 బ్లాక్లను తిరిగి సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వివరించారు. బొగ్గుతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధనం, బంగారం, రాగి, ఇతర కీలక ఖనిజాల రంగాల్లోనూ సంస్థను విస్తరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు

కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఇటీవల నిర్వహించిన సమీక్షలో పలు ఆదేశాలు ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పెండింగ్లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలను వేగవంతం చేయాలని, మారు పేర్లకు సంబంధించిన సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించినట్లు చెప్పారు. సింగరేణి భూముల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు నెహ్రూ హౌసింగ్ కాలనీల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

శిథిలావస్థకు చేరిన క్వార్టర్ల స్థానంలో కొత్త నివాసాల నిర్మాణం, కార్మిక కాలనీల అభివృద్ధి, ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, క్యాథ్ ల్యాబ్ సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ఆరు నెలలకొకసారి సేఫ్టీ కిట్లు పంపిణీ చేయాలని, పెర్క్స్, అలవెన్సులపై ఆదాయపు పన్నుకు సంబంధించిన కార్మికుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించినట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం, అంటే సుమారు రూ.596 కోట్లను కార్మికులకు లాభాల వాటా బోనస్గా పంపిణీ చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి రెగ్యులర్ ఉద్యోగికి సగటున రూ.1,53,912 అందిందని, కాంట్రాక్ట కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లించినట్లు చెప్పారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా అందించడం వారి కృషికి ఇచ్చే గుర్తింపని అన్నారు. సింగరేణి విస్తరణకు అవసరమైన చొరవ తీసుకోవడం మా బాధ్యత. సంస్థను శ్రమతో, ఐక్యతతో అత్యుత్తమంగా తీర్చిదిద్దడం మీ వంతు. ఈ సంస్థను మన పూర్వీకులు కష్టపడి నిర్మించారు. దాన్ని కాపాడి, మరింత అభివృద్ధి చేసి భావితరాలకు అందించడం మనందరి ఉమ్మడి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రష్యాపై ఆంక్షల్లో మినహాయింపులు

(మొదటి పేజీ తరువాయి)

విధించేలా చట్టం తెచ్చి.. మరోవైపు అగ్రరాజ్యమే రష్యాతో డీల్ కుదుర్చుకోవడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆంక్షల చట్టంలో మినహాయింపులు కల్పిస్తూ ట్రంప్ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చట్టంలోని సెక్షన్ 115 ప్రకారం.. యూఎస్ జాతీయ ప్రయోజనాల కోసం ఆంక్షలను నిలిపివేయడం, అవసరమని భావిస్తే.. వాటి నుంచి మినహాయింపు ఇచ్చే ప్రత్యేక అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. 'ద లిండ్సే గ్రాహం' బిల్లును అమెరికా సెనెట్ ఈ ఏడాది ఆగస్టు 7న, ప్రతినిధుల సభ సెప్టెంబరు 16న ఆమోదించాయి. అనంతరం ట్రంప్ దీనిపై సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. రష్యా నుంచి అత్యధికంగా ఇంధనం దిగుమతి చేసుకునే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం ఈ చట్టంతో అగ్రరాజ్య అధ్యక్షుడికి లభించింది. అయితే, అమెరికాలో డీజిల్ ధరలను నియంత్రించేందుకే ట్రంప్ ప్రధానంగా ఈ మినహాయింపులు ప్రకటించినట్లు తెలుస్తోంది. అగ్రరాజ్యంలో మరికొద్ది రోజుల్లో జరగబోయే మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఇంధన ధరలు కీలక రాజకీయ అంశంగా మారాయి. మరోవైపు, ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం భారత్కు ఊరటనిచ్చే అంశమే. తాజా మినహాయింపుతో భారత్పై అదనపు సుంకాల ముప్పు తప్పుతుంది. ఇక, రష్యా నుంచి అమెరికా, ప్రపంచ మార్కెట్లలోకి లక్షలాది టన్నుల డీజిల్ సరఫరా కానుండటంతో అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గే అవకాశం ఉంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్ పర్యటన నేపథ్యంలో ఈ మినహాయింపులు ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెలలో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా రూబియోతో జరిగిన భేటీలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ చట్టంపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

మూడు దశల్లో సమగ్ర భూసర్వే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గానూ తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్కు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీసర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. రోవర్ల వినియోగంతో భూముల సర్వేను వేగంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు. రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాలలో వందశాతం రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

315 మండలాల్లో కరువు పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

ఇతర పంటలకు 100 శాతం మద్దతు ధర కల్పించాలని కోరారు. ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలన్నారు. రసాయన ఎరువుల ధరలు, రాయితీలను హేతుబద్ధీకరించాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

17 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

అందులో 17 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియాలో వార్తలు వస్తున్నాయి. బాధితుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. కొల్కతాలోని చోర్బగాన్ దుర్గాపూజ మండపం బయట వేచి ఉన్న జనం ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లారు. వర్షం కురుస్తున్న సమయంలో తోపులాట జరిగిందని, కొందరు రోడ్డుపై పడిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని జిల్లాల కలెక్టర్లు జిల్లా రహదారి భద్రతా కమిటీలను వెంటనే క్రియాశీలం చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రతి నెలా జిల్లా కమిటీల సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలనీ, ప్రత్యేకంగా జిల్లా రహదారి భద్రతా సమన్వయకర్తలను నియమించడంతో పాటు జిల్లా భద్రతా ప్రణాళికలను సమర్పించాలని స్పష్టం చేశారు. పోలీస్, ఆరోగ్యం, ఆర్ అండ్ బి, విద్యా శాఖలు, జీహెచ్ఎంసీ తమ శాఖల తరఫున నోడల్ అధికారులను నియమించడంతో పాటు రోడ్డు భద్రతపై తీసుకున్న చర్యలకు సంబంధించి ఆర్అండ్బి, ప్రజారోగ్య శాఖ, పంచాయతీరాజ్, పాఠశాల, కళాశాల విద్యా శాఖలు, ఎక్సైజ్, మున్సిపల్ శాఖలు 'లీడ్ ఏజెన్సీ ఫర్ రోడ్ సేఫ్టీ'కి ప్రతి త్రైమాసికంలో యాక్షన్ టేకెన్ రిపోర్టులను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ కార్యాలయాన్ని రాష్ట్ర రహదారి భద్రతా మండలి పరిధిలోకి తీసుకువచ్చి శాఖల మధ్య పూర్తి సమన్వయం సాధిస్తున్నామని మంత్రి తెలిపారు. నిధుల వినియోగంలో పారదర్శకత కోసం తెలంగాణ ఆన్లైన్ అకౌంటింగ్ విధానాన్ని అన్ని జిల్లాలకు విస్తరించాలని నిర్ణయించారు. దీని ద్వారా రాబడులు, ఖర్చులను ఎప్పటికప్పుడు సమీక్షించే వీలు కలుగుతుంది.ఈ సమగ్ర విధానం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి, రహదారులను ప్రయాణికులకు సురక్షితంగా మార్చడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొన్నం ప్రభాకర్ పునరుద్ఘాటించారు.

భారత్‌లో యువతపై వివక్ష, అణచివేత

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆరోపణలు చేశారన్నారు.''ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలను భారత్ గమనించింది. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి శాంతియుత సమావేశ స్వేచ్ఛ, సంఘ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తుంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత పత్రికారంగం, జాతీయ మానవ హక్కుల కమిషన్ వంటివి పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నాయి. కేవలం పేరు లేని కొన్ని నివేదికలను ఆధారంగా చేసుకొని.. ఓ దేశంలోని యువత వివక్షను ఎదుర్కొంటున్నారని వాదించడం సరైన చర్యకాదు. ఇటువంటి అత్యున్నత స్థాయి సమావేశాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేసి, ఐక్యరాజ్యసమితి, దాని సంస్థలు విశ్వసనీయతను కోల్పోతున్నాయి. విచిత్రమేమిటంటే..? భారత్‌లోని యువత ఓ వ్యంగ్య రాజకీయ ఉద్యమాన్ని సృష్టించిందని అదే నివేదిక పేర్కొంది. వారు చెప్పినట్లు దేశంలో ప్రభుత్వ అణచివేత ఉంటే.. నాయకులను ఎలా ప్రశ్నించగలుగుతున్నారు?.. దేశ రాజధానిపైకి ఎలా దూసుకురాగలుగుతారు? భారత్‌లో యువత ఉద్యమాలు చేసినప్పుడు.. నేతలకు, వారికి మధ్య చర్చలు ప్రభావవంతంగా జరుగుతాయని ఇటీవల ఐరాస మానవ హక్కుల హై కమిషనర్ పేర్కొన్నారు. బహుశా ఆ సమాచారం ప్రత్యేక ప్రతినిధి దృష్టికి రాలేదేమో'' అని అనుజ్ స్వరూప్ అన్నారు. ప్రభుత్వ పరీక్షలలో అవకతవకలపై ఇటీవల విద్యార్థులు చేపట్టిన నిరసనల విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరును భారత దౌత్యవేత్త ఈ సందర్భంగా ప్రస్తావించారు. యువతతో సంప్రదింపులు జరిపి.. పరీక్షల్లో మోసాలను అరికట్టడానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భారత అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

జెన్ జీ క్రియేషన్ బ్రో..!

(మొదటి పేజీ తరువాయి)

వీడియో గేమును రూపొందించాడు. బరేలీకి చెందిన ఈ డెవ్‌ఆప్స్ ఇంజనీర్.. రెండు రాత్రులు నిద్ర లేకుండా ఈ గేమ్ను తయారు చేశాడు. ఇన్స్టాగ్రామ్లో ఆయన పంచుకున్న గేమ్స్ రీల్ వైరల్ అయి ఇన్ ఫ్లుయెన్సర్లు కూడా షేర్ చేయడంతో.. ఆన్లైన్లో ఆడుతున్న వారి సంఖ్య ఎప్పుడూ 1,500కు పైగా ఉంటోంది.

ఇరుపక్షాలా ఆడొచ్చు...

గేమ్లో ఆటగాళ్లు రెండు వైపుల్లో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.. ఒకటి ఆందోళనకారులు.. రెండు ఢిల్లీ పోలీసులు. ఆందోళనకారులుగా ఆడితే.. అడ్డంకులను దాటి జంతర్ మంతర్కు చేరుకుని ధర్నా చేయాలి. పోలీసుల నుంచి తప్పించుకోవడం, సీసీటీవీ కెమెరాలను మోసం చేయడం, పానీ పూరి తిని శక్తిని పెంచుకోవడం వంటి పనులు చేయాలి. 'గోడీ మీడియా'ను ఎదుర్కొంటే విన్.. అరెస్టు అయితే కపసెరా బోర్డర్ లేదా నరేలా స్టేడియం వంటి దూర ప్రాంతాలకు వెళ్లి.. మళ్లీ తిరిగి రావాల్సి ఉంటుంది. ఇక పోలీసుల వైపు ఆడితే.. లారీ ఛార్జ్, భాష్ప వాయువు, అరెస్టులు వంటి చర్యలతో నిరసనకారులను జంతర్ మంతర్కు చేరకుండా అడ్డుకోవాలి. గేమ్ మెకానిక్స్ స్లిదర్ లాంటి మల్టీప్లేయర్ గేమ్ల నుంచి తీసుకోబడ్డాయి. ఇందులో సంఖ్యాబలమే శక్తిని నిర్ణయిస్తుంది.

డిజిటల్ ప్రొటెస్ట్...

ఇది కేవలం ఆట కాదు.. డిజిటల్ ప్రొటెస్ట్ అంటున్నారు విశ్లేషకులు. మెట్రో స్టేషన్ గేట్లు మూసివేయడం, మొబైల్ ఇంటర్నెట్ కట్ అవ్వడం, లారీ ఛార్జ్ వంటి రియల్-టైమ్ పాప్-అప్లు కూడా ఇందులో కనిపిస్తాయి. నగరంలోని గుంతలు, చెత్త కుప్పలు, దారిలో అడ్డుకునే ఆవులు వంటి సాధారణ అడ్డంకులు కూడా ఉన్నాయి. రోడ్డు పక్కన టీ స్టాల్, గురుద్వారా వంటివి తాత్కాలిక ఆశ్రయాలుగా పనిచేస్తాయి.

ప్రజా చైతన్యానికి యువ దర్శకులు కదలాలి

(మొదటి పేజీ తరువాయి)

కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా, భారతీయ సినిమాకు ప్రధాన కూడలిగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ యువతలోని సినీ ప్రతిభను ప్రోత్సహిస్తూ, జాతీయ స్థాయిలో హైదరాబాద్ను ప్రముఖ సినీ గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్ - 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని అన్నారు. వివిధ రంగులు, సువాసనలతో కూడిన పూలు ఒకచోట చేరినట్లుగా సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చే వేడుక బతుకమ్మ అని పేర్కొన్నారు. అందుకే ఈ పండుగ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.

హైదరాబాద్ నుభారతీయ సినిమాకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిదుతం..

తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్లోనే ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులకు తగిన అవకాశాలు లేవనే అభిప్రాయం గతంలో ఉండేదని భట్టి విక్రమార్క అన్నారు. అయితే, ప్రస్తుతం తెలంగాణకు చెందిన పలువురు దర్శకులు, హీరోలు, నిర్మాతలు చిత్ర పరిశ్రమలో తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో సృజనాత్మకతకు కొదవలేదని, యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని చెప్పారు. హైదరాబాద్ను భారతీయ సినిమా పరిశ్రమకు ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా రాష్ట్ర మంత్రివర్గం ఈ దిశగా ఆలోచనలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సినీ రంగ ప్రముఖులను హైదరాబాద్కు ఆహ్వానించడం, ఇక్కడ సినిమా రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా నగరాన్ని భారతీయ సినిమా రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

మూడు నిమిషాల్లో కథ చెప్పడమూ గొప్ప సృజనాత్మకతే..

యువ దర్శకుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ నిర్వహించడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మూడు గంటల సినిమాలో చెప్పగలిగే కథను కేవలం రెండు, మూడు నిమిషాల నిడివి ఉన్న షార్ట్ఫిల్మ్లో చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, తమ ఆలోచనను సమర్థంగా వ్యక్తీకరించగలిగిన యువ దర్శకులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీలో అవార్డులు అందుకోని వారి చిత్రాల్లోనూ మంచి ప్రతిభ కనిపించిందని పేర్కొంటూ, అవార్డు రాకపోయినంత మాత్రాన నిరుత్సాహపడవద్దని యువ ఫిలిం మేకర్లకు సూచించారు. భవిష్యత్తులో ఎవరు గొప్ప దర్శకులుగా ఎదుగుతారో ఇప్పుడే చెప్పలేమని, అందరూ తమ సృజనాత్మకతను కొనసాగిస్తూ ముందుకు స

మోడీ పాలనలో రాజ్యాంగ హక్కులకు ప్రమాదం

దేశ నిర్మాణం, పాలసీల రూపకల్పనలో ప్రొఫెషనల్స్‌దే కీలక పాత్ర

ఏఐసీసీ ప్రొఫెషనల్స్ చైర్మన్ మధుయాష్కి



హైదరాబాద్, అక్టోబర్ 17, (మనం బ్యూరో) : ప్రస్తుతం భారత దేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి లో ఉందని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని సమాన హక్కులు, స్వేచ్ఛ, రాజ్యాంగ ప్రజాస్వామ్య రక్షణ కోసం అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. ఏఐపీసీ చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా గాంధీభవన్ కు వచ్చిన మధుయాష్కి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాజ్యాంగమే ఈ దేశ ప్రజలందరికీ.. భగద్గీత, బైబిల్, ఖురాన్ లాంటివన్నారు. 2014 లో మోడీ ప్రధాని అయ్యాక రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం దేశంలో వివిధ రంగాల్లోని నిపుణులను ఒకే వేదికపై తీసుకురావాలన్న భావనతో 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పాటు చేశారన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని, ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్ లో భాగం పంచుకోవచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ సభ్యత్వం లేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం తమతో కలిసి పని చేయాలని కోరారు. సర్ పేరుతో దేశంలో 13కోట్ల ఓట్లు మోడీ ప్రభుత్వం తొలగించిందని, ఆ 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఎక్కువ ఉన్నాయన్నారు. ఎన్ని ఓట్లు తొలగించారన్నది ఆధారాలతో బయటపెట్టామన్నారు. సర్‌పై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసమో.. ప్రతిపక్ష పార్టీల ఉనికి కోసమో కాదని.. దేశ ప్రజల భవిష్యత్తు, భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణ అవసరమన్నారు. క్లిష్ట సమయంలో నాకు అప్పజెప్పిన ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన వారికి ఒక సంవత్సరం 50 మందికి ట్రైనింగ్ ఇచ్చారనీ, రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయి. వీరిలో ఎంపిక చేసిన 100మందికి శిక్షణ ఇస్తామన్నారు. జర్నలిస్టులు, లాయర్లు, డాక్టర్లు, టీచర్లు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు ఇలా వివిధ రంగాల్లోని నిపుణులు ఏఐపీసీ లో జాయిన్ కావాలని సూచించారు. దేశంలో 100 అర్బన్ జిల్లాలలోని టీచర్స్, లాయర్స్, డాక్టర్స్ ఇంజనీర్స్ తదితర రంగాల్లోని నిపుణులతో మొదటి దశలో ఏఐపీసీ కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు. అంతేకాకుండా ఏఐపీసీ ని తెలంగాణను ఒక మోడల్ గా నిర్మించి.. దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఈ సందర్భంగా మధుయాష్కి తెలిపారు.

యూనిఫామ్‌లో డ్యాన్స్

నహీ చలేగా

డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో పోలీస్ సిబ్బంది యూనిఫామ్‌లో డ్యాన్సులు చేయడంపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇకపై యూనిఫామ్ ధరించి వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నా, డ్యాన్సులు చేసినా కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తాజాగా ఆయన హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్ల అధిపతులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో పలువురు పోలీసు సిబ్బంది, అధికారులు పండుగలు, గణేశ్ నిమజ్జనం, మేడారం జాతర, వీడ్కోలు సందర్భాల్లో డ్యాన్సుల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో డీజీపీ తాజా ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్ యూనిఫామ్ అనేది బాధ్యత, అధికారం, క్రమశిక్షణకు ప్రతీక అని, దాని గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీజీపీ నొక్కిచెప్పారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేశారు.

డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యలపై హైందవ సంఘాలు ముక్త కంఠంతో ఖండించాయి. కొందరి విషయంలో చూసి చూడనట్లు ఉండే పోలీసులు, కేవలం హిందువుల విషయంలో మాత్రం పక్షపాత ధోరణి ప్రదర్శించడం సరికాదని హిందు ధార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సంస్కృతి సంప్రదాయాలలో భాగంగా అక్కడి భక్తులు, ప్రజలు భక్తి భావంతో సంతోషంగా నృత్యాలు చేయడం పాటలు పాడుతూ అలసట నుంచి బయటపడేందుకు శారీరక ధృడత్వం కోరకు చేసే ఆటల(డ్యాన్సుల)పై సైతం డీజీపీ ఆనంద్ తప్పుబడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందికి వార్నింగ్ ఇవ్వడంపై ఆర్ఎస్ఎస్, విహెచ్‌పీ, భజరంగ్ దళ్, బీజేపీతో పాటు హిందు వాహిని వంటి ధార్మిక సంఘాలు డీజీపీ తీరుపై పెదవి విరుస్తున్నాయి. తక్షణమే తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

బిగ్ ఫండింగ్ పార్టీగా బీఆర్ఎస్

దాని ఆస్తులు రూ.1509 కోట్లు

బ్యాంకు డిపాజిట్ల రూపంలోనే రూ.1431 కోట్లు

ప్రచార కార్యక్రమాల కోసం రూ.137 కోట్ల భారీ వ్యయం

హైదరాబాద్, మనం ప్రతినిధి : పదేళ్ల పాటు తెలంగాణలో అధికారంలో ఉన్న 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్) ఆర్థిక వ్యవహారాలు ఆసక్తికరంగా మారాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను పార్టీ సమర్పించిన ఆడిట్ రిపోర్ట్ ప్రకారం మొత్తం ఆస్తులు రూ.1,509 కోట్లుగా ఉండగా.. అదే ఏడాది ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా నమోదైంది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన ఈ నివేదిక, పార్టీ ఆర్థిక వనరులు, వ్యయాలపై స్పష్టమైన చిత్రాన్ని ఆవిష్కరించింది.

ఆడిట్ రిపోర్ట్ ప్రకారం.. 2026 మార్చి 31 నాటికి బీఆర్ఎస్ పార్టీకి ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ.1,509 కోట్లు. ఇందులో సింహభాగం, అంటే రూ.1,431 కోట్లు బ్యాంకుల్లో నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలోనే ఉన్నాయి. వీటిలో రూ.1,237 కోట్లు ఏడాదికి పైబడిన కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక డిపాజిట్లు కావడం గమనార్హం. భవనాలు, ఇతర భౌతిక ఆస్తుల విలువ రూ.66.26 కోట్లుగా, రుణాలు, అడ్వాన్సుల రూపంలో మరో రూ.11.77 కోట్లు ఉన్నట్లు పార్టీ తన నివేదికలో వెల్లడించింది. ఇక పార్టీ ఆదాయ, వ్యయాల వివరాలను పరిశీలిస్తే, 2025-26లో బీఆర్ఎస్‌కు వివిధ మార్గాల ద్వారా రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో విరాళాల ద్వారా రూ.16.44 కోట్లు రాగా, డిపాజిట్లపై వడ్డీ, అద్దెలు, ఇతర మార్గాల నుంచి ఏకంగా రూ.97.76 కోట్లు సమకూరాయి. అంటే పార్టీ ప్రధాన ఆదాయ వనరుగా బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీ నిలుస్తోంది. అయితే, ఇదే ఆర్థిక సంవత్సరంలో పార్టీ ఖర్చు రూ.162 కోట్లుగా నమోదైంది. దీంతో ఆదాయానికి మించి రూ.48.43 కోట్ల మేర ఖర్చు అధికంగా ఉంది. ఈ కారణంగా పార్టీ జనరల్ ఫండ్ రూ.1,551 కోట్ల నుంచి రూ.1,503 కోట్లకు తగ్గింది. మొత్తం ఖర్చులో అధిక భాగం ప్రచార కార్యక్రమాలకే కేటాయించారు. సాధారణ ప్రచార కార్యకలాపాల కోసం రూ.137 కోట్లు వెచ్చించగా, ఇందులో బహిరంగ సభల నిర్వహణకు రూ.57.51 కోట్లు, పత్రికలు, టీవీ ప్రకటనలకు రూ.53.68 కోట్లు ఖర్చు చేశారు. పరిపాలన, సాధారణ ఖర్చుల కింద రూ.16.88 కోట్లు వెచ్చించగా, అందులో న్యాయ సేవల కోసమే రూ.13.39 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం. వీటితో పాటు గతేడాది నవంబర్‌లో జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ప్రత్యేకంగా రూ.1.60 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. మొత్తం మీద బీఆర్ఎస్ వద్ద భారీగా ఆస్తులు ఉన్నప్పటికీ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయాన్ని మించి ఖర్చులు చేయడం ఈ నివేదికలో ప్రధానాంశంగా నిలిచింది.

తెలంగాణ నీళ్లు ఏపీకి తరలించే కుట్ర

చంద్రబాబు ప్లాన్.. రేవంత్ యాక్షన్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు.

శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మన తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాలను పోరుగు రాష్ట్రం ఏపీ ప్రాంతానికి తరలించేందుకు అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డియే పూర్తిగా సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

తెలంగాణకు నేటి నుంచి వర్షాలు

ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక

ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం




హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదిలాఉంటే, నేడు(అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

నిమ్స్‌లో బతుకమ్మ సంబురాలు

పూల సిరులతో కళకళలాడిన ఆసుపత్రి ప్రాంగణం

పాల్గొన్న డైరెక్టర్, వైద్యులు, సిబ్బంది



హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్): తెలంగాణ సాంస్కృతిక జీవన సౌందర్యానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకైన పూల పండుగ బతుకమ్మ నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు ఆవరణమంతా పండుగ శోభను, ఆధ్యాత్మిక పరిమళాలను నింపాయి. రోగుల ప్రాణాలను కాపాడేందుకు నిత్యం శ్రమించే వైద్యులు, సిబ్బంది కాసేపు తమ వృత్తిపరమైన ఉత్కంఠను పక్కనపెట్టి ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు.

సంస్కృతిని కాపాడుకోవడమే మన బాధ్యత: డైరెక్టర్ రాహుల్ దేవరాజ్

ఈ వేడుకలకు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని, పూలను ఆరాధించే అద్భుతమైన సంస్కృతి మన తెలంగాణ అని కొనియాడారు. బతుకమ్మ పండుగ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదని, మనందరి ఉమ్మడి సాంస్కృతిక వారసత్వమని ఆయన పేర్కొన్నారు. ఉరుకుల పరుగుల ఆధునిక జీవితంలో మనం ఎంతో దూరం ప్రయాణిస్తున్నప్పటికీ, మన మూలాలను, వేళ్లను ఎప్పుడూ మరువకూడదనే సత్యాన్ని ఈ పండుగ మనకు ప్రతిఏటా గుర్తుచేస్తుందన్నారు. నిత్యం రోగులకు అంకితభావంతో సేవనందించే వైద్యులు, వైద్య సిబ్బంది ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందడమే కాక, మన సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే బరువైన బాధ్యతను కూడా మోస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఉద్యోగుల మధ్య పరస్పర ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంలో ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆకాంక్షించారు.

మహిళా ఉద్యోగుల సందడి..

కార్యక్రమంలో నిమ్స్ మహిళా అధికారులు, నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తరలివచ్చారు. రంగురంగుల పూలను విభిన్న ఆకారాల్లో పేర్చి అద్భుతమైన బతుకమ్మలను తీర్చిదిద్దారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు ముస్తాబై, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ భక్తిశ్రద్ధలతో గౌరమ్మను కొలిచారు. తెలంగాణ సంప్రదాయాలకు అనుగుణంగా సాగిన బతుకమ్మ పాటలు, కోలాటాలు, ఆటపాటలు, దాండియా నృత్యాలతో నిమ్స్ ప్రాంగణం మార్మోగింది. మహిళా ఉద్యోగుల సందడితో ఆవరణంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ వేడుకల్లో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరంజ్యోతి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. కృష్ణా రెడ్డి, నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డా. మార్తా రమేష్ సత్యగౌడ్, ఎమ్. రాజ్ కుమార్, రాజ్ కుమార్, శ్రీనివాస్ రావు, శ్రీనివాసులు, రాధిక, కనకతార, ఆశలత, సౌజన్య, గోవర్ధన్, శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ సిబ్బంది, వైద్యులు,ఎంహెచ్ఎం విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోసం మిత్రపక్ష నాయకులందరినీ కలుస్తం

వీలైనంత త్వరగా నామినేటెడ్ పదవుల భర్తీ

13 ఏండ్ల మోడీ పాలనలో పేదలకు మేలు జరగలేదు

సర్ పేరుతో రాష్ట్రంలోనే 27 శాతం ఓట్లు తొలగించారు

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చిట్ చాట్



హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం బ్యూరో) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాలతో అందరితో మాట్లాడతామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. వీలైనంత తొందరగా నామినేటెడ్ పదవుల భర్తీ చేస్తామనీ, అయితే దసరాలోపు పదవుల భర్తీ ఉండకపోవచ్చని తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ ప్రొఫెషనల్స్ చైర్మన్ మధుయాష్కితో కలసి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. దేశంలో విపత్కర పరిస్థితి నెలకొన్నప్పుడు బీజేపీ విదేశీ అంశాన్ని తెరపైకి తెస్తుందనీ, ఇది బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. 13 ఏళ్ల మోడీ పాలనలో ఒక్క సామాన్యుడికి మేలు జరగలేదనీ, సర్ పేరుతో ఒక్క తెలంగాణలోనే 27 శాతం ఓట్లు తొలగించారని ఇందులో ముస్లింలు, పేదవారు, ఆదివాసీల ఓట్లే అధికమని విమర్శించారు. కేరళలో రమేష్ చెన్నితాల తాము గెలిచామని అనలేదు.. ఆయన మాటలు మిస్ కోట్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ నీరుగారుస్తుందనీ,

దాదాపు 97 శాతం కేసులు ప్రతిపక్షాలకు చెందిన పరిణామికవేత్తలపై అయ్యాయి. మహారాష్ట్రలో 3 నెలల వ్యవధిలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పలితాలు ఎలా మారుతాయి ? వెస్ట్ బెంగాల్, బీహర్ లో కూడా అదే జరిగిందని ప్రశ్నించారు.మోడీ,షా లకు శాశ్వతంగా అధికారంలో ఉండాలనే ఆలోచన ఉందనీ, వినాశకాలే విపరీత బుద్ధి అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతుపై కోదండరాంతోభేటీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వాలని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో ఆయనతో సమావేశమైన అనంతరం ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో టీజేఎస్ భాగస్వామ్యంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి టీజేఎస్ వివిధ సందర్భాల్లో అందిస్తున్న మద్దతు, సహకారం రాజకీయంగా ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్, టీజేఎస్ పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారం కొనసాగాలని, రానున్న ఎన్నికల్లోనూ కలిసి పనిచేయాలని ఈ సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు.



జ్యువెల్లరీ వ్యాపారి కిడ్నాప్ కేసులో పురోగతి

9 మంది నిందితుల అరెస్ట్.. రూ. కోటి స్వాధీనం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాజధాని, హైదరాబాద్‌లో రామంతపూర్‌కు చెందిన జ్యువెల్లరీ వ్యాపారి శ్రీనివాసరావు కిడ్నాప్ కేసును చిక్కడపల్లి పోలీసులు ఛేదించారు. ఈ మేరకు కేసుకు సంబంధించి 9 మంది నిందితులను అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తి కేసు వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

పోలీసులు, తెలిపిన పూర్తి వివరాల ప్రకారం... నగరంలోని రామంతపూర్‌కు చెందిన శ్రీనివాసరావు అనే వ్యాపారిని కొందరు నిందితులు 2026 అక్టోబర్ 5న గోల్కొండ ఫ్లైఓవర్ సమీపంలో కిడ్నాప్ చేశారు. పోలీసులమని నమ్మించి బాధితుడిని వాహనంలో ఎక్కించుకున్నారు. అనంతరం కళ్లకు గంతలు కట్టి గుర్తు తెలియని ప్రాంతంలో నిర్భందించారు. బాధితుడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి రూ.15 కోట్లు డిమాండ్ చేసి.. వారి నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేశారు. అనంతరం బాధితుడిని నిర్మానుష్య ప్రదేశంలో వదిలేశారు. ఈ మేరకు ఫోన్ సిగ్నల్, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా 9 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాత కక్షలతోనే శ్రీనివాసరావును కిడ్నాప్ చేసినట్లు నిందితులు అంగీకరించారు.

అయితే, నిందితుల నుంచి రూ.1.07 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దానితోపాటు సుమారు 97.09 గ్రాముల బంగారం, 3 గ్రాముల వెండి, బొలెరో, ఎర్టిగా, కియా సెల్టోస్ సహా ఐదు వాహనాలు సీజ్ చేసినట్లు వెల్లడించారు. నకిలీ నెంబర్ ప్లేట్లతో వాహనాలు మార్చుతూ పోలీసులకు చిక్కకుండా నిందితులు యత్నించినట్లు తెలిపారు. గతంలోనూ ఈ నిందితులపై కిడ్నాప్, దోపిడీ, మోసం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

తెలంగాణ యువతకు అన్యాయం చేయోద్దు

- పూర్తిగా ఉద్యోగాలు భర్తీ చేయాలి
- పోలీస్ ఉద్యోగాల భర్తీపై హరీష్ రావు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల భర్తీపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్రంలో 25 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతూ.. కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు తగిన పోస్టులు కేటాయించాలని, పోలీసు నియామకాల సంఖ్యను 25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత ఆశలను ప్రభుత్వం గౌరవించాలని కోరారు.

తెలంగాణలో ఎన్నికలకు ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు విడుదల చేస్తూ యువత ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. పోలీసు ఉద్యోగాల కోసం లక్షలాది మంది నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి సిద్ధమవుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు సమయం, శ్రమతో పాటు ఆర్థిక వనరులను వెచ్చిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ సంఖ్యలో పోస్టులు ప్రకటించడం వల్ల అనేక మంది అభ్యర్థులకు నిరాశ ఎదురవుతోందన్నారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాల్సిన ప్రభుత్వం, నామమాత్రపు నోటిఫికేషన్లతో నిరుద్యోగులను మభ్యపెడుతోందని విమర్శించారు.

తాజాగా కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఆరమ్డ్ రిజర్వ్ (ఏఆర్) కానిస్టేబుల్ పోస్టులు కేటాయించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. చార్మినార్ జోన్ పరిధిలో సబ్-ఇన్స్పెక్టర్ పోస్టులు కూడా తగిన సంఖ్యలో లేవని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతోందని, ఐటీ కారిడార్లు, పారిశ్రామిక ప్రాంతాలు విస్తరిస్తున్నాయని హరీశ్ రావు అన్నారు. ఈ పరిణామాలకు అనుగుణంగా శాంతిభద్రతల పరిరక్షణకు అదనపు పోలీసు బలగాలు అవసరమని పేర్కొన్నారు. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పోలీసు నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్లో పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఫ్యూచర్ సిటీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు తగిన సంఖ్యలో పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగ యువత ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు.



మౌనవ్రతంలో...మేధస్సు

అంతా అవగతమైన మేధావుల్లారా...
అన్యాయం అగడ్తల్లోకి జారుతున్న
సమాజాన్ని చూశారా....?
ప్రజాస్వామ్యపు ముఖచిత్రం రంగులు
మార్చుతుంటే...విలువల
వెన్నెముక విరిగిపోతున్న శబ్దం విన్నారా...?
సైబర్ వలల్లో సామాన్యుడి స్వప్నం
చిక్కుకుంటుంటే....నమ్మకం పూర్తిగా
మాయమవుతున్న దృశ్యాన్ని చూసారా?
మనిషి శ్రమను మనిషే
పూర్తిగా నాశనం చేస్తుంటాడు
న్యాయం గొంతుపై
అన్యాయం పాదం మోపుతుంటే....
అవినీతి మర్రిచెట్టు
ఊడలు భూమిని పెకిలిస్తుంటే..
వ్యవస్థ కళ్లపై ఉన్న
పొరలను ప్రశ్నించే వారు ఎవరు?
బుద్ధి బతుకుతెరువుకే బందీ అయిన వేళ
వివేకం వెలుగుల్ని వెదజల్లేదెవరు...?
తిన్నాం... పడుకున్నాం...
తెల్లారిందనుకోవడమేనా....?
తలపులను పక్కకు పెట్టి కాలానికి
లొంగిపోవడమేనా...? సమాజంలో ఉన్న
బాధలకు మౌనం పరిష్కారం కాగలదా?
చైతన్యపు దీపాన్ని గాలికొదిలేయగలమా...?
ఇది మనందరికీ ప్రశ్నే...
కలం ఒక కరదీపం...చీకటి మూలాల్ని తడమాలి
గళం ఒక గరుడపక్షి... గగనమంతా విహరించాలి
జ్ఞానం గదుల్లో కొలువుండే గ్రంథం కాదు
జనజీవనాన్ని మార్చే జాగృతికి మూలధనం
ప్రశ్నించడం నేరం కాదు..
ఇది ప్రగతికి తొలి మెట్టు.
నిజం పలకడం నింద కాదు..
అది నాగరికతకు పునాది
విద్య వివేకమై వికసించాలి ప్రతీ మస్తిష్కంలో
మానవత్వం పరిమళించాలి ప్రతీ చర్యలో..
ఆచరణకు అందని ఆదర్శాల్ని ఆరాధించకండి
ఓటమి ఒడిలోనైనా ఆశను సజీవం చెయ్యండి
చిన్న మార్పుల చినుకులతోనే
సమష్టి చైతన్యాన్ని నింపండి
దేశప్రగతి అంటే ఎత్తైన
భవనాల లెక్క కాదు
సమాజాభ్యున్నతి అంటే...
సంపదల గుట్టలూ కాదు
చివరికి ఒకే ఒక్క ప్రశ్న
మేధావులూ, మీరు మౌనంగా
ఉండటం ఎవరి వైపు..?
చరిత్రకు సాక్షులుగా మిగులుతారా...
లేదా చరిత్రను మలిచే చైతన్యశక్తులవుతారా?

- డా. కటుకోఝ్వుల రమేష్
9949083327

బతుకునిచ్చే తల్లి బతుకమ్మ



పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణాలు. పండుగలల్లో విశిష్టమైన, వైవిధ్యమైన పండుగ బతుకమ్మ. తెలంగాణ పండుగలే వైవిధ్యభరితమైనవి. అలాంటి పండుగలలో బతుకమ్మ ఒక్కటి. బతుకమ్మ తెలంగాణ అస్తిత్వపతాక. బతుకమ్మ పండుగ తెలంగాణకే సొంతమైన పండుగ. తెలంగాణ ఆడబిడ్డలు ఆనందంగా ఆడిపాడే పండుగ బతుకమ్మ. తెలంగాణలో అందరికీ వ్యవసాయమే ముఖ్యమైన బతుకు తెరువు. ఆడబిడ్డలు తమను చల్లగా చూడమని, మంచి బతుకును ప్రసాదించమని ప్రకృతిమాతను కొలిచే పూలపండుగ బతుకమ్మ. ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ. సమైక్యతను, సామాజికతను, ఆత్మీయతను, ఆధ్యాత్మికతను పెంపొందించే అసలైన మానవ సంబంధాల సమ్మేళనం బతుకమ్మ. ఈ పండుగ ఇప్పుడు విశ్వవ్యాప్త పండుగ అయ్యింది.

ఈ బతుకమ్మ పండుగకు వెయ్యేళ్ళ చరిత్ర ఉంది. బతుకమ్మ చుట్టూ అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. చారిత్రక, పౌరాణిక, జానపద సంబంధిత కథలు అనేకం ఉన్నాయి. అయితే బతుకమ్మ ప్రజల కష్టాల నుంచి పుట్టుకొచ్చిన పండుగ. ఆనాడు భూస్వాముల చేతుల్లో తెలంగాణలోని బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి వేధింపులకు, మానసిక, శారీరక హింసలకు తట్టుకోలేక చాలామంది ఆత్మహత్య చేసుకున్నారు. చనిపోయిన వారంతా చిరకాలం బతకాలని కోరుకుంటూ 'బతుకమ్మా, బతుకమ్మా' అంటూ దీవించారట. వారికి ప్రతీకగా ప్రకృతిలోని రంగురంగుల పూలను తెచ్చి, గౌరమ్మగా కొలుస్తూ నిండు నూరేళ్ళు చల్లగా బతకమ్మా అంటూ పాటలు పాడుతారు. ఆనాటి నుండి బతుకమ్మ ఒక పండుగగా పల్లెజీవితంలో ముడిపడిపోయింది.

కాకతీయుల కాలంలో కూడా బతుకమ్మ ప్రస్తావన ఉంది. యుద్ధంలో రాణి రుద్రమదేవి మరణించడంతో ఆమెను బతుకమ్మా, బతుకమ్మా అంటూ వేడుకున్నారట. అప్పటి నుంచి బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నారు. అలాగే చోళరాజు ధర్మాంగధుడి కథ కూడా ప్రచారంలో ఉంది. యుద్ధంలో అతని కుమారులంతా వీర మరణం చెందారు. లక్ష్మీదేవి అనుగ్రహంతో ఒక ఆడపిల్ల పుట్టింది. ఆ బిడ్డ కూడా తమకు దక్కదేమో అంటూ మధనపడ్డారు. ఆ బిడ్డ చిరకాలం బతకాలని బతుకమ్మ పేరు పెట్టారట. అప్పటినుంచి బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజాజీవితంలో ఒక భాగమైపోయింది. ఇలా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇంకా వాసవీ కన్యకా పరమేశ్వరి కథ,వదినా మరదళ్ళ కథలు వంటి వాటిల్లో కూడా బతుకమ్మ ప్రస్తావన ఉంది.

బతుకమ్మ పండుగ అట్టడుగు బలహీనవర్గాల ప్రజల నుంచి పుట్టుకొచ్చిన పండుగ. సంవత్సరానికి ఒకసారి వచ్చే బతుకమ్మ కోసం మెట్టినింటి నుంచి పుట్టింటికి వెళ్ళాలని, అన్న దమ్ములు, అక్కచెల్లెల్లను కలుసుకోవాలని, వారి సకల బాధలను అర్థం చేసుకోవాలనే ఆతృత ఈ బతుకమ్మ పండుగలో ఉంది. తమ బతుకులు బాగుండాలని కోరుకుంటూ చేసుకునే పండుగ బతుకమ్మ. పూలతో జరుపుకునే పండుగలు ఎన్ని ఉన్నా అవి



ఏవీ కూడా తెలంగాణ బతుకమ్మ పండుగతో సరిపోవు. రంగు రంగుల పూలతో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాడే బతుకమ్మ పాటలను వింటూ, ఆటలను చూస్తూ తరించాల్సిందే ఎవరైనా.

బతుకమ్మ పేరు ప్రచారంలోకి రాకముందు దీనిని బొడ్డెమ్మగా ఆడేవారు. దక్షిణ తెలంగాణలో బొడ్డెమ్మనే ప్రతీతి. చాలా రోజులకు ఆడబిడ్డలు కలిసారంటే బొడ్డెమ్మల ఆట పాటలు తప్పవు. అదే కాలక్రమంలో బతుకమ్మ పండుగగా అవతరించింది. 13వ శతాబ్దంలోనే తెలంగాణ తొలి కవయిత్రి అయిన కుప్పాంబిక తన రాజధాని బుద్ధపురం (నేటి భూత్పూర్) లో దసరా ఉత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించేది. ఆ ఉత్సవాలలో ప్రత్యేకత బొడ్డెమ్మ జరుపుకోవడం. ఇలా ప్రతి సంవత్సరం తన రాజ్యంలో కుప్పాంబిక బొడ్డెమ్మ పండుగను జరిపించేది. అందులో పాల్గొన్న మహిళలందరికీ ఉచిత రీతిన చీరసారెలను, బహుమానాలను ఇచ్చి గౌరవించేది. అప్పటి నుంచి పాలమూరు జిల్లాలో బొడ్డెమ్మను నేటికీ ఘనంగా జరుపుకుంటున్నారు. అనంతరం పాలమూరు జిల్లాలో సంస్థాన కాలంలో కూడా బొడ్డెమ్మ పండుగను ఘనంగా నిర్వహించేవారు.

ఆనాటి సంస్థానాధీశులు ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేవారు. అందులో ఈ బొడ్డెమ్మ పండుగను మహిళలు ప్రత్యేకంగా ఆడేవారు. మట్టిని తెచ్చి బొడ్డెమ్మగా తయారుచేసి దానికి బియ్యపు పిండి, కుంకుమబొట్టు పెడతారు. మట్టిముద్దలకు రంధ్రాలు చేసి పూలతో అలంకరిస్తారు. ప్రతిరోజు కన్నెపిల్లలంతా సాయంత్రం పూట ఒక చోటచేరి బొడ్డెమ్మ ఉన్న పీటనుంచి గుండ్రంగా తిరుగుతూ కోలాటమాడుతూ పూజిస్తారు. అమ్మాయిలు చక్కెర, అటుకులు నైవేద్యంగా తింటారు. ఈ బొడ్డెమ్మను భక్తిశ్రద్ధలతో పూజించిన కన్నెపిల్లలకు అనుకూలమైన భర్తలు దొరుకుతారని నమ్మకం. పాలమూరు జిల్లాలోని జటప్రోలు, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, అలంపురం, గోపాలపేట మొదలైన సంస్థానాలలో ఈ బొడ్డెమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకునేవారు. నల్గొండ జిల్లాలోని పానగల్లు, సంస్థాన్ నారాయణపురం తదితర ప్రాంతాల్లో కూడా బొడ్డెమ్మలను నిర్వహించేవారు. తెలంగాణలోని అనేక సంస్థానాలలో కూడా ఈ బొడ్డెమ్మను ఘనంగా జరిపే వారని మనకు చరిత్ర వల్ల తెలుస్తున్నది. పాలమూరు, నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల్లో బతుకమ్మను బొడ్డెమ్మగా జరుపుకునేవారు.


బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పండుగ. మొదటిది ఎంగిలిపూల బతుకమ్మ, రెండవది అటుకుల బతుకమ్మ, మూడవది ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవది నానబియ్యం బతుకమ్మ, ఐదవది అట్ల బతుకమ్మ, ఆరవది అలిగిన బతుకమ్మ, ఏడవది వేపకాయ బతుకమ్మ, ఎనిమిదవది వెన్నముద్ద బతుకమ్మ, తొమ్మిదవది సద్దుల బతుకమ్మ. ఈ తొమ్మిది రోజులు బతుకమ్మను రోజుకొక నైవేద్యంతో పూజిస్తారు. బతుకమ్మ పండుగను ముందుగా ఎంగిలిపూల బొడ్డెమ్మ పండుగగా కన్యలు జరుపుకుంటారు. ఒకరోజు ముందుగా పూలను తెచ్చి మరుసటి రోజు బతుకమ్మ చేయడం వల్ల ఎంగిలిపూల బతుకమ్మ పేరు వచ్చిందంటారు.

ఊరుఊరంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకునే ఏకైక పండుగ బతుకమ్మ. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా కులమతాల వాసన లేకుండా జరుపుకునే పండుగ బతుకమ్మ ఒక్కటే కావడం తెలంగాణ సంస్కృతి గొప్పతనం. తమకెవరికీ ఎటువంటి ఆపదలు రాకూడదని,తమ కుటుంబం చల్లగా ఉండాలని గౌరమ్మను కొలుస్తూ పూజలు చేసే పండుగ బతుకమ్మ. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పండుగ. బతుకమ్మ పండుగ చెసుకోవడమంటే ప్రకృతిని ఆరాధించడమే. ఆశ్వయుజమాసంలో పూలు బాగా వికసిస్తూ జలవనరులు సమృద్ధిగా పొంగిపొరలే సమయంలో బతుకమ్మ పండుగ వస్తుంది. మనిషికి మట్టితో, జలంతో అవినాభావసంబంధం. మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. ఈ సంబరాలను తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకుని బతుకమ్మను సద్దుల బతుకమ్మ రోజున నిమజ్జనం చేస్తారు. చివరిరోజు బతుకమ్మ పండుగ అత్యంత మనోహరంగా సాగుతుంది. ఆరోజు మహిళలంతా పచ్చిక బయళ్లలోనికిపోయి తంగేడు, గునుగుపూలను భారీగా ఏరుకుని వస్తారు. ఆ తర్వాత ఇంటిలోని వారందరూ కూర్చుని ఆ పూలతో బతుకమ్మను చూడముచ్చటగా తయారుచేస్తారు. బతుకమ్మ తయారీలో ప్రత్యేకత గునుగు, తంగేడుపూలదే కావడం విశేషం.ఈ పూలను ఒక రాగిపళ్లెంలో వలయాకారంగా ఒక్కో వలయంలో ఒక్కో పూలను రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ఆపై తంగేడుపూలతో కట్టలుగా కట్టిన కట్టలను పేరుస్తారు. మధ్యమధ్యలో ఇతర రకాలపూలను పేరుస్తారు. అందమైన అమరికతో బతుకమ్మను తయారు చేస్తారు.

అనంతరం దీనిపై పసుపుతో చేసిన గౌరీమాతను నిల బెడతారు. ఇలా పేర్చిన బతుకమ్మను ఇంటిలోని దేవునిగుడిలో ఉంచి పూజిస్తారు. చివరిరోజైన సద్దులబతుకమ్మ రోజు ఆడపడుచులు అందరూ చక్కగా ముస్తాబై దుస్తులు, ఆభరణాలు ధరించి బతుకమ్మను వాకిలిలో పెడతారు. అనంతరం సాయంకాలం అందరూ తమతమ బతుకమ్మలతో ఊరి మధ్యలో ఒకచోట చేరి వాటిని మధ్యలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరిదేవిని కీర్తిస్తూ పాటలు పాడుతూ ఆటలు ఆడతారు. ఆ తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆ పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మ వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. తెలంగాణ జన జీవన సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ. మొత్తంగా ఇది బహుజనులు జరుపుకునే పండుగ కావడం విశేషం.

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

ఆర్థిక విషయాలలో ఆమడదూరంలో అబలలు



దేశంలో నేడు ప్రతీ ఇంట్లో తెల్ల వారింది అంటే గురుతు ఏమిటంటే, అలారం మోగడం కాదు, ఆ ఇంట్లో పొయ్యి వెలగడం అంటే అతిశయోక్తి కాదేమో...!? అనగా ఇంట్లో అంత తొందరగా ఉదయాన్నే లేచిన మహిళలు, తిరిగి అర్ధరాత్రి అయ్యే వరకూ అనేక పనులు చక్క పెట్టుకుని ఆయా కుటుంబాల్లోని సభ్యులకు వివిధ రకాల సేవలు అందిస్తూ, రూపాయి ప్రతిఫలం లేకుండా సేవ చేయడాన్ని ఎంత మంది గుర్తిస్తున్నారు అంటే వేళ్ళమీద లెక్కించవచ్చు ఏమో?' అన్ పెయిడ్ మేనేజర్లు' గా అధిక సంఖ్యలో మన మహిళలు ఉండుట గమనించదగిన విషయం..'మినిస్టర్ ఆఫ్ స్టేటస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ టైం యూజ్ సర్వే 2024' ప్రకారం దేశంలో 6 సంవత్సరాలు పై బడిన బాలికలు మరియు మహిళల్లో సుమారు 81.5% శాతం మంది అన్ పెయిడ్ డొమిస్టిక్ సర్వీస్ చేస్తున్నారు అని నివేదిక వెల్లడించింది. ప్రతీ రోజూ రూపాయి ప్రతిఫలం లేకుండా 289 నిమిషాలు అనగా 4 గంటల 50 నిమిషాలు పనిచేస్తున్నారు అని తెలిపారు. కుటుంబ సభ్యుల బాగోగులు చూడటం కోసం మరో 137 నిమిషాలు శ్రమిస్తున్నారు అని తెలిపారు. ఇక 15-59 వయస్సు మధ్యలో ఉన్న మహిళలైతే 305 నిమిషాలు పని చేస్తున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. మరియు కుటుంబ సభ్యుల బాగోగులు చూడటం కోసం మరో 146 నిమిషాలు శ్రమిస్తున్నారు అని పేర్కొన్నది. ఈ విధంగా మనదేశంలో స్త్రీలు రూపాయి ప్రతిఫలం లేకుండా పనిచేస్తున్నారు.. ఇంతలా పని చేస్తున్నా, కొందరైతే ఉద్యోగాలు చేస్తున్నా, ఇంటికి సంబంధించిన ఆర్థిక నిర్ణయాల్లో గాని, ఆస్తులు సమకూర్చుకోవడంలో గాని మహిళలు ప్రమేయం లేకుండా, పూర్తిగా పురుషులు నిర్ణయాలతోనే నేటికీ అధిక శాతం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

మహిళలు వారి వారి ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునే ఉద్దేశంతో ఇటీవల కాలంలో బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేసుకోవడంలో కొంతమేరకు అభివృద్ధి చెందడం జరిగింది. 2015లో బ్యాంకు అకౌంట్ కలిగిన 15-49 మధ్య వయస్సు ఉన్న మహిళలు 53% శాతంగా ఉంటే, 2019-20 నాటికి 78.6% శాతం బ్యాంకు అకౌంట్ కలిగి ఉన్నట్లు 'ది నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5' చెబుతుంది'ఈవై-సిఐఐ' సర్వే ప్రకారం మహిళల్లో డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు వారు నేటికి కేవలం 44% మాత్రమే. ఇంకో విచిత్రం ఏమిటంటే, నేటికి 18% శాతం మహిళలకు వారికి సంబంధించిన ఆర్థిక పరమైన పథకాలు పేర్లు కూడా తెలియవు.. 'ఎల్ ఎక్స్ యమ్ ఇ మరియు ఈ.వై' 2026 జనవరి నివేదిక ప్రకారం 21% శాతం మహిళలు మాత్రమే



ఆర్థికపరమైన విషయాల్లో కొంతమేరకు అవగాహన కలిగి ఉన్నట్లు తెలిపారు. నేటికి భారత మహిళల్లో చాలామందికి మ్యూచువల్ ఫండ్స్, రిటైర్మెంట్ పథకాలు, ఇక స్టాక్ మార్కెట్ విషయాలు వంటి వాటిపై 25% శాతం మందికి కూడా అవగాహన లేదు. అయితే యన్.ఎఫ్.హెచ్.యస్-5 డేటా ప్రకారం ఇటీవల కొంతమేరకు మహిళలు ముఖ్యంగా వివాహితులు కొంతమేరకు వారి వారి ఆస్తులు సమకూర్చుకోవడంలో, ఆరోగ్య సంరక్షణ కోసం, ఇళ్ళ కొనుగోలు వంటి అంశాల్లో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలియజేయటం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే ఆస్తులు దాదాపు ఎక్కువగా పురుషుల పేరు మీద, జాయింట్ పేర్లతో కొనుగోలు జరుగుతున్నాయి. కేవలం నేటికీ పూర్తిగా మహిళలు పేరుమీదే ఇల్లు ఉన్న వారు కేవలం 13% శాతం మాత్రమే. ఆర్థిక పరమైన అంశాల్లో ఆస్తులు విషయాల్లో మహిళలు ఎంత వెనుకబడి ఉన్నారో అర్థం అవు తుంది. కేవలం 8.3% శాతం 15-49 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలకు మాత్రమే లాండ్ ఉన్నట్లు తెలు స్తోంది..

అనగా నేటి ఆధునిక యుగంలో డిజిటల్ యుగంలో విద్యావంతులైన సమాజంలో కూడా పితృస్వామ్య వ్యవస్థ ఆర్థికంగా ఎంత బలంగా ఉందో తెలుస్తుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు చేస్తున్న మహిళలకు సంబంధించిన ఆర్థిక విషయాలు కూడా చాలామంది భర్తల ఆధీనంలో ఉండుట గమనించదగిన విషయం. సామాజిక అంశాలు, కుటుంబ పద్ధతులు, వారసత్వ నేపథ్యం వంటి అంశాలు వలన ఆర్థిక అంశాల్లో మహిళలు స్వాతంత్ర్యం అంతంత మాత్రంగానే ఉంటుంది. నేడు మహిళలు ఈ మాత్రమైనా బ్యాంకు అకౌంట్లు, డిజిటల్ పేమెంట్స్ కలిగి ఉన్నారంటే దీనికి ప్రధాన కారణం సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (డ్వాక్రా) లతో, ప్రభుత్వ పథకాలతో అనుసంధానం అవ్వడమే. వాస్తవానికి కుటుంబ విషయాలలో, మహిళలకు ఉన్నంత ఆర్థిక అవగాహన , పురుషులకు ఉండదు అంటే అతిశయోక్తికాదు.. చక్కటి ప్లానింగ్, బేరసారాలు చేసే సామర్థ్యం, చక్కబెట్టే నైపుణ్యాలు మహిళలకే అధికంగా ఉంటుంది.. కుటుంబ అవసరాలు, పిల్లల ఫీజులు, వైద్య ఖర్చులు, కిరాణా, కుటుంబ సభ్యుల బాధ్యత, అవసరతల పై మహిళలకే ఎక్కువ అవగాహన ఉంటుంది. ఎంతో కాలంగా అన్ పెయిడ్ మేనేజర్లుగా ఉంటున్న మహిళలకు కుటుంబ ఆర్థిక వ్యవస్థలో ఇకనైనా కీలక భాగస్వామ్యం కల్పించాలి. పురుషులు కూడా కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మహిళలకు తోడ్పాటును అందించుట ద్వారా ఆరోగ్య పరంగా, ఆర్థిక పరంగా ప్రతీ కుటుంబం అభివృద్ధి చెందుతుంది. మహిళా సాధికారత సాధ్యం అవుతుంది.

- ఐ. ప్రసాదరావు
9390509791

హృదయ మయూరం

స్వాతి చినుకు తాకినట్టు
నీ తలపు తాకితే
ఎండిన నా అంతరంగం
వసంతమై పరిమళిస్తుంది.

వెన్నెల జాబిల్లి కింద
నీ మౌనం పలికినప్పుడల్లా
మాటలకందని ప్రేమ
నా లోపల రాగమవుతుంది.

నీ చూపు ఒక్కసారి
నా జ్ఞాపకాన్ని తడిపితే
నిశ్చలమైన కాలంలోనూ
వయసు ఊయలూగుతుంది.

తొలకరి నేలను ముద్దాడిన క్షణంలా
నీ జ్ఞాపకం నన్ను తాకగానే
మౌనం మధురమవుతుంది,
ఊహకు రెక్కలొస్తాయి...

అప్పుడు
నా అంతరంగపు ఆకాశంలో
హృదయ మయూరం
పురివిప్పి నాట్యమాడుతుంది!

- డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

ఎడిట్ పేజీ కోసం ...
మీ సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

కానరాని విల్లంబుల ధారణలు...

యుగ యుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న సనాతన ప్రాచీన సంప్రదాయాలు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి. పురాణేతిహాస, రుతుపరమైన, మత ప్రయుక్త, శీతోష్ణస్థితి, స్థానిక పరిస్థితుల సంబంధమైనవిగా పెక్కు సాంప్రదాయాలు అనాదిగా ఆచరించబడుతున్నాయి. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతుల ప్రభావం కారణంగా హైందవ సనాతన ఆచారాలు ఒక్కొక్కటిగా అదృశ్యమవుతున్నాయి. అలాంటి వాటిల్లో 'ఉపాధ్యాయ వారోత్సవ' సంప్రదాయం ముఖ్యమైనది. బడి పిల్లలు దసరా సెలవులలో విల్లంబులు ధరించి, గిలకలు పట్టి, ఇంటింటికీ తిరిగి గురుదక్షిణ కోరడమే 'ఉపాధ్యాయ వారోత్సవ' కార్యక్రమం. విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు విల్లంబులు ధరించి వెళ్ళడం నేపథ్యంగా తమ గురువును తోడ్కొని విద్యార్థులు చేతుల్లో రంగు బాణాలు ధరించి, దసరా పద్యాలు పాడడం, తమ తమ ఇల్లిల్లు తిరిగి తమ ఆయుధాలకు నివేదన తెమ్మంటూ, పప్పు బెల్లాలిమ్మంటూ తమను విద్యావంతులను చేస్తున్న గురువులకు కట్న కానుకలకను ఇమ్మంటూ, అదే పాట, అదే ఆటగా గ్రామమంతా సందడితో ఎక్కడ కన్నా చిన్నారులే, ఎక్కడ విన్నా జయజయ ధ్వనాలే వినిపించేవి. పూర్వం విలువిద్య నేర్చుకొనే పిల్లలు తాము నేర్చిన విద్య దసరా నవరాత్రులలో ప్రదర్శించే వారు. అలనాటి ప్రదర్శనాచారక్రమం రానురాను తొమ్మిది రోజులలో గిలకలు చేత బట్టుకుని, తమ గురువులకు బహుమానాలు, తమకు పప్పు బెల్లాలు సంపాదించే అలవాటు ఆచరణలోకి వచ్చినట్లు చెపుతారు. పంతుళ్ళు వెనుక నడుస్తుంటే పిల్లలు వరుసల్లో పాడుతూ ప్రతి వాకిటా ఆగి దసరా మామూళ్ళు స్వీకరించే ఆత్మీయమైన ఆచారమిది. ప్రభుత్వ బడులు లేని ఎన్నో గ్రామాల్లో తమ స్థలాలను బడి పెట్టడానికి నిస్వార్థంగా దానం ఇచ్చే వారు. జీవితానికి అవసరమైన జ్ఞానం పొందేందుకు నాడు వీధిబడి ఆలంబనగా ఉండేది. అయితే ఇప్పుడు ఉన్నంతగా డబ్బు అప్పట్లో చెలామణిలో లేదు. వస్తుమార్పిడి ఉండేది. అదీ ధాన్య రూపంలోనే. అలాంటి పరిస్థితుల్లో వీధిబడి అయ్యవారికి కాస్త ఇబ్బందిగానే గడిచిపోయేవి రోజులు. మరి పదిరోజుల పండగ దసరా వేళ ఊరితోపాటు తన



ఇల్లూ కళకళలాడాలని గురువు, శిష్యులతో కలసి, గ్రామ పెద్దలు పోషకుల ఇళ్ళకు వెళ్ళి, వారి సాయం పొందేవారు. దసరా వచ్చిందంటే ప్రతీ గ్రామంలోనూ గురువులూ వారివెంట పిల్లలూ ఊరంతా తిరుగుతూ పాడుకునే పాటలు ఆ తరం వారికి గుర్తుకు రావలసినదే. ఆ అలవాటు ఇప్పుడు వెనుకబాటు అయింది. 'పరగనాశ్వయుజ శుక్ల పక్ష మందు తెరగొప్ప దీవించ వస్తిమిట మేము శ్రీరస్తు విజయోస్తు దీర్ఘాయురస్తు, ధన కనక వస్తు వాహన సిద్ధిరస్తు. బాలకుల దీవెనలు బ్రహ్మ దీవెనలు, భూమి లోపల లేని భోగములు కల్గి ధనధాన్యములు కల్గి' అంటూ శుభాకాంక్షలు తెలపడం. 'ఘనముగా కట్నములు గ్రక్కున ఇచ్చి, సెలవియ్యుడి మాకు శీఘ్రముగా, పట్టు పచ్చడి మిచ్చి పదిమాడలిచ్చి, గట్టి శాలువలిచ్చి కడియం లిచ్చి, అయ్యవారికి చాలు ఐదు వరహాలు, పిల్ల వాండ్లకు చాలు పప్పు బెల్లాలు, కొబ్బరి కురిడీలు కుండ బెల్లాలు' అంటూ ఈయవలసిన వాటిని ఏకరువు పెడుతారు. ఏదయా మీదయా మామీద లేదా ఇంత సేపుంచుట ఇది మీకు తగునా? 'దసరాకు వస్తిమని విసవిసలు పడక, రేపురా మాపురా.. మళ్ళి రమ్మనక, చేతిలో లేదనక ఇవ్వలేమనక, ఇప్పుడే లేదనక, ఆప్పివ్వరనక, ఇరుగు పొరుగు వారు ఇస్తారు సుమ్మి, శీఘ్ర ముగ పంపుడి శ్రీమంతులార అంటూ ఇవ్వడంలో జాప్యం చేయవద్దని, వాయిదా చేయవద్దని మృదువుగా మర్యాదగా వేడుకుంటారు. పలుమార్లు మిమ్మెపుడు అడుగంగరాము, అల్లుండ్రవలె కాదు అలిగి మిమ్మడుగ, చెల్లెండ్ర వలెగాదు చెలగి మిమ్మడుగ, అల దొమ్మరులము గాము ఆడి మిమ్మడుగ, మంత్ర తంత్రము కాదు మాయచే నడుగ, బలవంతులము కాదు బలముచే నడుగ, నిలువు జీతము కాదు నిలిచి మిమ్మడుగ' అంటూ గడుసుగా చెపుతారు. పావలా బాడైతే పట్టేది లేదు, అర్ధరూపాయయైతే అంటేది లేదు, ఒక్క రూపాయితే ఒప్పేది లేదు, అయ్య వారికి చాలు ఐదు వరహాలని, కనీస గురుదక్షిణ పేర్కొంటారు. అలా గురు దక్షిణ రాబట్టి జయ విజయ భవ, దిగ్విజయీభవ అంటూ బాలల దీవెనలు బ్రహ్మ దీవెనలుగా' వర్ణిస్తూ భరతవాక్యం పలుకు తారు. దేవతా వేషధారులై ఆ చిన్నారులు ఘనమైన పద్యాలు చదువుతూ ఆశీస్సులు అందిస్తే ఊరి పెద్దలు, పోషకులు ముగ్ధులైన నేపథ్యం మరిచిపోలేని తీపి గుర్తులు. ఎల్లపుడూ చదువులో నిమగ్నమవు తూండే పిల్లలు శరన్నవ రాత్రులలో ఆటవిడుపుగా, గురుదక్షిణ పొందే సంబరాల కార్యక్రమంగా ఆశ్వయుజ పాడ్యమి మొదలు విజయ దశమి దాకా నాడు కనిపించే పిల్లల విల్లంబులు ధారణలు, వినిపించిన సంప్రదాయ పద్యాలు నేడు ఆధునిక మాటున పూర్తిగా కనుమరుగైనాయి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రకృతి వైపరీత్యమే ఎల్‌నినో

- ఇదేదో కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదు
- మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి, అక్టోబర్ 18 (మనం న్యూస్): ఎల్ నినో అనేది ప్రకృతి వైపరీత్యమేనని, ఇదేదో కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వర్షం పడడం, పడకపోవడం ప్రకృతికి సంబంధించిన అంశమని, దీన్ని రాజకీయం చేయడం బీఆర్ఎస్ నేతలకు తగదని హితవు పలికారు. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్లమ్మ చెరువును మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ఎల్లమ్మ చెరువు వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ఎల్లమ్మ చెరువు దగ్గర ఘనంగా ఏర్పాట్లు చేశాం. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును, గ్లాస్ బ్రిడ్జ్ ను, గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. హుస్నాబాద్ ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం. రెండు రోజుల క్రితమే కబడ్డీ అకాడమీ మంజూరు చేశాం. నిన్ననే స్విమ్మింగ్ పూల్, వాటర్ స్పోర్ట్స్ కు కూడా జీవో వచ్చింది. హుస్నాబాద్ ను స్పోర్ట్స్ హబ్ గా మారుస్తున్నాం. 2007లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టును బీఆర్ఎస్ పదేళ్లలో పట్టించుకోలేదు. సుప్రీంకోర్టు కేసులు, అడ్డంకులన్నీ మా ప్రభుత్వం వచ్చాక తొలగించాం. ఇప్పుడు కాలువల కోసం భూసేకరణ జరుగుతోంది. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ రైతుల కాళ్ల దగ్గరకు నీళ్లు తీసుకొస్తాం. వ్యవసాయానికి విద్యుత్ విషయంలో ఈ పంట వరకు ఉదయం నుండి సాయంత్రం దాకా, రాత్రి కూడా కొంత సమయం కరెంట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు ప్రజలందరూ కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి. వచ్చే సీజన్ లో రైతులు నీటి లభ్యతను బట్టి వరి కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలి. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో అందరికీ తెలుసు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్క హుస్నాబాద్ నియోజకవర్గానికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం. అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు ఇస్తాం. దీన్ని రాజకీయం చేయొద్దు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

సద్దుల బతుకమ్మ దసర ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



టేకుమట్ల, ,మొగుళ్ళపల్లి అక్టోబర్ 17 మనం న్యూస్: మండల ప్రజలందరికీ మొగుళ్లపల్లి ఎస్ఐ సురేష్, టేకుమట్ల ఎస్సై అమూల్య లు దసరా, సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రజలందరూ సద్దుల బతుకమ్మ ,దసర పండుగలను ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు బతుకమ్మ వేడుకల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఇతరులను రెచ్చగొట్టే పాటలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించే పాటలను డీజే సౌండ్ సిస్టమ్ల ద్వారా ప్లే చేయరాదని స్పష్టం చేశారు బతుకమ్మ వేడుకలకు అనుగుణంగా సంప్రదాయ బతుకమ్మ పాటలను సాధారణ సౌండ్ బాక్సుల ద్వారా మాత్రమే వినిపించాలని సూచించారు నిబంధనలను ఉల్లంఘించి రెచ్చగొట్టే పాటలు ప్లే చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అదేవిధంగా, దసరా పండుగను పురస్కరించుకొని ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు అక్టోబర్ 21వ తేదీ వరకు ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు ఎస్ఐ లు సురేష్, అమూల్య తెలిపారు ఈ ఆంక్షలను ఉల్లంఘించి అక్రమంగా ఇసుక రవాణా చేసినా, అనుమతులు లేకుండా ఇసుక తరలించినా సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, ఇసుక వ్యాపారులు పోలీసులకు మరియు సంబంధిత అధికారులకు సహకరించాలని కోరారు పండుగల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరిస్తూ దసరా, సద్దుల బతుకమ్మ పండుగలను సంతోషంగా, సురక్షితంగా, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు.

రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి



- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

కాటారం, అక్టోబర్ 17 మనం న్యూస్): రీసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్ అన్నారు. శనివారం కాటారం మండలం నస్తూరుపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామస్తులు, రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని సర్వే సిబ్బందికి సూచించారు. అనంతరం కాటారం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తహశీల్దార్ చాంబర్, నాయిబ్ తహశీల్దార్ చాంబర్లలో పైకప్పు ప్లాస్టర్ పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని గమనించారు. శిథిలావస్థలో ఉన్న సీలింగ్ ను వెంటనే మరమ్మతు చేయించాలని అధికారులకు సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహశీల్దార్ నాగరాజు, సర్వేయర్, ఆర్ఐ, జీపీవో, లైసెన్స్డ్ సర్వేయర్లు, రైతులు ఉన్నారు.

సర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి





కరీంనగర్, అక్టోబర్-17(మనం బ్యూరో): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్ఐఆర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, పెండింగ్లో ఉన్న విచారణలను పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలను సకాలంలో చేపట్టాలని తెలిపారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఓటర్ల అర్హతలను నిర్ధారించే సమయంలో సంబంధిత పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అనర్హుల నమోదు, ద్వంద్వ నమోదులు లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని దరఖాస్తులు, ఓటర్ల వివరాలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి, భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తుదారుల అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేసి అర్హతలను నిర్ధారించాలని సూచించారు. నకిలీ, తప్పుడు, ద్వంద్వ దరఖాస్తులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్



కాటారం, అక్టోబర్ 17 మనం న్యూస్ : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ సూచించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్లను పరిశీలించి రోజువారీగా వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. విధులకు హాజరు కావాల్సిన వారు సకాలంలో వస్తున్నారా లేదా అనే విషయాన్ని చెక్ చేశారు. ఫార్మసీ విభాగంలో మందుల నిల్వలను పరిశీలించి, ప్రజలకు అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఐపీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. పరిశుభ్రత పాటించాలని, వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎన్టీఈపీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సందీప్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ హారిక ఉన్నారు.

కుమార్తె జ్ఞాపకార్థం క్రికెట్ జెర్సీల వితరణ



కాటారం, అక్టోబర్ 17 మనం న్యూస్: దసరా పండుగ సందర్భంగా ప్రతాపగిరిలో జరుగుతున్న ప్రతాపగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ లో తల్లిదండ్రుల ప్రేమకు నిదర్శనంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. తమ కూతురు స్వర్గీయ అంతర్గాం రిషిత జ్ఞాపకార్థం బొప్పారం కింగ్స్ జట్టుకు తల్లిదండ్రులు అంతర్గాం రవి-రజిత, సోదరుడు రాహుల్ కన్నా క్రికెట్ జెర్సీలను స్పాన్సర్ చేశారు. జట్టు సభ్యులకు జెర్సీలను అందజేసి రిషితను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊర వెంకటేశ్వరరావు, బండం రాజేందర్, అంతర్గాం రమేష్, టీమ్ కెప్టెన్ గడ్డం శివ, గ్రామ క్రీడాకారులు, టోర్నమెంట్ నిర్వాహకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ పథకాల కరపత్రాన్ని విడుదల

- నేటి పాదుపే రేపటి ఆర్థిక భరోసా
- ప్రతి కుటుంబం పొదుపును అలవాటుగా మార్చుకొని ఆర్థికంగా స్థిరపడాలి
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో): ప్రజలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేయడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక భరోసా పొందవచ్చని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. శనివారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న ప్రత్యేక ఫికస్డ్ డిపాజిట్ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., ప్రతి కుటుంబం పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంకులు అందిస్తున్న డిపాజిట్ పథకాలపై అవగాహన కలిగి ఉండి, తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సరైన పథకాన్ని ఎంచుకోవాలని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.1 లక్ష డిపాజ్ 1,000 రోజుల ఫికస్డ్ డిపాజిట్ పథకంలో సాధారణ ఖాతాదారులకు 7.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.00 శాతం వార్షిక వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా, 444 రోజుల ఫికస్డ్ డిపాజిట్ పథకంలో సాధారణ ఖాతాదారులకు 7.40 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం వార్షిక వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఈ ప్రత్యేక డిపాజిట్ పథకాలపై మరింత సమాచారం అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు కొత్త బస్టాండ్ సమీపంలో, రిజిస్ట్రేషన్ ఆఫీస్ రోడ్డులో,ఎస్వీ టిఫిన్ సెంటర్ పక్కన అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి గల ఖాతాదారులు మరిన్ని వివరాల కోసం 9247543618 నంబర్ను సంప్రదించి పథకాల వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. డిపాజిట్ చేసే ముందు బ్యాంకు అధికారులను సంప్రదించి తాజా వడ్డీ రేట్లు, నిబంధనలను నిర్ధారించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు, డిపాజిట్ పథకాలపై అవగాహన కల్పించేలా బ్యాంకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వైభవ్,అసిస్టెంట్ మేనేజర్ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నింటిన బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
- బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు
- నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం సాయంత్రం నాగర్కర్నూల్ జిల్లా కలెక్టరేట్లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా బతుకమ్మ పండుగ శోభను సంతరించుకుంది. మహిళల ఆటపాటలతో సందడిగా మారిన వాతావరణం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య మాట్లాడుతూ....., బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకతని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెబుతుందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే పండుగలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ పూల పండుగ విశిష్టతను మరోసారి చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పాండు, పిడి డిఆర్డీఏ చిన్న ఓబులేసు, అదనపు పిడి రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

- కష్టకాలంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన తోటి మిత్రులు



టేకుమట్ల అక్టోబర్ 17 మనం న్యూస్: కాలం ఎంత దూరం తీసుకెళ్లిన జీవిత ప్రయాణంలో కొన్ని స్నేహబంధాలు తోడై ఉంటాయి అలాంటి అరుదైన స్నేహానికి నిదర్శనంగా తోటి మిత్రులు అండగ నిలిచారు టేకుమట్ల మండలం వెలిశాల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో 2003-04 బ్యాచ్ మిత్రుడు అచ్చే సతీష్ మరణించడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు విషాద వార్త తెలుసుకున్న తోటి మిత్రులు సతీష్ కుటుంబానికి ధైర్యం చెబుతూ బాధలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించి 20,000 ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు 22 సంవత్సరాల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న మిత్రులు నేడు కష్టకాలంలో ఒకరి కోసం ఒకరు నిలబడటం వారి కుటుంబ సభ్యులను భావోద్వేగానికి గురి చేసింది స్నేహమంటే జ్ఞాపకాలు కాదు అవసరమైన సమయంలో అండగా నిలబడడమే అని ఈ సంఘటన నిరూపించింది స్నేహితులు ఉంటే దుఃఖం సగమే అండగా నిలిచే మనుషులు ఉంటే జీవితం ధైర్యంగా ముందుకు సాగుతుందని నిరూపించారు సతీష్ కుటుంబ సభ్యులు తమ బాధను పంచుకుంటూ ఆర్థిక సహాయం అందించిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు ఆకునూరి సతీష్ కన్నూరి రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి


- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్ఐఆర్,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.... ఎస్ఐఆర్ లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ దరఖాస్తులను ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులు లేకుండా అర్హతలను నిర్ధారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

చాక్ పీస్‌పై సద్దుల బతుకమ్మ

- చిత్రకళ ఉపాధ్యాయుడి ప్రతిభ





కాటారం, అక్టోబర్ 17 మనం న్యూస్): సద్దుల బతుకమ్మ పండుగను పుర స్కరించుకొని కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ తన ప్రతిభను చాటుకున్నారు. కేవలం 8 మిల్లీమీటర్ల ఎత్తు, 6 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న చాక్ పీస్ పై సద్దుల బతుకమ్మను సుమారు గంటపాటు శ్రమించి గుండుపిన్ను సహాయంతో స్కల్ప్చురింగ్ ఆర్ట్ ద్వారా తయారు చేసి తెలంగాణ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు ముందు కూడా చాక్ పీస్ పై 1.2 సెంటీమీటర్ల ఎత్తు, ఒక సెంటీమీటర్ వెడల్పుతో సద్దుల బతుకమ్మను, అలాగే పెన్సిల్ గ్రాఫైట్ పై 4 మిల్లీమీటర్ల ఎత్తు, 3 మిల్లీమీటర్ల వెడల్పుతో ప్రపంచంలోనే అతి చిన్న సద్దుల బతుకమ్మను తయారు చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. తన సూక్ష్మ కళ ద్వారా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటుతున్న రజనీకాంత్ ను పలువురు అభినందిస్తున్నారు.

దసరా ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి

పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 18(మనం ప్రతినిధి): జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శనివారం పెగడపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్ల మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు.అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. పాత నేరస్తుల కదలికలను గమనిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్.ఐ కుమార స్వామి ఉన్నారు.

వరి ఎండిపోతుంది.. విద్యుత్ సరఫరా సమయం పెంచండి

గజ్వేల్ డివిజన్ వరి సాగుచేసిన రైతుల మొర

పిడిచెడ్‌లో ఎండిపోయిన వరి చేనులను పరిశీలించిన డిఎవో



సిద్దిపేట, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): చేతి కంద వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. మరో 15 రోజులు నీటి సౌకర్యం సమకూర్చితే కోట్లాది రూపాయలు విలువ చేసే పంటలు పండుతాయి. విద్యుత్ సరఫరా సమయాన్ని రోజుకు మరో నాలుగైదు గంటలు పెంచి రైతులను ఆదుకోవాలని గజ్వేల్ వ్యవసాయ డివిజన్ రైతులు మొర పెట్టుకుంటున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రస్తుతం వరి పొట్ట, గింజ పాలు పోసుకునే దశలో ఉందని ప్రభుత్వ అధికారులు ఈ పరిస్థితులను పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. గజ్వేల్ మండలం పిడ్చెడ్ గ్రామానికి చెందిన పలువురు రైతుల ఎండిన వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన పసులాది ధర్మయ్య, స్వామీల ఎండిపోయిన వరి పొలాలను చూసి రైతుల పరిస్థితిని అర్థం చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు డీఎవోతో తమ చేతికి అంద వచ్చిన పంట కళ్ళముందుటే ఎండిపోతుందని, అప్పులు చేసి పెట్టుబడి పెట్టి ఆరుకాలం కష్టం చేశామని, విద్యుత్తు కొరతతో పంట దక్కకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి రోజుకు మరో నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా పెంచితే తమ పంటలు గట్టెక్కుతాయని వేడుకున్నారు. గ్రామాలలో అత్యధిక మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని అందులో వానాకాలం పంట కావడంతో తినడానికి తిండి గింజలు ఈ పంట చేతికందకపోతే దక్కకుండా పోతాయని విన్నవించుకున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం: డీఏవో

గజ్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ప్రస్తుతం వరి పంట పొట్ట, గింజలు పాలు పోసుకునే దశలో ఉందని మరో 15 రోజులు నీటి అవసరం బాగా ఉందని, విద్యుత్ సరఫరా పెంచితే పంటలు గట్టెక్కే అవకాశాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని డీఏఓ స్వరూప రాణి రైతులతో చెప్పారు. వరి, పత్తి, కంది పంటలపై తెగుళ్ల బెడదను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సస్యరక్షణ చర్యలకు రైతులకు సూచనలు చేశారు. గజ్వేల్ ఏ డి ఏ బాబు నాయక్, పిడ్చెడ్ సర్పంచ్ అశోక్ రెడ్డి, పలువు రైతులు ఉన్నారు.

ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూలో ఘనంగా బతుకమ్మ వేడుకలు





ములుగు, అక్టోబర 17(మనంన్యూస్)ః శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగులో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, పూలతో అలంకరించిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు, పూల విశిష్టతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతిలోని ప్రత్యేకత అని తెలిపారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటువంటి పండుగలు ఉద్యోగుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను, పరస్పర సహకారాన్ని పెంపొందించడంతో పాటు విశ్వవిద్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ, పూలు, మొక్కల ప్రాధాన్యతను గుర్తుచేసే బతుకమ్మ పండుగ ఉద్యాన విశ్వవిద్యాలయానికి మరింత ప్రత్యేకమైనదని తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులు, సిబ్బంది సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో విశ్వవిద్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరూ కలిసికట్టుగా పాల్గొనడంతో వేడుకలు మరింత సందడిగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ఈ బతుకమ్మ వేడుకలు విశ్వవిద్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా. జె. చీనా, పరిశోధనా విభాగం సంచాలకులు డా. డి. లక్ష్మీనారాయణ, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ అండ్ డి ఎస్ ఏ డాక్టర్ టి సురేష్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. ఎన్. శ్రీనివాసన్, ఓఐఎఫ్ఐ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డా. డి. విజయ, టీచింగ్, నాన్ టీచింగ్, అవుట్సోర్సింగ్, కాంట్రాక్టు స్టాఫ్ మరియు పీజీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలు







ములుగు, అక్టోబర్ 17(మనంన్యూస్): వాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాని ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని సిద్దిపేట జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. క్షీరసాగర్ గ్రామ దమ్మాయి చెరువు కట్టపైన కొతకసూరి అన్నపూర్ణ చైతన్య సుమారు 5నుంచి 6లక్షలతో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు. శనివారం నిర్మాణం పూర్తి కావడంతో పూజ కార్యక్రమాలను వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ మరింత అభివృద్ధికి తానవంతు సహయ సహకారాలు ఎల్లప్పు డు ఉంటాయన్నారు. పురాతన దేవాలయా ల అభివృద్ధికి తానేంతగానో కృషి చేస్తున్నానన్నారు. నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలకు తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నానన్నారు. ఆలయంలో అడుగుపెట్టగానే మనస్సులోని ఆందోళనలు తొలగిపోయి ఒక తెలియని నిశ్శబ్దం, ప్రశాంతత లభిస్తాయి. అక్కడ చేసే ధ్యానం లేదా ప్రార్థన ఏకాగ్రతను పెంచుతుందన్నారు. భగవంతుని ముందు అందరూ సమానమే అనే భావనను దేవాలయాలు కలిగిస్తాయి. మన కష్టాలను దేవుడికి చెప్పుకుని, భారాన్ని ఆయనపై వేయడం వల్ల మానసిక స్థైర్యం పెరుగుతుందని, దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కావు. అవి మన సంస్కృతి, శిల్పకళ, సాహిత్య, సంగీత కళలకు శతాబ్దాలుగా కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. మన సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఆలయాల నిర్మాణంతోనే ఆధ్యాత్మిక, భక్తిభావం పెరుగుతుందన్నారు. దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల పరుశురాం, మాజీ ఉప సర్పంచ్ కొన్యాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొన్యాల నర్సింహ్మారెడ్డి, సంతోషిరెడ్డి, కోల క్రిష్ణ, నల్ల నరేందర్, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నల్ల శ్రీనివాస్, కోల శ్రీధర్, మహేశ్, భాను, చాలకలి మహేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు



- గజ్వేల్ పుర వీధుల్లో ఘనంగా శోభాయాత్ర

గజ్వేల్, అక్టోబర్ 17(మనం న్యూస్): గజ్వేల్ పట్టణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్)ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సంఘ్ స్థాపనా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం, స్వయంసేవకుల క్రమశిక్షణ, దేశభక్తి ప్రదర్శనకు వేదికగా నిలిచింది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గజ్వేల్ పురవీధుల్లో నిర్వహించిన ఘన శోభాయాత్ర (పథ సంచలన్) ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పూర్ణ గణవేషం ధరించిన వందలాది మంది స్వయంసేవకులు సంఘ్ ఘోష్ (బ్యాండ్) వాయిద్యాల లయబద్ధమైన శబ్దాల నడుమ కదం తొక్కారు. పట్టణంలోని ముఖ్య కూడళ్ల గుండా సాగిన ఈ శోభాయాత్రకు స్థానిక ప్రజలు, మహిళలు హారతులు పడుతూ, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. భారత్ మాతా కీ జై, వందేమాతరం నినాదాలతో గజ్వేల్ పురవీధులు మారుమోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్య వక్తలు మాట్లాడుతూ,సమాజంలో ఐక్యతను పెంపొందించడం, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తోందని పేర్కొన్నారు. విజయదశమి రోజునే సంఘ్ ప్రారంభమైందని, నాటి నుండి నేటి వరకు దేశ రక్షణలో, సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వయంసేవకులు ఎల్లప్పుడూ ముందుంటున్నారని కొనియాడారు. హిందూ సమాజం ఐక్యంగా ఉంటూ, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా స్వయంసేవకులు చేసిన శారీరక ప్రదర్శనలు, లాఠీ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవంలో సంఘ్ ప్రముఖులు, వివిధ విభాగాల బాధ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టడంలో యువత కీలక పాత్ర పోషించాలి: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి అక్టోబర్ 17 మనం న్యూస్ ప్రతినిధి: ఏక్ థా దివస్'' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హైదరాబాద్లోని ఐసీసీసీ నుంచి గుజరాత్లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వరకు నిర్వహిస్తున్న ఆల్ స్టేట్స్ పోలీస్ బైక్ ర్యాలీకి ఐఐటీ హైదరాబాద్లో ఘన స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ,

అనంతరం ఐఐటీ హైదరాబాద్లో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత తమ జీవితాల్లో అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రగ్స్కు బానిసలైన వారి ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్కు దూరంగా ఉంటూ, తమ స్నేహితులు, తోటి విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈగల్ టీమ్ డీఎస్పీ పుష్పన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్, ఎంఎన్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐఐటీ హైదరాబాద్ డీన్ డా. ప్రశాంత్ కుమార్, డీన్ డా. ప్రేమ్ పాల్,, డీఎస్పీలు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నీలం మధు

- గ్రాడ్యుయేట్ ఎన్నికలపై పలు కీలక సూచనలు చేసిన టీపీసీసీ చీఫ్

పటాన్ చెరు, అక్టోబర్ 17(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్(టిపిసిసి) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను శనివారం నార్సింగిలోని ఆయన నివాసంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నికలలో ఓటర్ నమోదు ప్రక్రియ తదితర అంశాలపై కీలక సూచనలు చేసి కష్టపడి పనిచేయాల్సిందిగా సూచించినట్టు నీలం మధు తెలిపారు.



గల్ఫ్‌పై మిట్టపల్లి బతుకమ్మ పాట



హైదరాబాద్, అక్టోబర్ 17(మనంన్యూస్): ఎడారిలో తంగేడు వనమే మొలిసేనో అంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిమళాన్ని గల్ఫ్ దేశాలకు తీసుకెళ్లే బతుకమ్మ పాట దుబాయ్లో ఘనంగా ఆవిష్కృతమైంది. అక్షర గోల్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ కోట కుమార్ (కేకే) ఈ పాటను నిర్మించగా, ప్రముఖ తెలంగాణ ప్రజాకవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ సాహిత్యాన్ని అందించారు. ప్రముఖ గాయని మంగ్లీ ఆలపించిన ఈ గీతానికి మదీన్ ఎస్కే నేపథ్య సంగీతాన్ని సమకూర్చారు.

గల్ఫ్ బతుకుల్లో బతుకమ్మ సందడి...

పొట్టచేత పట్టుకుని గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ కార్మికుల అన్నాచెల్లెళ్ల ఆవేదనను, పండుగ రోజున సొంత ఊరిలో కుటుంబ సభ్యుల మధ్య గడపాలనే ఆకాంక్షను ఈ పాట ప్రతిబింబిస్తుంది. బతుకమ్మ పండుగను స్వగ్రామంలో జరుపుకోలేక దూరంగా ఉంటున్న తెలంగాణ ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు ఈ గీతం మధుర జ్ఞాపకాలను అందించేలా రూపుదిద్దుకుంది.

హిందూ-ముస్లిం సోదరభావానికి ప్రతీక...

దూద్ సేమియా, సత్తు బెల్లం కలిపిన బంధాన్ని, ఖర్జూరపు తీపిని బతుకమ్మ పాటలోని మాధుర్యంతో మేళవిస్తూ రెండు మతాలు, విభిన్న సంప్రదాయాల మధ్య ఉన్న సామరస్యాన్ని ఈ గీతం చాటిచెబుతోంది. దుబాయ్ వేదికగా గల్ఫ్ గడ్డ నుంచి ప్రపంచానికి హిందూ-ముస్లిం భాయ్ భాయ్ అనే సోదరభావ సందేశాన్ని బతుకమ్మ పాట రూపంలో వినిపించింది.

గోల్కొండ కోట నుంచి బుర్జ్ ఖలీఫా వరకు తెలంగాణ సంస్కృతి...


తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ స్ఫూర్తితో, గోల్కొండ కోట నుంచి బుర్జ్ ఖలీఫా వరకు ఏడు దేశాల అనుబంధాన్ని ఏడు రంగుల బతుకమ్మతో ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిట్టపల్లి స్టూడియో ద్వారా రూపొందించిన ఈ పాటను తెలంగాణతో పాటు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలకు అక్షర గ్రూప్స్ చైర్మన్ కోట కుమార్ అంకితం చేశారు.

సంప్రదాయ కళలకు ప్రత్యేక ఆకర్షణ...

ఈ వేడుకల్లో తెలంగాణ నుంచి వచ్చిన సంప్రదాయ డప్పు బృందాలు, ఒగ్గుడోలు బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుబాయ్తో పాటు అబుదాబి నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని స్పార్క్ మీడియా అరుణ్ మరియు సుతారి సత్యం, మల్లేష్ గౌడ్ లు నిర్వహించారు.

పేదింటి ఆడపిల్లలకు వరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

160 మంది లబ్ధిదారులకు రూ.1.60 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ; ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరు, అక్టోబర్ 17 (మనం న్యూస్): పేదింటి ఆడపిల్లల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, డివిజన్లకు చెందిన 160 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన రూ.1,60,18,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..ఆడపిల్లల వివాహాల కోసం పేద కుటుంబాలు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాల్లో వివాహ వేడుకలు సంతోషంగా జరిగేందుకు ఈ పథకాలు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల తహశీల్దార్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా గణనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి

- స్వీయ గణనతో సమయం ఆదా, కచ్చితమైన జనాభా వివరాల సేకరణ
- రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళీ కేరి

సంగారెడ్డి, అక్టోబర్ 17 మనం న్యూస్ ప్రతినిధి: జనాభా గణనలో స్వీయ గణన ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి, సమయాన్ని ఆదా చేయడంతోపాటు కచ్చితమైన, నాణ్యమైన సమాచారాన్ని సేకరించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళీ కేరి సూచించారు.

శనివారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు జనాభా గణన రెండో దశ పై నిర్వహించిన శిక్ష ణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్తో కలిసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, జనాభా గణన నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భారతి హోళీ కేరి మాట్లాడుతూ, జనాభా గణన మొదటి దశలో గృహాల జాబితా తయారీ, గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. రెండో దశలో ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

స్వీయ గణనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, కుటుంబంలోని సభ్యులందరి వివరాలను సంబంధిత యాప్లో ముందుగానే నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వీయ గణన పూర్తయిన అనంతరం ఎన్యూమరేటర్లు సంబంధిత కుటుంబాలను సందర్శించి, నమోదు చేసిన వివరాలను పరిశీలించాలని, అవసరమైన చోట సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు.



ఈ విధానం ద్వారా ఎన్యూమరేటర్ల పని భారం తగ్గడంతోపాటు ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. జిల్లా జనాభాను దృష్టిలో ఉంచుకొని నిర్దేశిత సమయంలో స్వీయ గణన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర శాఖల సిబ్బంది సహకారంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో వివరాల కచ్చితత్వం...

గతంలో నిర్వహించిన హౌస్లిస్టింగ్ ఆపరేషన్లో సేకరించిన వివరాలను ఆధారంగా తీసుకొని, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె సూచించారు. జనాభా పెరుగుదల, కొత్త నిర్మాణాలు, వలసలు, గుర్తింపునకు నోచుకోని నివాసాలు, సంస్థాగత గృహాలు, ఖాళీ గృహాలు తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో నమోదు చేయాలని తెలిపారు. ఇళ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జనాభా గణనలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనాభా గణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సీపీఓ గీత, చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ: కలెక్టర్ అంకిత్

ఐడీఓసీలో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17(మనం(ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ శాఖ, మున్సిపాలిటీలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మెప్మా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా అధికారులు, ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, కోలాటాలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని, పూలను, మహిళలను గౌరవించే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు . మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగ విధుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడంతో పాటు, పరస్పర స్నేహభావం, ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

భారీ బతుకమ్మల తో ప్రత్యేక ఆకర్షణ

మహిళా ఉద్యోగుల కోలాటాలు, నృత్యాలతో సందడిగా మారిన యూనియన్ కార్యాలయం

వెన్న ముద్దల బతుకమ్మ సందర్భంగా భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి పూజలు.. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక నైవేద్యాలు



ఖమ్మం, అక్టోబర్ 17(మనం న్యూస్): ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీకగా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా యూనియన్ కార్యాలయంలో ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి పూజలు నిర్వహించారు. ముందుగా పసుపు, కుంకుమ, వివిధ రకాల రంగురంగుల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి, దీపారాధన చేశారు. వెన్న ముద్దల బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. మహిళా ఉద్యోగులు తమ ఇళ్లలో సంప్రదాయబద్ధంగా పేర్చిన బతుకమ్మలను యూనియన్ కార్యాలయానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. పూలతో అందంగా పేర్చిన భారీ బతుకమ్మలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, నృత్యాలతో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. జానపద గీతాలు, పూల పరిమళాలు, ఆటపాటలతో యూనియన్ కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడంతో కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో కోలాహలంగా సాగింది. వెజిటేబుల్ మార్కెట్ మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిసింది. వేడుకల ప్రారంభ సమయంలో ప్రకృతి దీవెనన్నట్లుగా చిరుజల్లులు పులకరింపజేశాయి. వేడుకలకు హాజరైన వారికి నిర్వాహకులు అల్పాహార ఏర్పాట్లు చేశారు.

బతుకమ్మ అనుబంధానికి ప్రతీక: గుంటుపల్లి శ్రీనివాసరావు

టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి, ప్రకృతితో మనకున్న విడదీయలేని అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగ మన ప్రాంత ప్రత్యేకతను, పల్లె జీవన వైభవాన్ని, పూలతో ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని అన్నారు. పూలను పూజిస్తూ గౌరీదేవిని ఆరాధించడం ద్వారా ప్రకృతి పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడమే కాకుండా, కుటుంబాల్లో సుఖసంతోషాలు, సమాజంలో ఐక్యత, ప్రజల జీవితాల్లో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని మహిళలు ఆకాంక్షిస్తారని తెలిపారు. ఎనిమిదో రోజు వెన్న ముద్దల బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం తెలంగాణ సంప్రదాయాల్లో విశిష్టమైన భాగమని, ఈ సందర్భంగా మహిళలు పసుపు, కుంకుమ, పుష్పాలతో గౌరీదేవిని పూజించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలకు నిదర్శనమని అన్నారు. ఆధునిక జీవనశైలిలో ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో నిరంతరం బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు ఇలాంటి పండుగల ద్వారా తమ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, సహోద్యోగులతో ఆత్మీయంగా గడపడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిక బతుకమ్మ సంబురాల్లో భాగంగా టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు టీఎన్జీవోస్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని, పరస్పర సహకారాన్ని పెంపొందించడంతో పాటు మహిళా ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని అన్నారు. మహిళా ఉద్యోగుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టడంలో యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మన పండుగల విశిష్టతను యువతకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, పాడిపంటల సమృద్ధిని తీసుకురావాలని, మహిళలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉద్యోగుల ఐక్యతకు సాంస్కృతిక వేడుకలు దోహదం: కొణిదెన శ్రీనివాస్

టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంప్రదాయాల పట్ల ఉన్న మమకారాన్ని చాటడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారిలో సోదరభావం, ఆత్మీయతను పెంపొందించేందుకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఏటా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా నాయకులు, ఉద్యోగులు, మహిళా విభాగం సమన్వయంతో కార్యక్రమం విజయవంతమైందని చెప్పారు. ఇలాంటి వేడుకలు ఉద్యోగుల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవోస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేటెడ్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, టీఎన్జీవోస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జైపాల్, జిల్లా కోశాధికారి వల్లపు వెంకన్న, అసోసియేట్ అధ్యక్షుడు కొమరగిరి దుర్గాప్రసాద్, శేషు ప్రసాద్, టీఎన్జీవోస్ ఉపాధ్యక్షులు ఎర్ర రమేష్, శ్రీధర్ సింగ్, అస్లాం ఖాన్, జాయింట్ సెక్రటరీలు తాళ్లూరి శ్రీకాంత్, భూస చంద్రశేఖర్, హరికృష్ణ కోణార్, నగర అధ్యక్షులు బెజ్జంకి ప్రభాకరాచారి, డ్రైవర్ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, మహిళా ఉద్యోగ ప్రతినిధులు లలిత కుమారి, రాధికా రెడ్డి, ఎన్. విజయ, కోమలి, సుబ్బమ్మ, టీఎన్జీవోస్ నాయకులు గుర్రం శ్రీనివాసరావు, మెట్టు వీరయ్య, ప్రసాద్, విజయ్, ఏ.సుధాకర్, బుర్రి వెంకటేశ్వర్లు, బుర్రి నాగేశ్వరరావు, రవి, అంజమ్మ, నరేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కానుకలు ఏమవుతున్నాయి?

శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహణపై అనేక అనుమానాలు!

లక్షలాది రూపాయల విరాళాలు.. వినియోగంపై భక్తుల ప్రశ్నలు

ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవాలని స్థానికుల డిమాండ్



కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 17(మనం న్యూస్): భక్తుల విశ్వాసమే దేవాలయాలకు బలం. తమ కష్టాలు తీరాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు అమ్మవారిని నమ్ముకుని కానుకలు సమర్పిస్తారు. అయితే భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అందజేస్తున్న కానుకలు, విరాళాల వినియోగంపై ప్రశ్నలు తలెత్తితే సంబంధిత నిర్వాహకులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత లేదా? కొత్తగూడెం నియోజకవర్గంలోని బాబు క్యాంపు ప్రాంతంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ మందిరం నిర్వహణపై స్థానిక భక్తులు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

నెలనెలా విరాళాలు..

లెక్కలపై స్పష్టత ఏది?

స్థానికుల కథనం ప్రకారం, ఆలయం చుట్టుపక్కల నివసిస్తున్న సుమారు 400 కుటుంబాలు ప్రతి నెలా ఒక్కో కుటుంబం నుంచి రూ.1,000 చొప్పున ఆలయానికి విరాళంగా అందజేస్తున్నాయి. ఈ లెక్కన నెలకు సుమారు రూ.4 లక్షలు, ఏడాదికి రూ.48 లక్షల వరకు విరాళాలు సమకూరే అవకాశం ఉంది. ఇవి కాకుండా ఇతర భక్తులు సమర్పించే నగదు, బంగారు వస్తువులు, ఇతర కానుకలు అదనం. ఇంతటి మొత్తంలో విరాళాలు, కానుకలు అందుతున్న ఆలయంలో వాటిని ఏయే కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు? ఆలయ అభివృద్ధికి ఎంత ఖర్చు చేస్తున్నారు? పూజా కార్యక్రమాలకు ఎంత వెచ్చిస్తున్నారు? ఆదాయ, వ్యయాల వివరాలను భక్తులకు తెలియజేస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆదాయ వివరాలను అధికారిక రికార్డులతో పరిశీలించాల్సి ఉంది.

అమ్మవారికి సమర్పించిన కానుకల మాటేమిటి?

మహిమగల అమ్మవారిపై అపారమైన విశ్వాసంతో భక్తులు వివిధ రకాల బంగారు వస్తువులు, విలువైన కానుకలు సమర్పిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒక భక్తుడు తన ఇంటి కులదైవంగా అమ్మవారిని భావించి, గతంలో సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నగదు రూపంలో, ఇతర రూపాల్లో విరాళాలు అందించినట్లు తెలిపాడు.అయితే తాము సమర్పించిన వస్తువులు పూజా కార్యక్రమాల్లో వినియోగించడం లేదని, వాటి పరిస్థితిపై తమకు స్పష్టత లేదని కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సమర్పించిన కానుకలు ఎక్కడ ఉన్నాయి? వాటిని ఎలా భద్రపరుస్తున్నారు? ఆలయ అవసరాలకు వినియోగిస్తున్నారా? అనే అంశాలపై నిర్వాహకులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ నిర్వహణపై విచారణ జరిపించాలి!

ఆలయ నిర్వహణకు సంబంధించి శ్రీ వినుడికే తెలవాలి వ్యవహరిస్తున్న తీరుపై స్థానిక భక్తులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సమర్పించే విరాళాలు, కానుకల వివరాలు బహిరంగంగా వెల్లడించాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి వివరణ, ఆలయ ఆదాయ వ్యయాల అధికారిక రికార్డులు అందుబాటులో లేనందున ఆరోపణల వాస్తవాలను సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంది.

భక్తుల విశ్వాసం వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా ఉండాలి. దేవుడి పేరుతో సమకూరే ప్రతి రూపాయికి లెక్క ఉండాలి. భక్తులు సమర్పించే ప్రతి కానుకకు తగిన భద్రత ఉండాలి. శ్రీ కనకదుర్గమ్మ ఆలయ నిర్వహణపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపడతారా? భక్తుల సందేహాలకు సమాధానం చెబుతారా? అన్నది వేచి చూడాలి.

నవంబర్ చివరికల్లా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, అక్టోబర్ 17(మనం న్యూస్): ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. శనివారం ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు నదిపై నిర్మాణంలో వున్న తీగల వంతెన పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్తో కలిసి ఆయా నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్ భవనాలు, అంతర్గత రహదారులు, ఇతర మౌళిక సదుపాయాల పనులను సమాంతరంగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన పనుల విషయంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చి ప్రభుత్వ వైద్య కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భవన నిర్మాణాలతో పాటు విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు తదితర మౌళిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ముందుగా గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్కు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్తో పాటు మిగిలిన నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నవంబర్ చివరి నాటికి వైద్య కళాశాలకు సంబంధించిన అన్ని భవనాలను అవసరమైన వసతులతో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల హాస్టల్ నిర్మాణ తుది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. హాస్టల్లో అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. తుది దశలో ఉన్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వంతెనకు సంబంధించిన తుది దశ పనులన్నింటినీ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. రఘునాథపాలెంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ప్రధాన భవనం, హాస్టల్ భవనాలు, వంటగది, భోజనశాల నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌళిక వసతులు కల్పించేలా పనులు చేపట్టాలని, నిర్మాణాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. నీటి సరఫరా కు సంబంధించి చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, వైద్య శాఖ అధికారులు, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





జిల్లాలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనకు విస్తృత చర్యలు

- కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో): జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం, విక్రయాలను అరికట్టడానికి పోలీసు, ఎన్ఫోర్స్మెంట్, వైద్య-ఆరోగ్య, విద్య శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఎన్కార్డ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా జిల్లాలోని పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంతో చదువులో వెనుకబడి, భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. మత్తు కోసం డబ్బుకోసం నేరాలకు, దొంగతనాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, కుటుంబాల్లో గొడవలు, మానసిక ఒత్తిడి, బంధాలు దెబ్బతింటాయని అన్నారు. మంచి సమాజం కొరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 55 గంజాయి/డ్రగ్స్ కేసులు నమోదు చేయగా, 137 మంది నిందితులను అరెస్టు చేశారన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు మార్గాలు, జిల్లాలోని అంతర్రాష్ట్ర రవాణా మార్గాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కేసులలో మూలాలు, సరఫరాదారులు, కొనుగోలుదారులను పూర్తి స్థాయిలో గుర్తించి, ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల వద్ద ప్రత్యేక పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. స్కూల్స్ వద్ద చాక్లెట్ల అమ్మకాలపై నిఘా పెట్టాలని, తరచు దాడులు నిర్వహించాలని అన్నారు.

విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జిల్లాలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇప్పటివరకు 57 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ-డ్రగ్ క్లబ్ ఏర్పాటు, నిర్వహణను నిర్బంధం చేయాలన్నారు. కళాశాలల నుండి హై స్కూల్ ల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీనీ భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

సత్తుపల్లి సన్నాహక సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పిలుపు

సత్తుపల్లి, అక్టోబర్ 17(మనం న్యూస్): ఖమ్మం - నల్లగొండ- వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

మూడు తరాలుగా కాంగ్రెస్ నేపథ్య నాయకుడు...

ఖమ్మం జిల్లాలో వెంకన్నగా, నల్గొండ జిల్లాలో దామన్నగా పేరుపొందిన నాయకుల సేవలు ప్రజలకు సుపరిచితమని ఎంపీ పేర్కొన్నారు.



రాంరెడ్డి కుటుంబం కాంగ్రెస్ పార్టీకి చిరకాలంగా సేవలందిస్తోందని, ఆ కుటుంబం నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అని వివరించారు. పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలను శాసనమండలిలో సమర్థంగా ప్రస్తావించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని కోరారు. భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి...

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబరు 6వరకే ఉందని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఎంపీ సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులను గుర్తించి, ఆన్లైన్లో ఓటరుగా నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఈ సమావేశంలో..: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎల్‌నినో ప్రభావాలను సమిష్టిగా ఎదుర్కొందాం
- ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక కష్టాలు తొలగించాలి
- దసరా పండుగ తర్వాత ఇందిరమ్మ ఇండ్ల రెండో జాబితా
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



పినపాక, అక్టోబర్ 17(మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని దీనిలో భాగంగా అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సన్న బియ్యం పథకం దేశానికి రోల్ మోడల్ గా నిలిచిందని, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా కూడా సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రేషన్ కార్డులు మంజూరయ్యాయని నేడు అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని బి.ఆర్.ఎస్ పాలనలో నూతన రేషన్ కార్డులను మంజూరు చేయలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి,గృహలక్ష్మి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గ్యాస్ సబ్సిడీ, రుణమాఫీ తదితర పథకాలకు అనేక వేల కోట్ల రూపాయలను కేటాయించి సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఒక్క ఓటరు మద్దతు పలకాలని కోరారు.

ఎల్‌నినో ప్రభావాలను సమిష్టిగా ఎదుర్కొందాం

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సవాళ్లపై రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడనున్న నేపథ్యంలో నీటి లభ్యతను అంచనా వేయాలని, సాగు ప్రణాళికను జాగ్రత్తగా రూపొందించుకోవాలని ఈ క్రమంలో వాణిజ్య పంటల వైపు రైతు దృష్టి సారించడం మూలాన ఆర్థిక అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుబాటులో ఉన్న వాతావరణ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించి రైతులు నిర్ణయాలు తీసుకోవాలని, మండలంలోని రైతులు వరి సాగు చేయవద్దని మునగ,మినుములు, పెసలు, కందులు, నువ్వులు తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తే ప్రభుత్వం అందించే సబ్సిడీలకు అర్హులవుతారని కోరారు.

దసరా తర్వాత ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆశలు పెట్టుకున్న అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. దసరా పండుగ అనంతరం ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

నిర్మాణం మొదలు పెట్టని, అసంపూర్తి నిర్మాణాలతో ఆగిన ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు చొరవ చూపాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలులో నిజమైన లబ్ధిదారులను గుర్తించడమే కాకుండా ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఏవో వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డిటి ప్రభాకర్ రావు, వెటర్నరీ వైద్యురాలు శిరీష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామనాథం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీనివాసరెడ్డి,బోడ రమేష్, ఆత్మ కమిటీ జిల్లా అధ్యక్షులు మద్దెల సమ్మయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు పూనెం వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షులు అచ్చా నవీన్,ఉప సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు రాజేష్, గ్రామపంచాయతీ సర్పంచులు,ఉప సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17 (మనంప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు), ఎన్నికల విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఏఈఆర్ఓలు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సూపర్వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, అనర్హుల వివరాలు జాబితాలో లేకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియను చేపడుతున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా, ఓటరు జాబితాలో వివరాల సవరణలు నిబంధనల ప్రకారం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియలో జాగ్రతలు పాటించాలి

- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



మార్కాపురం,అక్టోబర్,17,(మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్లో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలుకు ఆదివారమే చివరి రోజు కావడంతో కూటమి అభ్యర్థులంతా ఎలాంటి జాప్యం లేకుండా నామినేషన్ దాఖలు ప్రక్రియలో తగిన జాగ్రత్తలు పాటించాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పోటి అభ్యర్థులకు సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, అవసరమైన పత్రాలతో నామినేషన్లను సకాలంలో సమర్పించాలని ఆయన కోరారు. మార్కాపురం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా కూటమి తరపున బరిలో ఉన్న వక్కలగడ్డ మల్లికార్జునరావు విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా గిద్దలూరు మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ జేవీ నారాయణ ఘన విజయం సాధించాలని, కనిగిరి మున్సిపాలిటీ టీడీపీ అభ్యర్థి కూడా విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లాలో కూటమికి తిరుగులేదని, ఎన్నిక ఏదైనా ప్రజల మద్దతుతో విజయం కూటమిదేనని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ పాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి జరుగుతున్న కృషి కూటమికి మరింత బలాన్నిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంకల్పం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న పాలన కూటమి అభ్యర్థులకు ప్రజల్లో ఆదరణ పెంచుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా అభివృద్ధికి మరింత ఊతమివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి ముసుగులో బుల్డోజర్‌ల పాలన

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిరాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి మాదిగ



భూపాలపల్లి అక్టోబర్ 17 మనం ప్రతినిధి: జిల్లా కేంద్రంలో అభివృద్ధి ముసుగులో పాలకులు బుల్డోజర్ పాలన నడిపిస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి పాలకుల పై మండిపడ్డారు. రోడ్డు విస్తరణ పేరట సింగరేణి ఉద్యోగులసంఘం కార్యాలయాన్ని కూల్చే కుట్ర జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాడు భూతల రాజు భవన్ టి ఎస్ యు ఎస్ కార్మిక సంఘం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ అంబేద్కర్ సెంటర్ నుండి కృష్ణ కాలనీ వరకు ఆ ప్రాంతంలో అభివృద్ధిలో భాగంగా ఎస్పీ ఆఫీస్ మున్సిపల్ ఆఫీస్ కోర్టు వివిధ ఆఫీసులు నిర్మాణంలో ఉన్నాయి అటువైపు ఏమో 80 , పీట్ల రోడ్డు తీస్తున్నారు అందులో కూడా 10 ఫీట్లు తగ్గించారు కేవలం 70 ఫీట్ల రోడ్డు వేస్తున్నారు హనుమకొండ టు కాలేశ్వరం వరకు ఆ రోడ్డు కేవలం 100 ఫీట్లు మాత్రమే ఉంది అంబేద్కర్ సెంటర్ నుండి బస్ డిపో ఓసి టు అది కొద్ది రోజులైతే బందు అయో గాని ఇటువైపు 200 ఫీట్ల రోడ్డు ఎందుకు అని అన్నారు.సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయాలు అభివృద్ధికి ఏమాత్రం అడ్డుగా లేవని ఈ విషయం భూపాలపల్లి ఎమ్మెల్యే ఒక్కసారి ఆలోచించాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యేగా గెలవడానికి తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అనేక దపాలుగా తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సమావేశాలు లు పెట్టిన సందర్భాలు ఉన్నాయని,వీ ఎ గెలుపు కోసం తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం వివిధ ప్రజా సంఘాలు అనేక కృషిచేసి మిమ్మల్ని గెలిపించుకోవడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.గతాన్ని మరచిన మీరు పదేపదే తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘాన్ని కూలుస్తామని మాట్లాడుతున్నారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు ప్రజల వైపు చేస్తున్న పోరాటాలు మరిచిపోయారా అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లో నాయకులు దోర్నాల రాజేందర్ మాదిగ , అంతడూపుల మాదిగ, చంటి మాదిగ, మెరుపటి అశోక్ మాదిగ, దోర్నాల భరత్ మాదిగ , బోనపాకల కుమార్ మాదిగ , కొప్పుల సతీష్ మాదిగ , కల్లపల్లి తిరుపతి మాదిగ ,సదరం రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా జగన్మాత



మార్కాపురం,అక్టోబర్,17,(మనం న్యూస్): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కనకదుర్గా నగర్లోని కళావేదికపై సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వికసించింది. సకల లోకాలకు ఐశ్వర్యాన్ని, ఆయురారోగ్యాలను, సమస్త శుభాలను అనుగ్రహించే అష్టైశ్వర్యప్రదాయిని శ్రీ కనకదుర్గ అమ్మవారు ఇంద్రకీలాద్రి శిఖరాన పద్మాసనారూఢురాలై శ్రీ మహాలక్ష్మి దేవి దివ్యాలంకారంలో భక్తులకు కటాక్షాన్ని ప్రసాదిస్తున్నారు. కొండపై లక్ష్మీదేవి కటాక్ష వీక్షణాల కోసం భక్తజనం బారులు తీరగా, కొండదిగువన దుర్గా నామస్మరణతో, భక్తి ప్రవచనాలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక తేజస్సుతో వెలిగిపోయింది.

శ్రీ మహా లక్ష్మీదేవి అలంకృత అమ్మవారిని దర్శించుకున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

హైదరాబాద్, అక్టోబర్, 17,(మనం ప్రతినిధి): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం దర్శించుకున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలసి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయానికి చేరుకున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి అధికారులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి

అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కు వేదాశీస్సులు అందజేశారు. ఆయనకు దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్ తదితరులు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

విద్యార్థుల విజయానికి త్రిశక్తుల అనుగ్రహం

- శ్రీపీఠంలో ఘనంగా మహాసరస్వతీ పూజ



కాకినాడ రూరల్, అక్టోబర్ 17(మనంన్యూస్)ః విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు సృజనాత్మకత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామివారు ఆకాంక్షించారు. మహాగణపతి, మహాసరస్వతీ దేవి అనుగ్రహంతో పాటు గురువుల మార్గదర్శకత్వం విద్యార్థుల అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. చదువుతో సాధించిన ఉన్నత స్థానాన్ని వ్యక్తిగత అభివృద్ధికే పరిమితం చేయకుండా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం చేయడం ద్వారా సమాజానికి తిరిగి సేవ చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఉదయం వేలాదిమంది విద్యార్థులచే శ్రీ పీఠం ఆవరణలో మహా సరస్వతి పూజ జరిగింది. అలాగే అనేకమంది విద్యార్థులచే అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ రెండు కార్యక్రమాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిపూర్ణానంద స్వామి వారు మాట్లాడుతూవిద్యార్థులు తమ చదువును ప్రారంభించే ముందు మహాగణపతి, మహాసరస్వతీ దేవి, గురువులను స్మరించుకోవాలని సూచించారు. మహాగణపతి అనుగ్రహం వల్ల రచనా నైపుణ్యాలు, విషయంపై పట్టు, సాహిత్యంపై అవగాహన పెరుగుతాయని వివరించారు. సరస్వతీ దేవి అనుగ్రహం జ్ఞానం, సృజనాత్మకత, జ్ఞాపకశక్తి వికాసానికి తోడ్పడుతుందని తెలిపారు.

ప్రస్తుతం కంప్యూటర్లు, జీపీఎస్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు ఎన్నో విషయాలను క్షణాల్లో అందిస్తున్నాయని, అయితే వాటిని సృష్టించింది మానవ మేధస్సేనని గుర్తుచేశారు. మనిషిలోని జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత సక్రమంగా వికసిస్తేనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని చెప్పారు. విద్యార్థులు చదివిన విషయాలను గుర్తుంచుకోవడంతో పాటు, వాటిని సందర్భానుసారంగా ఉపయోగించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

గురువు చూపిన మార్గంలో స్వతంత్రంగా ఎదగాలి

విద్యార్థుల జీవితంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని పరిపూర్ణానంద స్వామివారు పేర్కొన్నారు. గురువులు విద్యార్థులకు పాఠ్యాంశాలు, సూత్రాలు, లెక్కలు, విషయాల మధ్య సంబంధాలు, వాటిని అన్వయించే విధానాలను నేర్పిస్తారని వివరించారు. విద్యను అభ్యసించిన తర్వాత వృత్తి జీవితంలో ప్రతి చిన్న విషయానికీ ఇతరులపై ఆధారపడకుండా, నేర్చుకున్న జ్ఞానాన్ని సొంత ఆలోచనాశక్తితో ఉపయోగించుకోవడమే నిజమైన సృజనాత్మకత అని తెలిపారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, మహాగణపతి, మహాసరస్వతీ దేవి, గురువుల అనుగ్రహాన్ని ప్రతిరోజూ స్మరించుకోవాలని సూచించారు.

లక్ష్యానికి కుటుంబం, స్నేహం, సమాజం అడ్డంకి కాకూడదు

విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించే క్రమంలో నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని స్వామివారు సూచించారు. కుటుంబ పరిస్థితులు చదువుకు ఆటంకం కలిగించకూడదని, స్నేహం ఆనందాన్ని పంచేదిగా ఉండాలే తప్ప లక్ష్యాన్ని దెబ్బతీసేదిగా మారకూడదని చెప్పారు. సమాజంలోని ప్రతికూల పరిస్థితులు తమ పురోగతిని అడ్డుకోకుండా జాగ్రత్తపడాలని, పాఠశాలలు, కళాశాలల్లోనూ చదువుకు అనుకూలమైన వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు ఎంచుకున్న రంగం ఏదైనా, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయవంతంగా స్థిరపడాలనే సంకల్పాన్ని కలిగి ఉండాలని తెలిపారు.

పేద విద్యార్థికి అండగా నిలవండి

జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కనీసం ఒక్క పేద విద్యార్థి విద్యాభ్యాసానికి సహాయం చేయాలని పరిపూర్ణానంద స్వామివారు పిలుపునిచ్చారు. చదువుకోవాలనే ఆసక్తి, ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు, సరైన కుటుంబ నేపథ్యం లేక అవకాశాలకు దూరమవుతున్న బాలబాలికలను గుర్తించాలని సూచించారు.

అటువంటి విద్యార్థులకు అవసరమైన విద్యా సహాయం అందించి, వారు స్వతంత్రంగా నిలదొక్కుకునే వరకు అండగా ఉండాలని చెప్పారు. సహాయం చేసే ముందు నిజంగా అవసరంలో ఉన్నవారిని గుర్తించడం ముఖ్యమని పేర్కొన్నారు. మనం ఎదగడానికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, సమాజం, దైవానుగ్రహం తోడ్పడతాయని గుర్తుచేస్తూ, మన ఎదుగుదలలో సమాజానికి కూడా భాగస్వామ్యం ఉందనే బాధ్యతతో జీవించాలని హితవు పలికారు.

అమ్మవారితో మమేకమై ఆధ్యాత్మిక సాధన చేయాలి

- భక్తిలో భాగస్వాములవ్వాలి
- మహాశక్తి యాగంలో భక్తులకు పరిపూర్ణానంద సరస్వతి స్వామి సందేశం





కాకినాడ రూరల్, అక్టోబర్, 17: అమ్మవారి ఆరాధనను కేవలం బాహ్య పూజలకే పరిమితం చేయకుండా, అంతరంగంలోనూ అమ్మవారిని దర్శించుకుంటూ ఆధ్యాత్మిక సాధన చేయాలని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామివారు భక్తులకు పిలుపునిచ్చారు. మనసులోని కల్మషాలను తొలగించుకుని స్వచ్ఛమైన హృదయంతో అమ్మవారికి అంకితం కావాలని సూచించారు. నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న మహాశక్తి యాగంలో భాగంగా సప్తమి రోజు జరిగిన సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమంలో ఆయన భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. 7వ రోజు శనివారం మహాశక్తి యాగం ఎంతో ఘనంగా జరిగింది. శ్రీ పీఠంలో వేంచేసి ఉన్న ఐశ్వర్యాంబికా

అమ్మవారు శ్రీ సరస్వతి దేవిగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ అంతరంగంలో అమ్మవారిని దర్శించుకోవాలి నవరాత్రుల్లో అమ్మవారి సేవలో పాల్గొంటూ, సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకునే భాగ్యం లభించడం గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. అమ్మవారి సేవకు అంకితమై ప్రశాంతమైన మనసుతో పూజల్లో పాల్గొనాలని కోరారు. అమ్మవారిని బయట విగ్రహంలో దర్శించుకోవడం ఒక విధమైన చూపు అయితే, అంతరంగంలో అమ్మవారిని అనుభూతి చెందడం మరో ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితి అని వివరించారు. సాధన పెరిగే కొద్దీ భక్తుడికి, అమ్మవారికి మధ్య ఉన్న భేదభావం తొలగిపోయి, దైవచైతన్యంతో మమేకమయ్యే అనుభూతి కలుగుతుందని చెప్పారు. మనసును చింతల నుంచి దూరంగా ఉంచి, అమ్మవారి నామస్మరణతో నింపుకోవాలని సూచించారు. సహస్రనామ కుంకుమార్చనలో మృగీ ముద్రకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని స్వామివారు వివరించారు. బొటనవేలు, మధ్యవేలు, ఉంగరపు వేలి సహాయంతో కుంకుమను తీసుకుని అమ్మవారికి సమర్పించే విధానాన్ని భక్తులకు తెలియజేశారు. కుందేలు, జింక వంటి సున్నితమైన జీవులు సాత్వికతకు, స్వచ్ఛతకు ప్రతీకలుగా భావించబడతాయని పేర్కొన్నారు. మృగీ ముద్రతో కుంకుమార్చన చేయడం ద్వారా తమ మనసులోని కల్మషాలను తొలగించుకుని, ఎలాంటి కపటం, దోషభావం లేకుండా అమ్మవారి పాదాల చెంత మల్లెపువ్వులా స్వచ్ఛంగా ఉండాలనే సంకల్పాన్ని వ్యక్తం చేయాలని సూచించారు. కేవలం సంకల్పం చెప్పుకోవడమే కాకుండా, ఆచరణలోనూ మంచి మార్పు తెచ్చుకోవాలని, మన ఆలోచనలు, ప్రవర్తన, జీవన విధానంలో స్వచ్ఛతను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

మంత్రం.. మౌనం.. దైవచింతనతో ఏకాగ్రత

కుంకుమార్చన సమయంలో భక్తులు ప్రశాంతంగా కూర్చుని, అమ్మవారి రూపాన్ని తమ మనసులో స్థిరపరచుకోవాలని స్వామివారు సూచించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన తెరల ద్వారా అమ్మవారి దర్శనం చేసుకుంటూనే, అంతరంగంలోనూ అమ్మవారిని స్మరించాలని చెప్పారు. పూజా సమయంలో అనవసరమైన మాటలకు, ఇతర ఆలోచనలకు దూరంగా ఉండాలని, మంత్రోచ్చారణ, మౌనం, దైవచింతనపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ఆధ్యాత్మిక సాధన ద్వారా మనలో సూక్ష్మమైన చైతన్య తరంగాలు వ్యాపిస్తాయని, వాటిని అనుభూతి చెందేందుకు మనసును సిద్ధం చేసుకోవాలని సూచించారు. జీవితంలో జరిగే ప్రతి పనినీ అమ్మవారి పాదాలకు అంకితం చేయడం ద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. యాగ ప్రాంగణంలో వేలాది మంది భక్తుల కోసం వివిధ సేవలు నిరంతరాయంగా సాగుతున్నట్లే, జీవితంలోనూ బాధ్యతలను నిర్వర్తిస్తూ దైవంపై విశ్వాసంతో ముందుకు సాగాలని వివరించారు. విద్యార్థుల్లో సరస్వతీ ఉపాసన. సంస్కారాల పెంపునకు శ్రీపీఠం కృషి నవరాత్రుల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల కోసం నిర్వహించిన మహాసరస్వతీ పూజకు విశేష ప్రాధాన్యం ఉందని స్వామివారు తెలిపారు. చిన్నతనం నుంచే పిల్లలకు మంచి సంస్కారాలు, ఆధ్యాత్మిక విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు కొంతవరకు మాత్రమే మార్గనిర్దేశం చేయగలరని, అయితే మంచి వాతావరణంలో పెరిగిన పిల్లలు ఉన్నతమైన విలువలను అలవర్చుకుంటారని పేర్కొన్నారు. పుట్టబోయే పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరిలోనూ మంచి సంస్కారాలను పెంపొందించేందుకు శ్రీపీఠం ఒక ఆలంబనగా నిలవాలన్నదే తన సంకల్పమని వెల్లడించారు.

తాను ఉన్నా లేకపోయినా, శ్రీపీఠం ద్వారా పొందిన ఆధ్యాత్మిక ప్రేరణను ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుని, తమ జీవితాల్లో మంచి మార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. భక్తులు తనకంటే అమ్మవారికి మరింత దగ్గర కావడమే తనకు సంతోషాన్నిస్తుందని అన్నారు. దైవచైతన్యంతో మమేకమైనప్పుడు వ్యక్తిగత అహంభావం తగ్గి, అందరిలోనూ ఏకత్వ భావన పెరుగుతుందని వివరించారు.

ఘనంగా మహాసరస్వతీ హోమం.

రేపు ఐశ్వర్య దీప పూజ మహాశక్తి యాగంలో భాగంగా సప్తమి రోజు సాయంత్రం ఇదే ప్రాంగణంలో మహాసరస్వతీ హోమం ఘనంగా నిర్వహించినట్లు స్వామివారు తెలి



డెమోక్రాట్‌లు గెలిస్తే.. 1929 నాటి మాంద్యం దాపురిస్తుంది

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, అక్టోబర్ 17 : త్వరలో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్‌లు విజయం సాధిస్తే 1929 తరహా మాంద్యంలోకి దేశం జారుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ మేరకు ఓ వీడియోను పోస్టు చేశారు. మరోపక్క ఉభయసభల్లో రిపబ్లికన్‌లు మెజారిటీ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజనుడికి ఐదు వేల డాలర్లు అందిస్తామని హామీని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్‌స్కీపై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. యుద్ధాన్ని ముగించడానికి జెలెన్‌స్కీ సుముఖంగా లేరని.. అందువల్లే రష్యాపై దాడులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అమెరికాతో డీల్ చేసుకోవడానికి ఆయన సరైన వ్యక్తి కారని అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఆయన ఇక ఎంత మాత్రం పనికిరారని.. కొత్త వ్యక్తిని ఎన్నుకోవడం ఉత్తమమని ఆ దేశ ప్రజలకు సూచించారు.

ఇరాన్‌పై అణ్వాయుధాలను ప్రయోగించబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. ఆ దేశంలోకి అమెరికా సైనికులను పంపే ఆలోచన లేదన్నారు. మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అనేది అణుబాంబు కాదని ట్రంప్ వివరించారు. అది అత్యంత శక్తిమంతమైన బాంబు మాత్రమేనని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

భారత్ నుంచి అమెరికాకు 330 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

- **వైట్‌హౌస్ వెల్లడి**

వాషింగ్టన్, అక్టోబర్ 17 : ప్రపంచదేశాల నుంచి అమెరికాకు వచ్చిన పెట్టుబడుల లెక్కలను తాజాగా వైట్‌హౌస్ వెల్లడించింది. తమ దేశంలోకి ట్రిలియన్ల కొద్దీ పెట్టుబడులు ప్రవహించాయని, భారత్ నుంచే 330 బిలియన్ డాలర్లు మేర వచ్చాయని వెల్లడించింది. యూఎస్‌లో ప్రైవేటు పరిశ్రమలు, విదేశాల నుంచి వచ్చిన పెట్టుబడుల మొత్తం 10.87 ట్రిలియన్ డాలర్లని తెలిపింది. వైట్‌హౌస్ తన యూట్యూబ్ ఛానల్లో ఈ గణాంకాలను పదే పదే ప్రసారం చేసింది. 'అమెరికాలోకి ట్రిలియన్ల కొద్దీ డబ్బు వచ్చి చేరుతున్న శబ్దాన్ని హాయిగా కూర్చొని ఆస్వాదించండి' అని దేశ ప్రజలను ఉద్దేశించి ఎక్స్ పోస్టులో రాసుకొచ్చింది. కాగా.. అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలోని బ్రౌన్స్‌విల్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తోన్న కొత్త రిఫైనరీ ప్రాజెక్టులో భారతీయ సంస్థ రిలయన్స్ భాగస్వామిగా ఉంది. ఈ ప్రాజెక్టు నిమిత్తం రిలయన్స్ 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఏడాది మార్చిలో దీనిపై ప్రకటన వచ్చింది. మరోవైపు, భారత్కు చెందిన దిగ్గజ వ్యాపార సంస్థ ఎస్సార్ గ్రూప్ యూఎస్‌లో తన అనుబంధ సంస్థ మొసాబి మెటాలిక్స్ ద్వారా 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. అయోవా రాష్ట్రంలో ఉక్కు కర్మాగార నిర్మాణానికి ఎస్సార్ గ్రూప్ ఈ భారీ మొత్తాన్ని సమకూర్చనుంది. మే నెలలో జరిగిన సెలక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు సందర్భంగా.. అమెరికాలో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రణాళికలను భారత పారిశ్రామిక వర్గాలు ప్రకటించాయి. ఇదిలా ఉంటే.. వచ్చేనెలలో జరగనున్న మధ్యంతర ఎన్నికల కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఆ సభల్లో పెట్టుబడుల గురించి చెబుతున్నారు. తన ప్రభుత్వ హయాంలో 20 ట్రిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు, పెట్టుబడి హామీలను సాధించామని చెప్పారు.



చక్కెర ధరలకు కళ్లెం


చెరుకు నుంచి ఇథనాల్ తయారీ నిలిపివేత

ఢిల్లీ, అక్టోబర్ 17 : ఎల్ నినో భయాందోళనల వేళ దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలకు అడ్డుకట్ట వేసేందుకు, స్థానిక మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెరుకు నుంచి ఇథనాల్ ను తయారు చేసే విధానానికి తాత్కాలికంగా అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చక్కెరతో పాటు చెరుకు రసం, షుగర్ సిరప్, బీ-హెవీ మొలాసిస్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా షుగర్ ధరలు అదుపులోకి రానున్నాయి. వచ్చే నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 సరఫరా సంవత్సరానికి సంబంధించి కొత్త ఎథనాల్ టెండర్లను జారీ చేశాయి. ఈ తాజా టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్, బి-హెవీ మొలాసిస్ వంటి చెరకు ఆధారిత ముడిసరుకులకు పూర్తిగా మినహాయింపునిచ్చాయి. గత చక్కెర సరఫరా సీజన్లో దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర ఉత్పత్తి చేయడమే సవాలుగా మారింది. దేశంలో ఏటా సుమారు 280 నుంచి 285 లక్షల టన్నుల చక్కెర అవసరమవుతుండగా, గత సీజన్లో నికర ఉత్పత్తి దేశీయ డిమాండ్కు కొద్దిమేరకే సరిపోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో రాబోయే పండుగల సీజన్లో చక్కెర కొరత ఏర్పడకుండా నిల్వలను పెంచడంపై కేంద్రం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఇతర ధాన్యాలకు డిమాండ్..

ఇథనాల్ తయారీకి షుగర్ వాడకంపై బ్యాన్ విధించడంతో మొక్కజొన్న, విరిగిన బియ్యం, అదనపు ఆహార ధాన్యాలు, భారత ఆహార సంస్థ వద్ద ఉన్న మిగులు బియ్యం వంటి ధాన్యాల ఆధారంగా ఇథనాల్ ఉత్పత్తికి ప్రాధాన్యం పెరగనున్నట్లు తెలుస్తోంది. చక్కెర పరిశ్రమ నుంచి వచ్చే సీ-హెవీ మొలాసిస్ వంటి ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగంపైనా దృష్టి సారించనున్నారు. కాగా భారత్లో పెట్రోల్లో ఇథనాల్ కలిపే కార్యక్రమం కింద 20 శాతం ఇథనాల్ మిశ్రమం లక్ష్యాన్ని నిర్దేశించిన గడువుకంటే ముందుగానే సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 2,000 కోట్ల లీటర్లకు చేరినట్లు అంచనాలు ఉన్నాయి.

పుతిన్‌తో పోప్ సంభాషణ



- **కాల్పుల విరమణ పాటించాలని సూచన**

రోమ్, అక్టోబర్ 17 : యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో తీవ్రంగా దెబ్బతిన్న ఒలెస్కీ, ఖేర్సన్ ప్రాంతాల్లో నెలకొన్న మానవతా సంక్షోభంపై పోప్ లియో ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలకు ఆహారం, మందులు వంటి అత్యవసరాలను అందించేందుకు, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కాల్పుల విరమణ పాటించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సూచించారు. ఈ మేరకు ఆయనతో ఫోనులో మాట్లాడారు. ఇటీవలే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు శస్త్రచికిత్స చేయించుకున్న పోప్ క్రమంగా కోలుకుంటున్నారు. ఆసుపత్రి నుంచే ఆయన పుతిన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు.

20మంది కానిస్టేబుళ్లు కిడ్నాప్..!

కరాచీ, అక్టోబర్ 17 : శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు తమ ఇళ్లకు వెళ్తుండగా.. సినీ ఫక్కీలో సాయుధులు అడ్డుకొని వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటన పాకిస్థాన్‌లోని క్వెట్టా-కరాచీ హైవేపై చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. కలత్ పోలీస్ శిక్షణా కేంద్రంలో ఇటీవల పోలీసు కానిస్టేబుళ్లు తమ శిక్షణను పూర్తి చేసుకున్నారు. విధుల్లో చేరడానికి కొద్దిరోజుల ముందు 20మంది కానిస్టేబుళ్లు తమ ఇళ్లకు బయల్దేరారు. శనివారం క్వెట్టా-కరాచీ హైవేపై ఒక ప్యాసింజర్ వ్యాన్‌లో వెళ్తుండగా.. మోటార్ సైకిళ్లపై వచ్చిన కొందరు సాయుధులు వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం వాహనంతో పాటు అందులోని 20మంది కానిస్టేబుళ్లను కూడా అదుపులోకి తీసుకొని, గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకువెళ్లారు. వ్యాన్ డ్రైవర్, మరో ముగ్గురు ప్రయాణికులను మాత్రం వారు విడిచిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మాస్తుంగ్ పోలీసులు ధ్రువీకరించారు. అపహరణకు గురైన సిబ్బంది లెవీస్ ఫోర్స్‌కు చెందినవారని పేర్కొన్నారు. వారి ఆచూకీ కనుగొనేందుకు పాక్ భద్రతా దళాలు సమీపంలోని పర్వతాలలో గాలింపు చర్యలు చేపట్టాయి. కానిస్టేబుళ్ల కిడ్నాప్‌కు బాధ్యత వహిస్తూ ఇప్పటి వరకు ఏ ఉగ్రసంస్థ ప్రకటన వెలువరించలేదు.



ఐదు రోజులకే వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ జకారియాపై వేటు..!

ట్రంప్ కీలక నిర్ణయం...

వాషింగ్టన్, అక్టోబర్ 17 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఐదు రోజులకే కేటీ జకారియాను ఆ పదవి నుంచి తొలగించారు. ఆమె పనితీరుపై విమర్శలు రావడం, విద్యార్హతలపై ప్రశ్నలు తలెత్తడం ఈ పరిణామానికి కారణంగా తెలుస్తోంది. కేటీ జకారియా ఈ నెల 12న శ్వేతసౌధ మీడియా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ మరుసటి రోజే ఆమె తొలిసారి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అయితే ఆ సమావేశం 15 నిమిషాల్లోపే ముగిసింది. కేవలం ముగ్గురు విలేకరులు అడిగిన ప్రశ్నలకే ఆమె బదులిచ్చారు. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో తడబడ్డారు. దీంతో ఆమె పనితీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు, తాను గతంలో న్యాయవాదిగా పనిచేశానని జకారియా ఓ సందర్భంలో చెప్పారు. అయితే, ఆమె విద్యార్హతలపై అనుమానాలున్నట్లు వార్తలు రావడం చర్చనీయాంశమైంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ లాంటి ఉన్నత పదవిలో ఉన్న ఆమె అబద్ధాలు చెబుతోందని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. పదవిలో కొనసాగాలా? వద్దా? అనే అంశంపై పునరాలోచించుకోవాలని జకారియాకు సూచించినట్లు తెలిపారు. ఈ పని ఆమెకు సంతోషాన్ని ఇవ్వకపోవచ్చని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత కొన్ని గంటలకే ఆమెను పదవి నుంచి తొలగించినట్లు వార్తలు రావడం గమనార్హం. అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.



జంతర్ మంతర్ హింసపై ఫిర్యాదులకు ప్రత్యేక పోర్టల్

ఢిల్లీ, అక్టోబర్ 17 : ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశారు. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హైపవర్డ్ ఎంక్వైరీ కమిటీ (హెచ్‌పీఈసీ) ఈ పోర్టల్ ను ప్రారంభించింది. ఈ ఏడాది జులైలో ఢిల్లీ జంతర్ మంతర్తో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపైనా విచారణ చేయనున్నామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. బాధితులు, పోలీసు సిబ్బంది ఫిర్యాదుల కోసం జిఫ్ఛిఫిజీఫి.జీఫీ పోర్టల్ను ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఘటనలకు సంబంధించిన అన్ని అంశాలపై హైపవర్డ్ ఎంక్వైరీ కమిటీ విచారణ చేపట్టనుంది. పెల్లెట్ గన్స్ వినియోగంపైనా ప్రత్యేక దృష్టి పెట్టనుంది. మహిళా నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడులు, వేధింపులపైనా కమిటీ విచారించనుంది. ఇరు వైపుల నుంచి జరిగిన హింస, ఆస్తుల విధ్వంసాన్ని పరిశీలించనుంది. బాధితులు తమ ఫిర్యాదులు, వినతిపత్రాలను పోర్టల్లో అప్లోడ్ చేసేందుకు కమిటీ అవకాశం ఇచ్చింది. బాధితులు కోరుకుంటే వారి గుర్తింపును గోప్యంగా ఉంచేలా పోర్టల్ను రూపొందించారు. బలహీన వర్గాల సాక్షులకు తగిన రక్షణ కల్పించే ఏర్పాట్లు చేశారు. అలాగే.. హింసాత్మక ఘటనలకు సంబంధించిన సమాచారం, సూచనలు అందించేందుకు ఇతరులకు కూడా అవకాశం ఇచ్చారు. భౌతికంగా ఫిర్యాదు చేయాలనుకునేవారు ఢిల్లీలోని హెచ్ పీఈసీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఆ కార్యాలయ చిరునామా: శిక్షా సదన్, 17, రౌస్ అవెన్యూ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, న్యూఢిల్లీ - 110002. పని దినాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారు.

క్యాన్సర్ పేషెంట్లకు మహా సర్కారు శుభవార్త

- **ఆరోగ్య బీమా పథకాల పరిధిలోకి పీఈటీ-సిటీ స్కానింగులు**



ముంబై, అక్టోబర్ 17 : క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్యాన్ని మరింత చేరువ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం, కణితి దశను నిర్ధారించడం, చికిత్స పురోగతిని పర్యవేక్షించడం లో అత్యంత కీలకమైన పీఈటీ-సిటీ స్కానును ఇకపై ఆరోగ్య బీమా పథకాల పరిధిలోకి తీసుకువచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో అమలవుతున్న 'మహాత్మా జ్యోతిరావ్ ఫూలే జన్ ఆరోగ్య యోజన'తో పాటు కేంద్ర ప్రభుత్వ 'ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' లబ్ధిదారులకు ఈ ఖరీదైన పరీక్షలు ఉచితంగా అందనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య శాఖ అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేస్తూ, మొత్తం 63 క్యాన్సర్ చికిత్సా ప్యాకేజీల పరిధిలో పీఈటీ-సిటీ స్కాన్ను అదనపు రోగ నిర్ధారణ ప్రక్రియగా చేర్చినట్లు ప్రకటించింది.

అంతేకాకుండా, తీవ్రత ఎక్కువగా ఉండే 13 నిర్దిష్ట రకాల క్యాన్సర్లకు సంబంధించి ఈ స్కాన్ను స్వతంత్ర లేదా ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షగా పరిగణిస్తూ మార్గదర్శకాలను సవరించింది. సాధారణంగా ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో రూ. 15,000 నుంచి రూ. 30,000 వరకు ఖర్చయ్యే ఈ అత్యంత కీలకమైన స్కాన్ పేద, మధ్యతరగతి రోగులకు ఆర్థిక భారంగా మారి సకాలంలో చికిత్స అందకుండా చేస్తుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తో వేలాది మంది నిరుపేద క్యాన్సర్ బాధితులకు ఆర్థిక భారం తప్పడంతో పాటు, వ్యాధిని ముందస్తుగానే గుర్తించి ప్రాణాలు కాపాడేందుకు వీలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు, వైద్య వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

14 సాంకేతికతలపై చైనా ఎగుమతి ఆంక్షలు?

గతంలో భూఅయస్కాంత లోహాలపై నిషేధంతో ఇబ్బందులు

ఈ సారి ఏఐ, బయోటెక్, సోలార్ టెక్నాలజీలపై ప్రభావం

బీజింగ్, అక్టోబర్ 17 : కృత్రిమ మేధ(ఏఐ), బయోటెక్నాలజీ, సౌర శక్తి రంగాల్లోని 14 సాంకేతికతలపై కొత్తగా ఎగుమతి ఆంక్షలను ప్రతిపాదిస్తూ ఒక ముసాయిదా ప్రణాళికను చైనా శుక్రవారం విడుదల చేసింది. అంతర్జాతీయంగా తనకు సాంకేతిక పోటీ ఉన్న దేశాలపై ఈ ఆంక్షలు విధించొచ్చు. మరీ ముఖ్యంగా చైనీస్ ఏఐపై ఆధారపడే దేశాలపై ఇవి ఉండొచ్చని తెలుస్తోంది. ఇందులో భాగంగా కొన్ని ఏఐ సంబంధిత సాంకేతికతలు, మరికొన్ని సెల్-జీన్ థెరపీ సాంకేతిక ప్లాట్‌ఫామ్స్, సోలార్ సెల్ మాడ్యూళ్లను తయారు చేసే కొన్ని సాంకేతికతల ఎగుమతిపై నిషేధం విధించాలని ఆ దేశ వాణిజ్య, సైన్స్-టెక్నాలజీ శాఖలు సంయుక్తంగా ప్రతిపాదించాయి. భవిష్యత్‌లో ఈ మూడు రంగాల నుంచి మరో 26 సాంకేతికతలపైనా ఎగుమతి ఆంక్షలు విధించాలని అనుకుంటోంది. దీనిపై ప్రజల నుంచి నవంబరు 15 వరకు స్పందనలు కోరింది.

ఏఐ రంగంలో నిషేధం విధించే సాంకేతికతలు.

జాతీయ స్థాయిలో సునిశిత సమాచారంతో శిక్షణ పొందిన ఏఐ లార్జ్ మోడళ్లకు చెందిన ప్రధాన సాంకేతికతలు..కీలక జాతీయ సమాచార మౌలిక వసతుల్లో, జాతీయ రక్షణ, ప్రధాన ప్రభుత్వ కార్యకలాపాల్లో పనిచేసే ఏఐ ఏజెంట్లు..2.5 డైమెన్షనల్, 3 డైమెన్షనల్ ఏఐ చిప్‌లు, 3డీ ఫ్లాష్ మెమొరీ..ఏఐ ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ సాంకేతికతలు, వాయిస్ ప్రింట్ రికగ్నిషన్ టెక్నాలజీలు బయోటెక్నాలజీలో బయోసెక్యూరిటీ నియంత్రణను తీసుకుచ్చేందుకూ చర్యలు చేపట్టనుంది. ఫొటోఓల్టాయిక్ సోలార్ సాంకేతికతల్లో దేశ భద్రతకు సంబంధించిన ఆందోళనలపై దృష్టి సారించింది.



గతంలోనూ: అంతక్రితం కూడా తాను గుత్తాధిపత్యం వహిస్తున్న అరుదైన భూఅయస్కాంత లోహాలపై చైనా నిషేధం విధించింది. దీంతో అమెరికా, భారత్ సహా అంతర్జాతీయ తయారీ వ్యవస్థలపై భారీ ప్రభావం పడ్డ సంగతి తెలిసిందే.

దుర్గమ్మ సేవలో.. విరోష్



విజయవాడ,అక్టోబర్, 17,(మనం న్యూస్): శనివారం పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో కలసి శ్రీ మహాలక్ష్మీదేవి అలంకృత అమ్మవారిని సినీ ప్రముఖులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న అనంతరం మీడియా పాయింట్ వద్ద విజయ్ దేవరకొండ దంపతులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని ఆకాక్షించారు.

ఏపీలో జరుగుతున్నది ఎన్నికలు కాదు..

చంద్రబాబు ఆధ్వర్యంలో పక్కా 'ఆర్గనైజ్డ్ క్రైమ్': వైయస్సార్సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ తీవ్ర అధికార దుర్వినియోగానికి, రాక్షస పాలనకు నిదర్శనంగా మారిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం తాడేపల్లిలోని వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేక, ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన్న భయంతోనే ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయకుండా పోలీసుల అండతో భౌతిక దాడులకు తెగబడుతోందని మండిపడ్డారు. పులివెందుల వంటి చోట్ల పోలీసులే నేరుగా కార్లపై దాడులు చేయడం అధికార పక్ష కిరాయి సైన్యంలాంటి తీరుకు అద్దం పడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిగా నిష్క్రియాపరంగా మారిపోయిందని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి, తమ పాలనపై ధైర్యం ఉంటే ప్రతిపక్ష అభ్యర్థులను స్వేచ్ఛగా నామినేషన్లు వేయనిచ్చి, ఎన్నికల బరిలో ప్రజా తీర్పును ఆహ్వానించాలని ఆయన సవాల్ విసిరారు.

ఇది ఎన్నికల ప్రక్రియ కాదు.. పక్కా ఆర్గనైజ్డ్ క్రైమ్!

రాష్ట్రంలో జరుగుతున్నది స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతమాత్రం కాదు. ఇది ముందస్తు ప్రణాళికతో చంద్రబాబు నాయుడు నడిపిస్తున్న ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్. ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తున్నారు. 15 లక్షల మంది మృతుల ఓట్లతో పాటు మరో 29 లక్షల బోగస్, డూప్లికేట్ ఓట్లు.. ఇలా మొత్తం 44 లక్షల అనుమానాస్పద ఓట్లు జాబితాలో ఉన్నాయి. దగ్గరలోనే ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియ ముగుస్తున్న తరుణంలో, దాన్ని పూర్తికాకముందే ఇంత హడావుడిగా లేని ఓట్లతో ఎన్నికలు జరపాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకొచ్చింది? కేవలం 12 రోజుల్లోనే మొత్తం తంతు ముగించేలా కుట్ర పన్నారు. చిట్టచివరి నిమిషంలో రిజర్వేషన్లు ప్రకటించి, ఎవరూ సిద్ధం కాకుండా చేశారు. అధికారంలో ఉన్న అడ్వాంటేజ్తో ప్రతిపక్షానికి అసలు అవకాశమే లేకుండా షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు.

రోజుకు 4 గంటలే సమయం..

సీసీ కెమెరాలు లేని చోట్ల కేంద్రాలు!

దేశంలో ఎక్కడా లేని విధంగా నామినేషన్లకు రోజుకు కేవలం నాలుగు గంటలు (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు) మాత్రమే సమయం ఇచ్చారు. ఆ నాలుగు గంటల్లో కూడా వైయస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తే భౌతికంగా అడ్డుకుంటున్నారు. నామినేషన్ కేంద్రాలను ప్రధాన కార్యాలయాల్లో కాకుండా, సీసీ కెమెరాలు కూడా లేని సందుగొందుల్లోని చిన్న పాఠశాలల్లో పెట్టారు.

fssai
Food Safety and Standards Authority of India

శిశువుల ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌ల వాడకం నిషేధం
ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు



ఢిల్లీ, అక్టోబర్ 17 : ఆరు నెలల వరకు వయసున్న శిశువులకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల విషయంలో 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక సూచనలు చేసింది. పిల్లల ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలను కలపడాన్ని నిషేధించాలని ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్స్-2020'కు సవరణ ముసాయిదాను ప్రచురించింది. పసితనంలోనే అదనపు చక్కెరలు తీసుకోవడాన్ని తగ్గించడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపింది. అలానే పోషకాహార భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రతిపాదనల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పష్టం చేసింది.

శిశువు ఎదుగుదలకు మొదటి ఆరు నెలలు అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన పోషకాలు అందించేలా.. సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్ లను కలపకుండా చూసేలా ఈ ప్రతిపాదనలను రూపొందించారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రభుత్వ సిఫార్సులను ప్రోత్సహించేందుకూ ఈ చర్యలు ప్రయోజనం చేకూరుస్తాయి. బాల్యంలోనే ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సవాళ్లను అరికట్టడం కూడా ఈ ప్రతిపాదనల ఉద్దేశం' అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. ముసాయిదా ప్రతిపాదనలపై 60 రోజుల్లోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించవచ్చని పేర్కొంది.

ఇప్పటి వరకు ఉన్న నిబంధనలు.. పుట్టినప్పటి నుంచి 24 నెలల వయసు వరకు ఉన్న పిల్లల కోసం ఉద్దేశించిన వివిధ రకాల పోషకాహార ఉత్పత్తులకు సమగ్ర పోషక కూర్పు, నాణ్యత, భద్రతా ప్రమాణాలను నిర్దేశిస్తున్నాయి. అలానే ఆరు నెలల వయస్సు వరకు ఉన్న శిశువుల ఆహార ఉత్పత్తుల్లో పరిమితి మేరకు సుక్రోజ్, ఫ్రక్టోజ్ ను చేర్చవచ్చు. అయితే తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిపాదిత నిబంధన ప్రకారం 6 నెలల వయసు వరకు ఉన్న శిశువుల ఆహార ఉత్పత్తుల్లో సుక్రోజ్, ఫ్రక్టోజును చేర్చరాదు.

బుల్లెట్ ట్రైన్ లక్ష్యంగా ఉద్యమం కొనసాగిస్తాం



సూర్యాపేట, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): జాతీయ రహదారి 65 సమాంతరంగా సూర్యాపేట మీదగా బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు ఎన్ని ఉద్యమాలకైనా సిద్ధమని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.బుల్లెట్ ట్రైన్ సాధన రిలే నిరాహార దీక్షలో భాగంగా శుక్రవారం 64వ రోజు దీక్షలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ముందుగా ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ కొనసాగించడం లక్ష్యంగా సూర్యాపేట జిల్లా ప్రజలతో పాటు జాతీయ రహదారి 65 పట్టణాల ప్రజలతో మమేకమై ఉద్యమాలు కొన సాగిస్తామని తెలిపారు. దీక్షను విరమింప చేసేందుకు సాయంత్రం సీనియర్ పాత్రికేయులు రిపోర్టర్ శ్రీరాముల కృష్ణ దీక్షలో కూర్చున్న వారికి శీతల పానీయాలు అందజేసి విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు వనిత, చల్లపల్లి నరసింహ,ఎర్కచర్ల శోభారాణి, మామిడి శెట్టి అంజయ్య , సుగుణమ్మ,చిల్లం చర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి సన్నిధిలో వైభవంగా మహాలక్ష్మీదేవి అవతారం

108 కలశాలతో సాయినాథులకు శుష్కఫల అభిషేకం

భక్తిశ్రద్ధలతో పార్వతీ కళ్యాణం హరికథాగానం



చింతపల్లి, అక్టోబర్ 17(మనం న్యూస్): చింతపల్లిలోని సాయి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

మహాలక్ష్మీదేవి అవతారాన్ని పురస్కరించుకుని మహాలక్ష్మీదేవి హోమం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.

అదేవిధంగా సాయినాథుల వారి 108వ పుణ్యతిథి (సమాధి) ఉత్సవాలను పురస్కరించుకుని సాయిబాబాకు 108 కలశాలతో శుష్కఫలాలు (డ్రై ఫ్రూట్స్) ఉపయోగించి విశేష అభిషేకం నిర్వహించారు. భక్తి పారవశ్యంతో సాగిన ఈ అభిషేక కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. సాయినాథుల వారి ఆశీస్సులు సమస్త ప్రజలపై ఉండాలని భక్తులు భక్తిపూర్వకంగా ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రముఖ హరికథా గాయని బంగారు లక్ష్మీ భగవతారిణి పార్వతీ కళ్యాణం హరికథను భక్తిరసభరితంగా ఆలపించారు. పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ ఘట్టాలను వివరిస్తూ సాగిన హరికథ భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తింది. భక్తి, సంగీతం, పురాణ గాథల సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక అలంకరణలు, పూజలు, హోమాలు, అభిషేకాలు, హరికథా కార్యక్రమాలతో సాయి సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొని సాయినాథుల వారి, మహాలక్ష్మీదేవి ఆశీస్సులు పొందారు.

సద్దుల బతుకమ్మకు గుట్టలుగా పువ్వులు



- ధరలు పెరిగిన కొనుగోళ్ల సందడి
- తిరుమలగిరిలో అడుగడుగున పూల వ్యాపారులు

తిరుమలగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని పూలే అంబేడ్కర్ చౌరస్తాలో పూలు గుట్టలుగా కనిపించాయి. పూల వ్యాపారులు వివిధ రకాల పూలతో కళకళలాడుతున్నాయి. పూలను కొనుగోలు చేయడానికి మహిళలతో సందడిగా మారింది. శనివారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు పూల దుకాణాల దగ్గర బతుకమ్మను అందంగా పేర్చేందుకు అవసరమైన పూలను కొనుగోలు చేశారు. బంతి, చామంతి,పట్టు కుచ్చులా తదితర రంగురంగుల పూలతో వ్యాపారులు టెంట్లు వేసుకొని విక్రయాలు జరుపుతున్నారు. పండుగ నేపథ్యంలో పూలకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా ఎక్కువగానే ఉన్నప్పటికీ బతుకమ్మ పండుగకు పూలు తప్పనిసరి కావడంతో మహిళలు ధరలను లెక్కచేయకుండా కొనుగోళ్లు చేస్తున్నారు. పూలకొనుగోళ్ళు బాగా జరగడంతో వ్యాపారాలు జోరందుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలకు అందంగా జరుపుకోవాలని వివిధ గ్రామాల మహిళలు ఉత్సాహంగా సిద్ధమవుతుండటంతో తిరుమలగిరి పట్టణంలో పండుగ వాతావరణంతో రద్దీతో కిట కిటలాడుతుంది.

జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా పెద్దిరెడ్డి గణేష్



సూర్యాపేట అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): ఇటీవల సూర్యాపేట జిల్లాలోని హుజూర్నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ రచయితల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నాలుగు నియోజకవర్గాల కార్యవర్గాల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యవర్గ సభ్యులు కవులు రచయితలు కలిసి శనివారం సూర్యాపేట జిల్లా రచయితల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి రచయిత, సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోవడం అదేవిధంగా ప్రముఖ కవి పిల్లల మరి పినవీరభద్రం కళాపీఠం వ్యవస్థాపకులు శీలా అవిలేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు కవులు రచయితల సంఘం తెలిపింది. వీరితోపాటు జిల్లాలోని సీనియర్ రచయిత ఆలేటి శంకర్ ను సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

నూతనంగా ఏర్పడిన జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా బెల్లంకొండ శ్రీరాములు, గడ్డం నర్సయ్య, తుమ్మరాజా లను నియమించారు. ఉపాధ్యక్షులుగా ధర్మారి వెంకటేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి, ఎర్ర హరికిషన్, సంయుక్త కార్యదర్శులుగా గొడితాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు, సరికొండ నరసింహారాజు ప్రచార కార్యదర్శిగా పబ్బతి వెంకటేశ్వర్లు,కార్యవర్గ సభ్యులుగా ముక్కామల జానకి రాములు, ఏబెల్ శశి, ఎన్ .సీ. రోజా, పూసోజు పద్మ, పోతుగంటి వీరాచారి, జిల్లేపల్లి జానయ్య, కొర్రపిడత శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, కొండా లింగారావు, ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ..సాహిత్య సాంస్కృతిక రంగంలో కవులు రచయితలను ఒక తాటిపై నడిపి సూర్యాపేట సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేస్తామని నూతన వర్తమాన కవులు రచయితలకు ప్రోత్సాహం ఇస్తూ వారి రచనలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. తెలుగు భాషను సుసంపన్నం చేసే దిశగా అనేక కార్యక్రమాలు తీసుకుంటామన్నారు. కవిత్వ కార్యశాలలతో పాటు, తెలుగు భాష విస్తృతికి ఉన్నతికి తెలుగు భాషా ఉపాధ్యాయులను కలిసి కృషి చేసేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు

.పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన కవిత్వ, కథా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తామని సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఆ బాధ్యతను తీసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన అనేకమంది కవులు రచయితలు సాహితీప్రియులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

- జిల్లా న్యాయమూర్తి వసంత పాటిల్



నల్లగొండ,అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా న్యాయమూర్తి వసంత పాటిల్ అన్నారు.జిల్లా న్యాయస్థాన ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆర్థిక సహకారంతో, పరిశుభ్ర నివాసం పచ్చని నివాసం కార్యక్రమ నిర్వాహకుడు మణిరాజు ఆధ్వర్యంలో 'ఇది నా చెట్టు' కార్యక్రమంలో భాగంగా 120 మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా న్యాయమూర్తి శ్రీ వసంత పాటిల్ గారి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మిగతా న్యాయమూర్తులు వారి వారి పేర్ల మీద మొక్కలు నాటగా, వారితో పాటు 120 మంది న్యాయవాదులు కూడా తమ పేర్ల మీద మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి వసంత పాటిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, చెట్లే సకల జీవులకు ప్రాణాధారమని అన్నారు. చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని, చెట్లు వాతావరణంలోని బొగ్గుపులుసు వాయువును పీల్చుకొని స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించి ప్రాణదాతగా ఉంటున్నాయని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ కనీసం ఒక చెట్టైనా నాటి సంరక్షించినచో ఎన్నో సమస్యలను ఎదుర్కోవచ్చని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కే. కవిత, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. రోజా రమణి, సీనియర్ పౌర న్యాయమూర్తి పి. పురుషోత్తం రావు, అదనపు సీనియర్ పౌర న్యాయమూర్తి ప్రమీల జైన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. హిమబిందు, ప్రత్యేక మద్యం నిషేధ న్యాయమూర్తి దారా సాయి మేఘన, జూనియర్ పౌర న్యాయమూర్తి సెరెన్ తేజ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకవరం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. సీనియర్ న్యాయవాదులు ఎం. నారాయణ రావు, జి. జవహర్ లాల్, శంకర్ బాబు, నాంపల్లి నరసింహ, ప్రభుత్వ న్యాయవాది పి. సైదులు, బొల్లా వెంకట్, గిరి, జిల్లా న్యాయస్థాన నాజర్, న్యాయస్థాన సిబ్బంది, అనేక మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

జిపి భవన నిర్మాణ పనులను పరిశీలించిన సర్పంచ్



తిరుమలగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): తిరుమలగిరి మండలం మొండి చింత తండ గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను సర్పంచ్ లావుడియా శ్రీలత బాలాజీ నాయక్. శనివారం పరిశీలించారు. కాంట్రాక్టర్ నాణ్యతతో త్వరగా భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఉపసర్పంచ్ జాటోత్ శిరీష శీను నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య కిషన్ నాయక్, వార్డు సభ్యులు ధరావత్ కండియా, లావుడ్య రఘు, వినోద, యాకూబ్ నాయక్. భూక్య సజ్జన్, రామ్ జీ నాయక్, గ్రామ పెద్దలు లావుడ్య వెంకన్న, ధరావత్ నాను దేవా, పూల్ సింగ్, శంకర్, రామోజీ, హచ్య, వస్రం,చందా, సాయి, మహిళలు పాల్గొన్నారు.

జిల్లా అడిషనల్ ఎస్పీకి పోలీసు ఉత్తమ సేవా పతకం

- డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా పతకం అందజేత
- అభినందనలు తెలిపిన జిల్లా ఎస్పీ కె. నరసింహ



సూర్యాపేట, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు-2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాల్లో సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి పోలీసు ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సీవీ ఆనంద్ డీజీపీ కార్యాలయంలో రవీందర్ రెడ్డికి పతకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డిని అభినందించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు విలువైన సేవలు అందించారని, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, కృషి అభినందనీయమని కొనియాడారు.

సుదీర్ఘ పోలీసు సేవలకు గుర్తింపు...

అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి 1992 సంవత్సరంలో సబ్ ఇన్స్పెక్టర్గా పోలీసు శాఖలో నియామకమై, పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్లో తొలి పోస్టింగ్లో విధులు నిర్వహించారు. అనంతరం 2007లో సర్కిల్ ఇన్స్పెక్టర్గా పదోన్నతి పొందారు. ఎస్ఐ, సీఐ హోదాల్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేవలందించారు. 2017లో డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం సీఐడీ విభాగంలో విధులు నిర్వహించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది వికారాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ డీసీపీగా, నిజామాబాద్లో, సికింద్రాబాద్ రైల్వే విభాగంలోనూ వివిధ హోదాల్లో సేవలందించారు. పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అందించిన సేవలకు గుర్తింపుగా ఆయనకు పోలీసు ఉత్తమ సేవా పతకం లభించడం పట్ల సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ హర్షం వ్యక్తం చేసింది. పోలీసు శాఖకు గౌరవం తీసుకొచ్చిన అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలకు దక్కిన గౌరవం



నేరేడుచర్ల,అక్టోబర్ 17 మనం న్యూస్ : నల్లగొండలో నిర్వహించిన 320ఈ 2025-26 జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నేరేడుచర్లకు విశేష గుర్తింపు లభించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ క్లబ్ అవార్డు విభాగంలో అధ్యక్షులు కీతా కనకయ్య, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ విభాగంలో లయన్ బట్టు మధు, ఉత్తమ సెక్రటరీ విభాగంలో లయన్ షేక్ యూసుఫ్, ఉత్తమ ట్రెజరీ విభాగంలో లయన్ సరికొప్పుల నాగేశ్వరరావు గవర్నర్ లయన్ మదన్మోహన్ రేపాల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో , జీఎంటి కో-ఆర్డినేటర్ లాయర్ విశ్వనాథం పాల్గొన్నారు. ఈ అవార్డులు క్లబ్ సభ్యుల సేవా స్ఫూర్తికి, సమాజాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచాయి.

భక్తి శ్రద్ధలతో నవరాత్రోత్సవాలు

గోకుల్ నవదుర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శన





హైదరాబాద్, అక్టోబర్ 17(మనంన్యూస్): పటాన్‌చెరులోని శ్రీ దుర్గా దేవి అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవాలు పురస్కరించుకుని గోకుల్ నవదుర్గ అసోసియేషన్ కే. మోహన్ యాదవ్ వారి ఆధ్వర్యంలో ఎంతో వైభోపేతంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.కే. మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో వైభోపేతంగా జరిగే జగన్మాత నవరాత్రి ఉత్సవాలలో శ్రీ దేవీ ఉపాసకులు 50 (మాత భక్తులు- నిరంతరం స్మరిస్తూ, ప్రత్యేక విధివిధానాలతో పూజించే ఆధ్యాత్మిక సాధకులు) మరియు శ్రీ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ వారు వేద బ్రాహ్మణుల మంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శక్తి స్వరూపిణి శ్రీ దుర్గా మాతను ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో పూజించుకుంటాం! మోహన్ యాదవ్ అన్నారు. అమ్మవారికి పూజలు,హోమం మరియు భక్తి శ్రద్ధలతో భజనలు చేస్తున్నారు శ్రీ దేవీ ఉపసకులకు (మాత భక్తులు), శ్రీ దుర్గాదేవి మాత కావడి పల్లకి ఊరేగింపు భక్తులలో ఎంతో ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని, భక్తి భావాన్ని నింపుతుంది. మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల హోరు, డప్పు చప్పుళ్లు, మరియు భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా, కనులపండువగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి దీపారాధన, ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహా ప్రసాదం వితరణ (మహా అన్నదాన) కార్యక్రమంలో పలు ముఖ్య నాయకులూ గూడెం మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాద్రి పృథ్వీరాజ్ , బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎండీఆర్ సహ వ్యవస్థాపకులు, కొలుకూరు రాజశేఖర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి , పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ , ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ దేవీ ఉపాసకులు (మాత భక్తులు) - మోహన్ యాదవ్ , శ్రీకాంత్ యాదవ్ , కిరణ్ ముధిరాజ్ , బ్రహ్మం చారి , నాని , రాజు, చిట్ట కుందన్ ముదిరాజ్, గోకుల్ నగర్ వాసులు ట్రస్ట్ సభ్యులు, మహిళలు, భక్తులు, పాల్గొన్నారు. అలాగే శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పటాన్చెరు లో బొనమ్మ గుడి ఆధ్వర్యంలో నిరవహించిన సంస్కృతిక నాట్య ప్రదర్శనలో చిన్నారులు తమ తమ కలణపుణ్యాని ప్రదర్శించి అందర్నీ ప్రత్యేక ఆకర్షణ నిలిచారు. వారి నాట్య ప్రదర్శనలో ఘనాలపై ఒక్కొక అమ్మవారి స్వయంగా లోకమతాలను భక్తులకు సాక్షారించినట్టు కనురెప్ప కదిలించకుండా తిలకరించారు.



శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పటాన్చెరు లోని బొనమ్మ గుడి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ అద్భుత కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరినీ ప్రత్యేకంగా ఆకర్షించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని పంచాయి. వేదికపై ఒక్కొక్క అమ్మవారి రూపంలో చిన్నారులు అభినయిస్తుంటే, సాక్షాత్తు ఆ లోకమాతలే స్వయంగా భక్తులకు సాక్షాత్కరించినట్లుగా అనిపించింది. చిన్నారుల ముఖ కవళికలు, ఆహార్యం, నృత్య రీతులకు భక్తులు ముగ్ధులయ్యారు. కనురెప్ప వేయకుండా ప్రదర్శనను తిలకించి, చిన్నారుల ప్రతిభను మనసారా అభినందించారు. గౌతంనగర్ లోని హిందూ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా ప్రసాదం వితరణ కార్యక్రమం జరిగాయి.

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ,అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రాష్ట్ర ఆడబిడ్డలకు రాష్ట్ర రోడ్లు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతిని పూజించి, బతుకును కొలిచే గొప్ప పండుగ బతుకమ్మ అని, తొమ్మిది రోజులుగా ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్న బతుకమ్మ సంబరాలు సద్దుల బతుకమ్మతో పరిసమాప్తం అవుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, ఆడపడుచుల జీవితాల్లో బంగారు పంటలు పండాలని ఆ బతుకమ్మ తల్లిని మనసారా కోరుకుంటున్నానని మంత్రి తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, ఇది తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతను చాటే పండుగ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. అందరూ సుఖ సంతోషాలతో సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



ములుగు, అక్టోబర్ 17,మనం ప్రతినిధి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు (ఎన్రోల్మెంట్) ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని గుర్తించి, ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు, ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గూడెపు రాకేష్



ములుగు, అక్టోబర్ 17,మనం ప్రతినిధి: ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గూడెపు రాకేష్ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్కు, రాష్ట్ర మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్తో పాటు జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాకేష్ పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ తరపున పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

కమెడియన్ రామచంద్రకు హీరో సంజోష్ రూ.15,000 ఆర్థిక సహాయం



ములుగు: అక్టోబర్ 17, మనం ప్రతినిధి: ములుగు జిల్లా నుంచి నటుడిగా ఎదిగి, 'బేవర్స్', 'సోదరా' వంటి చిత్రాల ద్వారా హీరోగా గుర్తింపు తెచ్చుకున్న సంజోష్ మానవత్వం చాటుకున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తోటి నటుడు, కమెడియన్ రామచంద్రను హైదరాబాదులో శనివారం ఆయన పరామర్శించారు. కొద్దికాలంగా బ్రెయిన్ ట్యూమర్, పక్షవాతంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ చికిత్స పొందుతున్న రామచంద్రను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తన వంతు సహాయంగా రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ చికిత్స నిమిత్తం ఇంకా సుమారు రూ.8 లక్షల వరకు అవసరమవుతుందని రామచంద్ర తెలిపారు. ఈ విషయాన్ని టాలీవుడ్ ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని రామచంద్ర కోరగా.. ఎన్టీఆర్ అన్న వరకు ఈ విషయాన్ని చేరవేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని సంజోష్ హామీ ఇచ్చేశారు. 'మన సినిమా కుటుంబానికి చెందిన రామచంద్ర గారికి నా వంతుగా సాయం చేశాను. ప్రజలు, తోటి నటులు కూడా వీలైనంత సాయం చేసి ఆయనకు అండగా నిలవాలి' అని సంజోష్ విజ్ఞప్తి చేశారు.

బతుకమ్మ పండుగ ప్రతి ఇంట సంతోషాలు నింపాలి

- మంత్రి సీతక్క



ములుగు,అక్టోబర్ 17,మనం ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలంగాణ ఆడబిడ్డలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైనదని తెలిపారు.

బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందించడంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేడుక అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు కష్టపడి పనిచేయాలి

- ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



ములుగు,అక్టోబర్ 17,మనం ప్రతినిధి: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అశోక్ కోరారు. క్షేత్రస్థాయిలో పట్టభద్రులను కలిసి ఎన్నికలపై అవగాహన కల్పించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మంత్రి సీతక్క సహకారంతో ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ బలోపేతమైందని పేర్కొంటూ, రానున్న ఎన్నికల్లో యువ నాయకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని అన్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్లో వివిధ బాధ్యతలు పొందిన నాయకులను పైడాకుల అశోక్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, యూత్ కాంగ్రెస్ నియోజ కవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

తంగేడు పూల సాక్షిగా.. తరతరాల సంస్కృతి



- ప్రకృతి ఆరాధనకు, మహిళల ఆత్మీయతకు ప్రతీక బతుకమ్మ
- జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు,అక్టోబర్ 17, మనం ప్రతినిధి: తంగేడు పూల పసిడి కాంతులు.. గునుగు పూల రంగుల సోయగాలు.. తీరొక్క పూలను పొందికగా పేర్చే చేతులు.. బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా కదిలే అడుగులు.. పల్లె జీవనాన్ని పలకరించే పాటలు.. ఇవన్నీ కలగలిసిన పూల సంబరం బతుకమ్మ. ప్రకృతిని ప్రేమిస్తూ, పూలలో దైవాన్ని దర్శిస్తూ, బంధాలను పెనవేసుకునే ఈ పండుగ తెలంగాణ జీవన సౌందర్యానికి అద్దం పడుతుందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. పూలనే దైవస్వరూపంగా పేర్చి ఆరాధించే విశిష్ట సంప్రదాయం బతుకమ్మ సొంతమని కలెక్టర్ తెలిపారు. అనేక సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలకు నిలయమైన తెలంగాణలో ఈ పూల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నేలతో, నీటితో, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా నిలుస్తోందని వివరించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలను రంగుల వరుసలుగా పేర్చడంలో మహిళల కళాత్మకత ఉట్టిపడుతుందన్నారు. ఒక్కో పువ్వును జాగ్రత్తగా అమర్చుతూ బతుకమ్మకు అందమైన రూపమిచ్చే తీరు వారి ఓర్పుకు, అభిరుచికి, సృజనాత్మకతకు నిదర్శనమని పేర్కొన్నారు. పూల సేకరణ నుంచి బతుకమ్మను సిద్ధం చేసే వరకు ఇంటిల్లిపాదీ కలిసి పాల్గొనడం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుందన్నారు. బతుకమ్మ పాటల్లో తెలంగాణ పలుకుబడి, పల్లె జీవితం, కుటుంబ అనుబంధాలు, తరతరాల అనుభవాలు వినిపిస్తాయని కలెక్టర్ తెలిపారు. మహిళలంతా వలయంగా చేరి, చప్పట్లు చరుస్తూ, గొంతు కలిపి పాడే పాటలు మన మౌఖిక సాహిత్య సంపదకు నిదర్శనమన్నారు. అమ్మమ్మలు, నానమ్మలు పాడిన పాటలను చిన్నారులకు నేర్పించడం ద్వారా భాషా సొగసును, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. పుట్టింటికి చేరిన ఆడబిడ్డలతో ఇళ్లలో సందడి నెలకొంటుందని, ఇరుగుపొరుగు మహిళల ఆత్మీయ కలయికతో వాడవాడలా పండుగ వాతావరణం వెల్లివిరుస్తుందని అన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కలిసి బతుకమ్మ ఆడటం సామూహిక ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. పలకరింపుల్లో ఆప్యాయత, పాటల్లో అనుబంధం, ఆటల్లో ఉత్సాహం ఈ వేడుకకు మరింత వన్నె తెస్తాయని తెలిపారు. బతుకమ్మను పేర్చే పెద్దల పక్కన కూర్చున్న చిన్నారులు పూల పేర్లను తెలుసుకుంటారని, పాటలు వింటూ స్థానిక సంప్రదాయాలను నేర్చుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలా ప్రతి ఇంటా జరిగే పండుగ ఏర్పాట్లే పిల్లలకు సంస్కృతిని పరిచయం చేసే చక్కని సందర్భాలన్నారు. సంప్రదాయాలను ఆచరించడంతోపాటు వాటి వెనుక ఉన్న భావాన్ని వివరించినప్పుడే తరతరాలకు వాటిని అందించగలుగుతామని తెలిపారు. ప్రకృతి ఒడిలో లభించే పూలతో జరుపుకునే బతుకమ్మ పర్యావరణం పట్ల బాధ్యతను గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. సహజ పూలతో బతుకమ్మలను పేర్చడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెరువులు, జలవనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పూలను ప్రేమించే సంస్కృతితోపాటు వాటిని అందించే ప్రకృతిని పరిరక్షించే చైతన్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పండుగ ఆనందం ప్రతి ఇంటికీ చేరాలని, పరస్పర గౌరవం, ఐక్యతతో ప్రజలంతా వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బతుకమ్మ నిమజ్జన సమయంలో నీటి వనరుల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు సంతోషంగా సంబరాల్లో పాల్గొనేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బతుకమ్మ పూల పరిమళాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, విజయదశమి అందరి జీవితాల్లో విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆకాంక్షించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ములుగు జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు, మీడియా ప్రతినిధులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

భద్రకాళి ఆలయంలో అయ్యప్ప మహా సంగమం పోస్టర్ ఆవిష్కరణ





హనుమకొండ, అక్టోబర్ 17(మనంన్యూస్): అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 13, 2026న హయగ్రీవ చారి గ్రౌండ్ లో నిర్వహించనున్న అయ్యప్ప మహా సంగమం పోస్టర్ ను వరంగల్ శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషు శర్మ ఆవిష్కరించారు.అర్చకులు సత్యం, నాగరాజ్ శర్మ జి. వెంకటాచారి, వెలగందుల భాస్కర్ లింగం, ఎస్. తిరుపతి రావు సహకారంతో పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ మహా సంగమానికి శబరిమల ఆలయం నుండి ఐదుగురు మేల్ శాంతులు (ప్రధాన అర్చకులు), జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు గారు, రాష్ట్ర అధ్యక్షుడు పుల్లంరాజు విచ్చేయ నున్నారని తెలిపారు. తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా హనుమకొండలో ఇంత భారీ స్థాయిలో అయ్యప్ప మహా సంగమం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కోశాధికారి రాయబారపు రవిరాజు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి దూశెట్టి భాస్కర్, స్టేట్ పీఆర్ఓ బయాన సంతోష్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల పవన్, ప్రధాన కార్యదర్శి గంగారపు బాలరాజు, కోశాధికారి సుదర్శన్, అజయ్, ప్రమోద్, కంకటి సాగర్, కమిటీ సభ్యులు పి. జితేందర్, సిహెచ్. భాస్కర్, బి. బాలాజీ, డి. నరసయ్య, డి. కాంతారావు, జక్కుల మధు కృష్ణ, నరేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


ఓటరు దరఖాస్తులు, నోటీసులను గడువులోగా పరిష్కరించాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా తయారీలో అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



ములుగు, అక్టోబర్ 17,మనం ప్రతినిధి: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, జారీ చేసిన నోటీసులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతి, పెండింగ్ నోటీసులు, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారం, ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితా తయారీకి సంబంధించిన ఫారం-18 దరఖాస్తుల పరిశీలనపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 ద్వారా అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హుల పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని సూచించారు. పేర్ల తొలగింపు, నమోదుపై అభ్యంతరాలకు సంబంధించి ఫారం-7 ద్వారా అందిన దరఖాస్తులపై నిబంధనల ప్రకారం విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఓటరు వివరాల సవరణ, చిరునామా మార్పు తదితర అంశాలకు సంబంధించి ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు.ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జారీ చేసిన నోటీసులపై అవసరమైన విచారణ చేపట్టి, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దశలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితా తయారీకి సంబంధించి అందిన ఫారం-18 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారుల అర్హతలు, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన అర్హత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. అర్హుల పేర్ల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాబితా తయారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ దరఖాస్తులు, నోటీసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం తహసీల్దార్ సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



బేకుమట్ల అక్టోబర్ 17 మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ యువ నాయకుడు బండి క్రాంతి గౌడ్ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన మన సంస్కృతికి ప్రతీక అని అన్నారు. తొమ్మిది రోజులపాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని తెలిపారు. ఈ సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు



ఎన్హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి



- బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతి

భూపాలపల్లి, అక్టోబర్ 17 మనం న్యూస్: జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి సముద్రాల తిరుపతి అన్నారు ఎన్.హెచ్. ఎం. జేపీసీ ఆధ్వర్యంలో గత అయిదు రోజులుగా చేపట్టిన దీక్షలకు శనివారం నాడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు 2022 నుంచి పెండింగ్లో ఉన్న 5 శాతం వేతన పెంపు, 8 శాతం వార్షిక వేతన పెంపును అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే 180 రోజుల ప్రసూతి సెలవులు, ఈ హెచ్ ఎస్. /ఈ ఎస్ ఐ. సౌకర్యాలు, ప్రమాద బీమా కల్పించాలని, పెండింగ్ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బీసీ సంఘాల మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికంటి రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారగోని ఎల్ల స్వామి గౌడ్, ఎన్ హెచ్ ఎం. ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి మృతి పట్ల సంతాపం



- మంగపేట మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు నివాళులు

మంగపేట, అక్టోబర్ 17, మనం ప్రతినిధి: శనివారం రోజు మంగపేట మండలంలోని కమలాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నపురెడ్డి రాణప్రతాప్ రెడ్డి,అమర్ నాథ్ రెడ్డి సోదరుడు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనారోగ్య కారణాలతో ఉదయం మరణించిన విషయం తెలుసుకున్న మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ,శ్రీనివాస్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి,సంతాపం వ్యక్తం చేశారు. ఈ పరామర్శలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు,ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,వెంగల బుచ్చిరెడ్డి,మండవ రామకృష్ణ,మైబూబుఖాన్,తుడి భగవాన్ రెడ్డి,హిదయతుల్ల,మండల నాయకులు గూడూరు రంజిత్,మిరియాల గోపాల్ రెడ్డి,నిమ్మకాయల శ్రీను,మునీర్ తదితరులు పాల్గొన్నారు.

కామెడీ వదిలేసి భక్తి బాటలో అల్లరి నరేష్..



కామెడీ సినిమాలతో ప్రేక్షకులను విపరీతంగా అలరించిన అల్లరోడు.. ఈమధ్య కాలంలో డిఫరెంట్ అండ్ వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు రూట్ మార్చిన అల్లరి నరేష్ భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం కలగలిపిన ఓ పవర్ఫుల్ కథతో అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ డివోషనల్ మూవీ 'కనకదుర్గ'. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, నవరాత్రి శుభ సందర్భంగా మూవీ మేకర్స్ ఈ సినిమా నుంచి అల్లరి నరేష్ పవర్ఫుల్ పోస్టర్ను విడుదల చేశారు.

'ప్రతి ప్రార్థనలోనూ ఒక శక్తి ఉంటుంది.. ఈ నవరాత్రి వేళ దైవిక స్త్రీ శక్తిని ఆరాధిస్తూ, అమ్మవారి ఆశీస్సులు కోరుకుంటూ మా 'కనకదుర్గ' చిత్రాన్ని పరిచయం చేస్తున్నాం. త్వరలోనే మొదటి పాట కూడా రాబోతోంది' అంటూ క్యాప్షన్ జత చేశారు. ఇక పోస్టర్లో ఆరెంజ్ కలర్ దుస్తుల్లో డ్యాన్స్ చేస్తూ ఒక భక్తుడిగా, స్వామివారి లుక్లో నరేష్ కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా.. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రదీప్ మద్దాలి తెరకెక్కిస్తున్నారు. బి.వి.ఎస్. రవి కథ అందిస్తుండగా.. మ్యూజికల్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. అల్లరి నరేష్ సరసన కాజల్ చౌదరి హీరోయిన్గా నటిస్తోంది.

అప్పటి వరకూ ఖాళీనే.. రంజీ బరిలో శుభ్‌మన్ గిల్

మరో ఐదు రోజుల్లోనే న్యూజిలాండ్ పర్యటనకు భారత్ వెళ్లనుంది. కివీస్తో తొలుత టీ20 సిరీస్ను ఆడనుంది. ఆ తర్వాత వన్డేలు, టెస్టుల్లో తలపడనుంది. అక్టోబర్ 22 నుంచి పొట్టి సిరీస్ మొదలువుతుంది. ఇక వన్డేలు నవంబర్ 4వ తేదీన ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి దాదాపు రెండు వారాలపాటు భారత వన్డే, టెస్టు జట్ల కెప్టెన్ శుభ్మన్ గిల్ ఖాళీనే. ఈ క్రమంలో కీలక నిర్ణయం తీసుకున్నాడు. రంజీ ట్రోఫీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం నుంచి రెండో రౌండ్ ప్రారంభం కానుంది. ఛత్తీస్గ్ పంజాబ్ జట్టు తరఫున గిల్ ఆడనున్నాడు. కివీస్తో రెండు టెస్టుల సిరీస్ నేపథ్యంలో ప్రాక్టీస్ కోసం రంజీ మ్యాచ్ను వినియోగించుకోవాలని భావిస్తున్నాడు.

ఐదుగురిని వ్యక్తిగత నెట్ బౌలర్లుగా..



ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్కు భారత్ చేరుకోవాలంటే న్యూజిలాండ్ సిరీస్ అత్యంత కీలకం. రెండు టెస్టుల్లోనూ కివీస్ పేస్ను సమర్థంగా ఎదుర్కొనేందుకు కెప్టెన్ గిల్ మంచి ఆలోచన చేశాడు. గతంలో ఏ భారత సారథి కూడా ఇలాంటి నిర్ణయం తీసుకోలేదు. తన కోసం ఐదుగురిని వ్యక్తిగత నెట్బౌలర్లుగా న్యూజిలాండ్కు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అందుకు అయ్యే ఖర్చును తానే భరించనున్నట్లు సమాచారం. ఇప్పటికే బీసీసీఐ పలువురిని నెట్ బౌలర్లుగా పంపించనుంది. వారితోపాటు అదనంగా తీసుకెళ్లనున్నాడు. టెస్టు సిరీస్కు ముందు న్యూజిలాండ్ అ జట్టుతో భారత్ అ ప్రాక్టీస్ మ్యాచ్ను ఆడనుంది. వన్డే సిరీస్ నేపథ్యంలో గిల్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో టెస్టు సిరీస్కు నెట్ బౌలర్ల సాయంతో సన్నద్ధం కావాలని గిల్ భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

యశస్వికి చోటు దక్కకపోవడంపై అశ్విన్ మండిపాటు



న్యూజిలాండ్తో జరగనున్న వన్డే సిరీస్ విషయంలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ కు నిరాశ ఎదురైంది. అతడికి భారత జట్టులో చోటు దక్కకపోవడంపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. బీసీసీఐ సెలక్టర్ల నిర్ణయం అన్యాయమంటూ తన యూట్యూబ్ ఛానల్లో మండిపడ్డారు. ఇది దురదృష్టకరమన్నారు.

ఈ నెల 22న మొదలయ్యే న్యూజిలాండ్ పర్యటనలో భారత్ 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనుంది. నవంబరు 19న మొదలయ్యే టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం కెప్టెన్ శుభ్మన్ గిల్.. 13, 15 తేదీల్లో జరిగే చివరి రెండు వన్డేలకు దూరం కాబోతున్నాడు. ఆ మ్యాచ్లో శ్రేయస్ సారథిగా వ్యవహరిస్తాడు. ఈ క్రమంలోనే గిల్ వంటి ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చినప్పుడు జైస్వాల్కు అవకాశం ఇవ్వాల్సిందని అశ్విన్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ క్రికెట్లో తగినన్ని అవకాశాలు రాకపోవడం వల్ల జైస్వాల్ లాంటి ప్రతిభావంతుల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని, సెలెక్టర్లు ఇలాంటి అంశాలపై దృష్టిసారించాలని సూచించారు.

''గిల్కు వరుస ప్రయాణాలున్నాయి కాబట్టి అతడి పరిస్థితి అర్థం చేసుకోగలను. కేఎల్ రాహుల్ పరిస్థితి కూడా అర్థమవుతోంది. కానీ యశస్వికి అసలు ఆడే అవకాశమే దొరకడం లేదు. అతడికి అవకాశాల కోణంలోనే నేను మాట్లాడటం లేదు. ఎంపిక విషయంలో మీరు (సెలక్టర్లు) చెప్పిన పాయింట్తో ఆమోదిస్తాను. కానీ అతడి విశ్వాసం పూర్తిగా దెబ్బతింటోంది. రెండుమూడేళ్ల క్రితం అతడి బ్యాటింగ్ను ఇప్పటి శైలిని గమనించండి. అతడి ఆత్మవిశ్వాసం దెబ్బతినకుండా చూస్తూ.. సాధ్యమైన చోటల్లా అతడి అవకాశం ఇవ్వడం జట్టు యాజమాన్యం, సెలక్టర్ల బాధ్యత. నేనే ఎంపిక కమిటీలో ఉండి ఉంటే.. రెండు మ్యాచ్ల్లో అవకాశం ఉంది.. ఆడుతావా? అని అడిగేవాడిని. అంతర్జాతీయ మ్యాచుల్లో ప్రాతినిధ్యం కంటే మించింది ఏముంటుంది'' అని సెలక్టర్ల నిర్ణయాన్ని అశ్విన్ తప్పుపట్టారు.


హృదయాలను హత్తుకుంటున్న 'ఆకాశంలో ఒక తార' టీజర్



మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలెంటెడ్ డైరెక్టర్ పవన్ సాదినేని కాంబినేషన్లో తెరకెక్కుతున్న మూవీ 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయం అవుతుండటం విశేషం. లైట్బాక్స్ మీడియా బ్యానర్ సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి.ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ ప్రారంభించిన మూవీ మేకర్స్.. తాజాగా 'ఆకాశంలో ఒక తార' టీజర్ను విడుదల చేశారు.

'కల తనది.. నమ్మకం కృష్ణది.. కానీ ప్రయాణం వారిద్దరిది' అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్తో వదిలిన ఈ టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. టీజర్ విషయానికి వస్తే.. చదువంటే ఎంతో ఇష్టమున్న కల్పన అనే అమ్మాయి జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించి ఊరికి మంచి పేరు తెచ్చిందనే వాయిస్ ఓవర్తో ప్రారంభమవుతుంది. 'అమ్ములు నువ్వు కష్టపడి చదువుతానంటే.. నేను చదివిస్తా' అని చెప్పే హృదయానికి హత్తుకునే డైలాగ్తో దుల్కర్ సల్మాన్ కృష్ణ పాత్రలో ఎంట్రీ ఆకట్టుకుంటుంది. పల్లెటూరి అమ్మాయిగా సాత్విక వీరవల్లి తన నటనతో మెప్పించింది. తల్లిదండ్రులు ఇంటికే పరిమితం చేయాలని చూసినా, భర్త కృష్ణ ఆమెను చదివించి అంతరిక్షం వరకు వెళ్లేలా ప్రోత్సహిస్తాడు. ఇక ఈ క్రమంలోనే శృతి హాసన్ సిగరెట్ తాగుతూ ఊరమాస్ అవతార్లో ఇచ్చిన ఎంట్రీ టీజర్కే హైలైట్గా నిలిచింది.


ముంబై ఇండియన్స్ కీలక ప్రకటన.. అతడికి గుడ్‌బై



ఐపీఎల్-2027 ఆరంభానికి ముందు శ్రీలంక దిగ్గజ క్రికెటర్ మహేళ జయవర్దనె ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ తో బంధం తెంచుకున్నాడు. ఎంఐ హెడ్ కోచ్ పదవి నుంచి అతడు తప్పుకొన్నాడు. ఇందుకు సంబంధించి ముంబై ఇండియన్స్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ''ముంబై ఇండియన్స్ లో మహేళ జయవర్దనె కేవలం హెడ్ కోచ్ పాత్రకే పరిమితం కాలేదు. అంతకంటే ఎక్కువే చేశాడు. అతడి మార్గదర్శనంలో ముంబై ఇండియన్స్ మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచింది'' అంటూ ఉద్వేగపూరిత వ్యాఖ్యలతో జయవర్దనెకు వీడ్కోలు పలికింది.

పప్పు, బెల్లాల కోసం దుకాణాల ముందు నిలబడేవాళ్లం : ఇళయరాజా

సంగీత దర్శకుడు ఇళయరాజా ఇప్పుడు కోట్లాది మంది సంగీత ప్రియుల గుండెల్లో సంగీత వీణను మీటే ఆరాధ్యుడు అనే చెప్పాలి. రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయన ఆర్థికంగా బాగా బలపడ్డారన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఈ సంగీత జ్ఞాని ఆరంభ జీవితం గురించి చాలా మందికి తెలియదు. ముఖ్యంగా జెన్ జీ తరానికి తెలిసే అవకాశమే లేదు. కడు పేదరికంలో పెరిగారు ఆయన. హార్మోణి పెట్టే భుజాన వేసుకుని గ్రామాల్లో పాటలు పాడుకుంటూ పొట్టబోసుకున్నారు. చైన్నెకి చేరుకున్న తర్వాత కూడా గుప్పెడు కడుపు నింపుకోవడానికి పలుపాట్లు పడ్డారు. ఈ విషయాన్ని స్వయంగా ఇళయరాజా వెల్లడించారు. ఆయన శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఒక వీడియోలో ఆసక్తికరమైన విషయాలను పేర్కొన్నారు.



''నేను చైన్నెకి వచ్చిన 1958 ప్రాంతంలో నవరాత్రి ఉత్సవాల సమయంలో తినడానికి కూడా కష్టపడ్డాం. నేను, భాస్కర్ (సోదరుడు), దర్శకుడు భారతీరాజా మూడు రాత్రులు పస్తులు ఉన్నాం. అలాంటి సమయంలో స్థానిక వడపళనిలోని ఆలయం ఎదురుగా దుకాణాల్లో పూజలు చేసి అటుకులు, మరమరాలు, పప్పు బెల్లాలు పంచేవారు. నేను, భాస్కర్, భారతీరాజా ప్రతి దుకాణం ముందు వరుసలో నిలబడి వాటిని తీసుకెళ్లి రూమ్లో ఒక పేప్ప వేసి తింటూ రోజులు గడిపాం. ఆ తర్వాత ఈ విషయాన్ని నా భార్యకు చెప్పాను. ఆమె నవరాత్రుల సమయాల్లో పలువురిని పిలిచి పులిహోర, పెరుగు అన్నం పొట్లాలను పంచుతూ వచ్చారు.

ఆ తర్వాత పలువురు సంగీత కచ్చేరిలను నిర్వహించినప్పుడు సంగీత కళాకారులకు భోజనాలు పెట్టడం ఆనవాయితీగా మారింది. దీన్ని ప్రచారం చేసుకోవాలని కాదు గానీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎవరూ పస్తులు ఉండకూడదు అనే అలా చేసేవాళ్లం'' అని ఇళయరాజా పేర్కొన్నారు.

'తెలంగాణ సినిమా అంటే కేవలం నక్సలైట్ కథలే కాదు'.. : దిల్ రాజు

సినీ రంగంలో రాణించడానికి కేవలం 'టాలెంట్' మాత్రమే ముఖ్యమని, ప్రతిభ ఉన్నవారిని ఇండస్ట్రీలో ఎవ్వరూ ఆపలేరని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. నూతన ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను ఎఫ్డీసీ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించడానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కనే ముఖ్య కారణమని దిల్ రాజు వెల్లడించారు. సీఎంతో పాటు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు ముగ్గురూ చర్చించి తనను ఈ పదవికి ఎంపిక చేశారని.. పరిశ్రమ అభివృద్ధి కోసం పని చేయాలనే ఉద్దేశంతోనే ఈ బాధ్యతలు స్వీకరించానని తెలిపారు.



తెలంగాణ సినిమాల్లో వచ్చిన మార్పు..

తెలుగు సినిమా పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు కళ్లలాంటివని దిల్ రాజు అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ సినిమాలు అంటే కేవలం విప్లవాత్మక, అభ్యుదయ లేదా నక్సలైట్ నేపథ్య చిత్రాలుగానే కనిపించేవని గుర్తుచేశారు. కానీ గడిచిన మూడేళ్లుగా ఆ పరిస్థితి మారిందని 'బలగం' సినిమా నుంచి తెలంగాణ ప్రాంతీయ నేపథ్య కథలతో కొత్త తరహా సినిమాలు విజయవంతంగా తెరకెక్కుతుండటం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ అవార్డుల కార్యక్రమానికి ఏకంగా 2,500 ఎంట్రీలు రావడం తెలంగాణలో సినీ ప్రతిభావంతులు ఎంతమంది ఉన్నారో చాటిచెబుతోందన్నారు. అవార్డులు సాధించిన విజేతలకు అభినందనలు తెలియజేస్తూ, అవార్డు రాని వారు కూడా నిరాశ చెందకుండా తమ టాలెంట్పై నమ్మకంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నా ప్రతిష్టకు భంగం కలిగించే ఆ కంటెంట్‌ను తొలగించండి..

చర్యలు తప్పవంటూ నేహా శర్మ వార్నింగ్

ఇటీవలి కాలంలో సినీ నటీమణుల రూపాన్ని ఏఐ ద్వారా దుర్వినియోగం చేయడం తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై ఇప్పటికే చాలామంది రియాక్ట్ కాగా.. తాజాగా, తన ప్రతిష్టను కాపాడుకునేందుకు నేహా శర్మ రంగంలోకి దిగి లీగల్ వార్నింగ్ ఇవ్వడం నెట్టింట సంచలనం సృష్టిస్తోంది. కొందరు వ్యక్తులు తన ప్రమేయం లేకుండానే తన ముఖాన్ని, రూపాన్ని ఉపయోగిస్తూ ఏఐ ద్వారా నకిలీ వీడియోలు, చిత్రాలను సృష్టిస్తున్నారంటూ ట్విట్టర్ వేదికగా సంచలన పోస్ట్ పెట్టారు. సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ మార్ఫింగ్, ఫేక్ కంటెన్ట్ ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన అనుమతి లేకుండా తన ఫేస్ లేదా రూపాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా కంటెంట్ క్రియేట్ చేస్తున్న వారు వెంటనే ఆ పనిని ఆపేయాలని హెచ్చరించారు.

ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అటువంటి ఫేక్ వీడియోలు, చిత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తన గుర్తింపును ఇలా దుర్వినియోగం చేస్తూ తనను తప్పుగా చిత్రీకరించడం, ప్రతిష్టకు భంగం కలిగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దీనిని ఒక అధికారిక హెచ్చరికగా పరిగణించాలని ఆమె తేల్చి చెప్పారు. అంతేకాకుండా, నకిలీ ఖాతాల వెనుక దాక్కున్నా లేదా ఏఐ టెక్నాలజీని ఉపయోగించినా బాధ్యులు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేహా శర్మ హెచ్చరించారు. ఈ విధమైన కంటెంట్ను తయారు చేసినా, పోస్ట్ చేసినా లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేసినా సరే ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బాధ్యులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.